శ్రీకృష్ణలీలలు

ముళ్లపూడి వెంకటరమణ

చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ
బంగారు మొలతాడు పట్టుదట్టి
సందిట తాయెతు సరిమువ్వ గజ్జెలు
చిన్నికృష్ణ! నిన్ను చేరి కొలుతు.

పూజ

నల్లని వానికి
తెల్లని నవ్వుల వానికి
...shmi Srimurthy
చల్లని చూపుల వానికి
అల్లరి చేష్టల వానికి
దేవుడై పుట్టి మనిషిలా నటిస్తూ మహిమలు చేసిన వానికి
మనిషిగా పెరుగుతూ మనుషులచేత కూడా
మహిమలు చేయించిన వానికి
మనిషి కూడా దేవుడవచ్చునని ధైర్యం చెప్పిన వానికి
అందుకు దారివేసిన వానికి

అబద్ధాలు చెప్పిన వానికి
చెప్పించిన వానికి

మనిషిలో దానవుడిని దండించిన వానికి
దానవుడిలో మానవుడిని సృష్టించిన వానికి
ధర్మా ధర్మాలనూ
సత్యా సత్యాలనూ
నిత్యా నిత్యాలనూ
కృత్యా కృత్యాలనూ 'ఎరుక' పరచుకొని
వాటి నిజరూపాలను చూసే 'దారి' చూపించిన వానికి

'పుట్టుక చెరసాల' చెరనుంచి
బయటపడే దారి చూపిన వానికి
దుఃఖాల నరకాలలో ఏడవకుండా
సుఖాల మోసాలలో చెరపడకుండా
బయటపడే దారి స్వరపరచిన వానికి

'ఎరుక' సమగ్రమైన వానికి
హాయిగా నవ్వి నవ్వించిన వానికి
పాడి పాడించిన వానికి
ఆడి ఆడించిన వానికి

కురుక్షేత్రంలో ధర్మక్షేత్రాధిపతిగా నిలచిన వానికి
చేత వెన్నముద్ద, చెంగల్వ పూదండ, మురళీ మాత్రమే ధరించి
తాను ఆయుధం పట్టకుండా
పరుష వాక్యం పలకకుండా
భీకర సంగ్రామం నడిపించిన సారథికి
పార్థ హృదయ సారథికి.—

ప్రతి మనిషికీ ఒక మురళిగా
ప్రతి మనిషి మనసునూ మురళిలో స్వరద్వారంగా
ప్రతి మనిషి మనసులో పలికే మాటనూ
పలుక దలచిన మాటను
పలుక లేని మాటను
పలుక రాని మాటను
పలుక దలచుకోని మాటను
తాను
పలికించ దలచిన మాటగా
సప్త స్వరాలలో పూరించి

గోవులలో గోపాలకులలో
గోమాత పిలుపులో
గోబాల పలుకులో
గోపిక విరహంలో పలికే 'హే కృష్ణా' స్వరంలో
గోపిక ధన్యురాలై పలికే 'హా కృష్ణా' స్వరంలో

దేవకి ఏడుపులో
యశోద నవ్వులలో
కంసుడి ఆక్రందనంలో
దుర్యోధనుడి దీనారావంలో
భీముడి విజయ శంఖారావంలో
భువనైక మోహనంగా
దివికీ భువికీ తన వరంగా
భగవద్గీతా స్వరంగా
పలికించిన

సంగీత శృంగార రస రాజ్యాధినేతకి
కర్మ ధర్మ చక్ర వర్తికి—

ఎన్నిసార్లు చదువుకున్నా
చెప్పుకున్నా
విన్నా వినిపించినా
ఆలోచించినా
తనివి తీరని
చెన్ను తరగని
ఆయన కథల నన్నిటినీ మాలలు కట్టి అలంకరించాలన్న
ఆశతో
ప్రేమతో
గౌరవంతో
సంభ్రమంతో
ఆశ్చర్యంతో
ఆనందంతో
భక్తితో
ఈ తొలి హారాన్ని కట్ట సమకట్టి—

ఈ కథల కథా నాయకునకు
నమస్కరించి.........

ధర్మానికి ఆపదవాటిల్లినపుడు- మంచివాళ్ళమీద కొందరు చెడ్డ వాళ్ళు చెలరేగి బాధలు పెడుతున్నపుడు భగవంతుడు భూమికి దిగి వస్తాడు. అధర్మానికి వడిగట్టిన వ్యక్తులను, వారి శక్తులను సంహరించి ధర్మాన్ని తిరిగి స్థాపిస్తాడు. మంచివాళ్ళని కాపాడి మంచి చేస్తాడు. ఈ పనులు చేయడానికి ఆయన భగవంతుడి రూపంలో కాకుండా- జీవకోటిలోని ఏదో ఒక రూపంలో వస్తాడు. చేప, తాబేలు, వరాహం సగం మనిషి సగం జంతువు ఇలా అనేక రూపాలు ధరించాడు. చాలా సార్లు మనిషి రూపంలో వచ్చాడు. ఈ రూపాలనే దేవుడి అవతారాలు అంటారు. మనసుపెట్టి ప్రయత్నిస్తే మనిషి కూడా దేవుడిలాగే గొప్ప పనులు చేయగలడని ధైర్యం చెప్పడం దారి చూపడం - ఈ అవతారాల పరమార్థం అంటారు.

భగవంతుడు- ధర్మ సంస్థాపనకోసం పది అవతారాలు ఎత్తాడు. అవి- మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన భృగురామ రఘు రామ బలరామ, బుద్ధ కృష్ణ కల్కి అవతారాలు.

బ్రహ్మకల్పం ముగిసి, జలప్రళయం చెలరేగే వేళ ... కొద్ది సంవత్సరాలలో సృష్టిలో జీవకోటి అంతా నీట మునిగి నాశనం కాబోతూంది-

ద్రవిడదేశపు రాజు సత్యవ్రతుడు కృతమాలిక నది వద్దున తపస్సు చేస్తున్నాడు. ఒకనాడు నదిలో స్నానంచేసి సూర్యభగవానుడికి అర్ఘ్యం ఇవ్వడానికై దోసిట నీళ్ళు తీశాడు.

'రాజా నన్ను కాపాడు. నీటిలో విడవకు'- అన్నమాటలు విని కన్నులు తెరిచి చూశాడు. దోసిటలోని నీటిలో చిన్న చేపపిల్ల కనబడింది.

'ఓ రాజా... నదిలో పెద్ద చేపలు నన్ను మింగెయ్యాలని చూస్తున్నాయి. నేను చిన్నదాన్ని నన్ను కాపాడు' అంటూ దీనంగా చూశాయి మీన నేత్రాలు...

రాజు జాలిపడి ఆ చేపను తన కమండల జలంలో ఉంచాడు. అర్ఘ్యం ముగించి ఆశ్రమం చేరే వేళకి ఆ చేపపిల్ల పెరిగి పెద్దదై కమండలం అంతా నిండిపోయింది.

'రాజా... ఇందులో వూపిరి ఆడడంలేదు... కొంచెం విశాలమైనచోట ఉంచవా?'- అంది.

రాజు ఆ చేపని ఒక పెద్ద కుండలో వుంచాడు. అంతలోనే అది కుండ నిండిపోయింది. రాజు దానిని బావిలో దించాడు. అదీ చాలదు... ఆశ్చర్యంతో చెరువులో ఉంచాడు. అది క్షణ క్షణానికీ పెరగసాగింది. చివరకు దానిని సముద్రం దగ్గరకు చేర్చాడు... అక్కడ అది సముద్రాన్ని మింగేటంత రూపం ధరించింది.

రాజు సంభ్రమాశ్చర్యాలతో చేతులు జోడించాడు.

'ఇది నీ నిజరూపంకాదు... నీవు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడివి' అన్నాడు.

మీన రూపుడైన శ్రీహరి రాజును కటాక్షించాడు.

'రాజా నేటి కేడవనాడు జగత్ప్రళయం వస్తుంది. ప్రళయానంతర ప్రపంచంలో జీవకోటిని తిరిగి పెంపొందించే బాధ్యత నీకు వప్పగిస్తున్నాను. ఇక్కడికి ఒక పెద్ద నావ వస్తుంది. సకల చరాచర జీవకోటినీ ఒక్కొక్క జాతికి ఒక జంట చొప్పున- నీవు తీసుకువచ్చి ఆ నావలో వుంచాలి. సప్తర్షులను కూడా తీసుకురావాలి... ప్రళయం వచ్చినపుడు అంతా పెనుచీకటి ఆవరిస్తుంది... ఆ చీకటిలో- ఆ ఋషుల మేని వెలుగే నీకు దారి చూపుతుంది. ఆ నావను నా కొమ్ముకి కట్టు. ప్రళయం ముగిసి ప్రశాంతత నెలకొనేవరకూ నేను మిమ్మల్ని కాపాడతాను... కల్పంతాన బ్రహ్మ కన్ను మరగినవేళ సోమకాసురుడు వేదాలను అపహరించాడు. నేను ఇపుడు వాడిని సంహరించి ఆ వేదాలను తీసుకువస్తాను... సృష్టిలో ధర్మ కర్మ ప్రవర్తనానికి జీవన విధానాలకు మార్గాలు ఏర్పరిచేవి వేదాలే... తరువాతి కల్పంలో నువ్వు వైవస్వత మను ప్రజాపతివై వేదబద్ధంగా — జీవకోటిని పాలించగలవు...' అని చెప్పాడు శ్రీ మహావిష్ణువు. సత్యవ్రతుడు ఆ ప్రకారమే చేశాడు. శ్రీహరి మత్స్యావతారుడై కడలి గర్భంలోకి వెళ్ళి సోమకాసురుడిని వధించాడు. వేదాలను సాధించి తెచ్చాడు.

చీకటి వెలుగుల— రాత్రింబవళ్ళ తరుములాటలాగే రాక్షసులకీ దేవతలకీ నిరంతరంగా పోరు జరగడం గెలుపూ ఓటమీ చావూ బతుకుల మధ్య కొట్టుకులాడడం నానాటికీ ఎక్కువైపోతూంది.

రాక్షసుల తాకిడికి తట్టుకోలేక దేవతలు బ్రహ్మదగ్గరకుపోయి మొరపెట్టుకున్నారు.

బ్రహ్మవారిని తీసుకుని శ్రీ మహావిష్ణువు దగ్గరకి వెళ్ళాడు. పాలసముద్రంలోని శతసహస్రాధికాలయిన ఓషధులు, లవణాలు ఎంతో శక్తివంతమైనవి— ఆ పాల కడలి నడుమ మంథరగిరిని నిలిపి మథిస్తే— అమృతం లభిస్తుందని— ఆ అమృతం సేవిస్తే జరా మరణాలను జయించవచ్చుననీ విష్ణువు చెప్పాడు. కాని ఇది దేవతలు ఒకరివల్లనే సాధ్యంకాదనీ— దానవజాతి చేయూతకూడా తీసుకోవాలనీ హితవు పలికాడు.

చావుని జయించవచ్చునన్న ఆశతో అసురులుకూడా ఈ ఉద్యమంలో చేయి కలపడానికి అంగీకరించారు. మంథరగిరినీ సర్పరాజు వాసుకినీ— కవ్వంగా, తాడుగా ఉపయోగించడానికి నిశ్చయించి— వాటిని ప్రార్థించి ఒప్పించారు.

సముద్ర మథనం ప్రారంభమైన కొద్ది క్షణాలలోనే పర్వతం సముద్రంలో మునిగిపోయింది. సురాసురులు దిక్కుతోచక నిరాశతో క్రుంగిపోయారు. అప్పుడు శ్రీమన్నారాయణుడు కరుణించి— కూర్మావతారం ధరించి కొండని తన మూపున ధరించాడు.

సముద్రంలో కాలుష్యాలు, విషవస్తువులు కదిలి హాలాహల విషమై విజృంభించాయి... ఆ వేడికి - ఆ తీవ్రతకు అంతా కల్లోలం చెందారు. దేవతలంతా కైలాస నాథుని ప్రార్థించారు. పరమేశ్వరుడు కరుణించి ఆ కాలకూట విషాన్ని ధరించి - మింగకుండా కంఠంలోనే ధరించాడు. తరవాత క్రమంగా ఐరావతం, కామధేనువు, కల్పవృక్షం, చంద్రుడు, శ్రీ మహాలక్ష్మి ఆపైన అమృతం ఆవిర్భవించడం జరిగింది.

అమృతాన్ని అందరూ పంచుకోవాలన్న ఒప్పందాన్ని త్రోసిరాజని, దానవులు ఆ భాండాన్ని తీసుకుపోయారు.

వంచనకి ప్రతి వంచనగా శ్రీహరి మోహినీ రూపం ధరించి రాక్షసులను సమ్మోహితుల్ని చేశాడు. తానే పంచిపెడతానని ఆ భాండం తీసుకుని - అంతటినీ దేవతలకే ఇచ్చివేశాడు.

మరొక కల్పాంతాన బ్రహ్మ నవసృష్టి రచన ఆరంభిస్తూ తన కుమారుడు స్వాయంభువుని అతని భార్య శతరూపనూ ప్రజాపత్యం వహించమని ఆదేశించాడు...

'తండ్రీ! భూమిని హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు ఎత్తుకుపోయి సముద్రంలో దాగి వున్నాడు...' అని చెప్పాడు స్వాయంభువు...

అప్పటికే శ్రీహరి ఆదివరాహ అవతారం ధరించి సముద్ర గర్భంలోకి ప్రవేశించాడు. హిరణ్యాక్షుడితో పోరాడి వాడిని వధించి తన కోరలమీద భూమిని నిలిపి పైకి వచ్చి దానిని యథా స్థానంలో వుంచాడు.

సృష్టి, పరిపాలన కొనసాగాయి.

ఆ కల్పాన్ని వరాహ కల్పం అంటారు.

తన తమ్ముడిని చంపిన విష్ణువుపై హిరణ్య కశిపుడు ప బట్టాడు. కాని విష్ణువు ఎక్కడ వుంటాడో ఎలా వుంటాడో తెలియ లేదు...

అందుకని విష్ణువును పూజించే యాగశాలలకూ ఆశ్రమాలకు ఆలయాలకూ విష్ణుభక్తులూ, గోబ్రాహ్మణాదులూ ఉండే చోట్లకూ వె వారిని హింసించి వధించసాగాడు.

దేవతలు అమృతం అంతటినీ తాగేసి చావును జయించార తాను కూడా మరణాన్ని జయించాలని సంకల్పించి - ఈశ్వరు కోసం ఘోర తపస్సు చేశాడు. ఆయన ప్రసన్నుడై వరం కో కొమ్మన్నాడు.

తనకు చావు రాకూడదని కోరాడు. తనని నరులుగాని జంతువులు గాని- పగలుగాని, రాత్రిగాని - నేలపైగాని ఆకాశంలోగాని చంపకుండా వరాలు పొందాడు.

ఈ లోపల శ్రీహరి - హిరణ్యకశిపుడి పుత్రుడు ప్రహ్లాదుడి గుండెలో హరిభక్తి జ్యోతి వెలిగించాడు. తండ్రికి కొడుకుపట్ల వైరం పెరిగింది. హరిస్మరణ మానిపించడం కోసం హిరణ్యకశిపుడు నరక క్షోభ అనుభవించాడు. కొడుకుని చంపించడానికి శతవిధాల ప్రయత్నించాడు. వా దెక్కడున్నాడో చూపరా అని బ్రతిమాలాడు.

'ఇందుగల డందు లేడని సందేహము వలదు' అన్నాడు కుమారుడు.

ఆవేశంలో అక్కడున్న స్తంభాన్ని కొట్టాడు - ఇందులో వుంటే కనబడమను అని గర్జిస్తూ—

ఆ స్తంభంలోనే శ్రీహరి - సగం మనిషి సగం జంతువుగా నరహరి రూపంలో ఆవిర్భవించాడు. పగలూ రాత్రీ కాని 'అసుర' సంధ్యవేళ - నింగీ నేలాకాని గడపమీద కూర్చుని అతడిని తన వడిలో వుంచి - ఆయుధం కాని ఆయుధం గోళ్ళతో పొట్ట చీల్చిచెండాడాడు... నరసింహస్వామి.

వంచనని వంచనతో - బలాన్ని బలంతో సాధించి మరో దుష్ట శక్తిని నాశనం చేశాడు నారసింహుడు.

○ ○ ○

హరిభక్తుడు ప్రహ్లాదుడి మనుమడు బలిచక్రవర్తి... దానవ జాతిని మోసగించి అమృతాన్ని తీసుకుపోయిన దేవతలమీద ధ్వజమెత్తి వెళ్ళాడు బలిచక్రవర్తి...

అతన్ని ఎదిరించి గెలిచి నిలబడడం అసాధ్యమనీ ఇంద్ర పదవినీ స్వర్గాన్నీ అతనికి వదిలి పారిపొమ్మనీ ఇంద్రుడికీ దేవతలకీ హితవు చెప్పాడు బృహస్పతి.

బలిచక్రవర్తి త్రిలోకాధిపత్యంతో ఆగక పదునాలుగు భువనాలనూ పాదాక్రాంతం చేసుకోవాలని - విశ్వజిద్యాగం తలపెట్టాడు.

దానధర్మాలూ పుణ్య కార్యాలూ అన్నీ దేవతల వరవడిలోనే చేస్తూ యాగం ఆరంభించాడు - మార్గం మంచిదైనా లక్ష్యం చెడ్డది... అతను జయిస్తే దానవజాతి విజృంభిస్తుంది. బలహీనులు బతకడం అసాధ్యం అవుతుంది. ధర్మం సర్వనాశనం అవుతుంది. అతనిని అణచడం కోసం శ్రీ మహావిష్ణువు త్రివిక్రముడై అవతరించి - వామనమూర్తిగా యాగ స్థలికి వచ్చాడు. సభ అంతా ముగ్ధులైపోయారు ఆ వర్చస్సు చూసి... అర్ఘ్యం పాద్యం ఇచ్చి—

'ఏం కావాలి బాబూ ?' అన్నాడు బలి.

'ఏమివ్వగలవు ?' అన్నాడు వటువు.

ఇవ్వగలిగిన వన్నీ వల్లించాడు బలి.

మూడడుగుల నేల చాలు - అన్నాడు వామనుడు.

దానాన్ని ధారపోయడానికై కమండలం అందుకున్నాడు బలి.

కులగురువు శుక్రుడికి వామనుడి నిజ స్వరూపం స్ఫురించింది.

'అడిగేవాడు శ్రీమహావిష్ణువు. నిన్ను నాశనం చేస్తాడు. దానం యివ్వకు' అని హితవు చెప్పాడు.

'శ్రీ మహాలక్ష్మి శిరస్సును నిమిరిన చేయి - మీదు కిందైనా

ముందు దేహీ అని నిలిస్తే - అంతకన్న మహద్భాగ్యం ఏముంది... అంతేకాదు ఆడి తప్పితే నా బతుకేముంది' అంటూ బలి, ధారపోశాడు.

(వామనుడు త్రివిక్రముడై ఎదగసాగాడు. బలి పైకి చూశాడు. సూర్యబింబం ఆ వామనుడి తలపై గొడుగులా కనబడింది - తర్వాత శిరోరత్నమై వెలిగింది. ఆ వెనుక కర్ణాభరణంగా ఆ పిమ్మట గళాభరణంగా సౌవర్ణ కేయూరంగా ముంజేతి కంకణంగా - మొలనూలి గంటగా భాసించింది. చివరకు పాదపీఠమై పోయింది.)

అణువంత వటుడు బ్రహ్మాండ మూర్తియై నిలిచాడు. ఒక పాదంతో భూమండలాన్నీ రెండో పాదంతో పదునాలుగు భువనాలనూ ఆక్రమించాడు...

'మూడవ అడుగుకి చోటేదీ' అని అడిగాడు.

దిగ్భ్రాంతుడైన బలిచక్రవర్తి విశ్వరూప దర్శనంతో ధన్యుడైనాడు.

'నాది అన్నచోటు ఇంకేదీ లేదు - ఈ శిరస్సు తప్ప' అని తలవంచాడు బలి. అతని తలపై తన పాదతల ముంచాడు హరి.

బలిని పాతాళ లోకానికి పంపి పట్టం కట్టాడు.

అతని దురాలోచనకు ఈ దండన విధించినా - అతని సదాచరణకు సంతోషించి పాతాళంలో బలి ఇంటి వాకిట కావలి నిలిచాడు శ్రీ మహావిష్ణువు - ధర్మ వర్ధిష్ణువు...

○ ○ ○

దయ దాక్షిణ్యం లేకపోవడమే కాకుండా క్రూరత్వం విజృంభించగా సంహారకాండ గావించిన అవతారం పరశురామావతారం.

అవతార పరమార్థం దుష్టశిక్షణే అయినా - పరశురాముడి క్రౌర్యం గురించి ఒక చిత్రమైన కథ వుంది.

పరశురాముడి తాత ఋచికుడనే ఋషి - గాధిరాజు కుమార్తె సత్యవతిని మోహించి - పెళ్ళి చెయ్యమని కోరాడు.

బ్రాహ్మణుడికి పిల్లనివ్వడం ఇష్టంలేక ఆ సంగతి చెప్పడానికి ధైర్యం చాలక - నల్లటి చెవులున్న తెల్ల గుర్రాలను వేయింటిని తెచ్చి

కానుక ఇమ్మన్నాడు గాధిరాజు. ఇది మునికి సాధ్యంకాదన్న భావంతో. కాని రుచికుడు వరుణుడి నడిగి వేయి గుర్రాలూ తెచ్చాడు. సత్యవతిని వివాహం చేసుకున్నాడు.

కొన్నాళ్ళకి సత్యవతి, ఆమె తల్లి ఇద్దరూ సంతానం కోరి దానికై పూజలు చేయించమని రుచికుడిని అడిగారు.

రుచికుడు తన భార్యకోసం బ్రాహ్మణ తేజంతోనూ అత్తగారికి రాజ తేజంతోనూ సంతానం కలగడానికి పూజలూ హోమాలు చేసి హోమాన్న ప్రసాదాలను ఒకచోట వుంచి నదికి వెళ్ళాడు.

తల్లీ కూతుళ్లు ఆ ప్రసాదాలను తారుమారు చేసి ఆరగించారు.

'ఈ పొరబాటువల్ల మీ అమ్మకి బ్రహ్మతేజంగల కొడుకు - నీకు పరమ క్రూరుడైన కొడుకు పుడతారని' రుచికుడు చెప్పాడు.

సత్యవతి దుఃఖించ సాగింది.

రుచికుడు జాలిపడి ఆమె కుమారుడు కాక మనుమడు క్రూరుడై జన్మిస్తాడని చెప్పాడు.

ఆ ప్రకారమే గాధిరాజు కొడుకు విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అయ్యాడు.

రుచికుడి మనుమడు - జమదగ్ని కొడుకు - పరశురాముడయ్యాడు.

పరశురాముడి క్రౌర్యానికి ప్రబల నిదర్శనం - తల్లిని అన్నలను గండ్ర గొడ్డలితో తలలు నరికి చంపడమే.

జమదగ్ని భార్య రేణుకాదేవికి - గగనంలో విహరిస్తున్న చిత్రరథుడనే గంధర్వుడిని చూసి క్షణకాలం పాటు మనసు చలించింది.

శరీరంతో చేసిన పాపాని కిదేమీ తక్కువకాదని జమదగ్ని ఆమెకు మరణదండన విధించి - కొడుకుల్ని పిలిచి తల్లిని చంపమన్నాడు. వాళ్ళు అందుకు నిరాకరించారు. అంతలో పరశురాముడు వచ్చాడు. తండ్రి తన ఆనతి చెప్పాడు. పరశురాముడు తక్షణం తల్లినీ అన్నలనూ తెగనరికి చంపాడు. తండ్రి ప్రసన్నం కాగానే వాళ్ళకి ప్రాణదానం చేయమని వరం కోరి వాళ్ళని బ్రతికించుకున్నాడు.

ఒకనాడు - రాముడు లేనివేళ కార్తవీర్యార్జునుడు జమదగ్ని ఆశ్రమానికి వచ్చాడు - తన యింట వున్న కామధేను కటాక్షంతో అందరికీ షడ్రసోపేతంగా విందులు చేశాడు ముని. రాజు ఆ ధేనువును తనకు ఇమ్మన్నాడు. ఋషి కాదన్నాడు. రాజు బలం చూపి ధేనువును లాక్కుపోయాడు.

పరశురాముడి కిది తెలియగానే - ఆగ్రహావేశుడై మాహిష్మతీ పురానికి వెళ్ళి - కార్తవీర్యార్జునుడి వేయి చేతులను నరికి కుప్పలు పోశాడు. వేలాది సైనికులను వధించాడు. చివరికి రాజు శిరస్సును ఖండించాడు. కొండంత రాజు నేల కొరిగాడు.

పట్టపురాజుని చంపడం బ్రహ్మహత్యకు సమానం అని చెప్పి పాపనివారణార్థం తీర్థయాత్రలు చేసిరమ్మని ఆదేశించాడు తండ్రి. రాముడు యాత్రలకి వెళ్ళాడు.

కార్తవీర్యార్జునుడి కొడుకులు పదివేలమంది - రాముడు లేనివేళ దండెత్తివచ్చి జమదగ్నిని చంపి పగదీర్చుకున్నారు...

రాముడు రాగానే జరిగినది చెప్పి భోరున ఏడుస్తూ ఇరవై ఒక్కమార్లు గుండెలు బాదుకుంది తల్లి.

అగ్ని పర్వతం కదిలింది.

ఒకనాడు దేవతలని దానవులు హింసించారు. ఈనాడు అధికార

దర్పం అహంకారం మదం మత్సరం ఆవేశించిన మానవులే దానవులై పోయారు.

కాపాడవలసిన రాజులే అరాజకత్వాన్ని తెచ్చారు...

రాముడు పరశువుతో తరలివెళ్ళి - ఇరవై ఒక్కమార్లు దండెత్తి ముఖ్య పట్టణాలనుండి మూలమూలలనున్న వాళ్ళని కూడా వెదికి క్షత్రియ కులం అంతటినీ సమూలంగా సర్వనాశనం చేశాడు. తర్వాత తపోభూమికి తరలి వెళ్ళిపోయాడు...

బ్రాహ్మణుడైన పరశురాముడు క్షత్రియుల మదం అణచి వెళ్ళాడు.

కాలచక్రం తిరుగుతూంది. కొంత కాలానికి బ్రాహ్మణుల అహం మదం పెరిగాయి... రావణబ్రహ్మ పరమేష్ఠినుండి చావు లేకుండా వరాలు పొందాడు. జాతి జాతినీ పేరు పేరునా పేర్కొన్నా నరవానర జాతులను మరిచిపోయాడు.

అందువల్ల - తాను నరుడై, దేవతలను వానరులుగా రమ్మని భూమికి దిగివచ్చాడు శ్రీమన్నారాయణుడు.

కాంతా కనకాలమీద దురాశవల్ల అధర్మం, అసత్యం, స్త్రీలోలత, అక్రమాలు చెలరేగిన రాజ్యంలో ఆదర్శ మార్గాన్ని ఏర్పరచి - తా నా

మార్గంలో నడిచి కష్టసుఖాలను సమభావంతో స్వీకరించి దుష్ట శిక్షణ శిష్టరక్షణ సాధించాడు రాముడు. అందుకే రామ కథను రామాయణం అన్నారు. రామాయణం అంటే రాముడు నడిచిన దారి అని అర్థం.

రావణాది రాక్షసులను సంహరించాక రాముడు అయోధ్యకు రాజై పదకొండు వేల సంవత్సరాలు చల్లగా పాలించాడు. రామ రాజ్యంలో ప్రజలు ఏ బాధలూ భయాలూ లేకుండా సుఖంగా జీవించ సాగారు.

కాని మనిషి బుద్ధి విచిత్రమైనది.

ఏమీ లేనినాడు - కడుపునిండా తినడానికి తిండి, కంటినిండా నిద్రా దొరికితే అదే పదివేలనీ, అదే స్వర్గమనీ, ఆ కాస్త ఇవ్వమనీ దేవుడికి మొక్కుతారు. తీరా కడుపునిండా తిండి దొరికి, ప్రాణం హాయిగా వున్నవేళ - నోరు అన్నం తింటున్నవేళ బుద్ధి గడ్డికరుస్తుంది. పెడదారిన పడుతుంది. అప్పుడు తన నోటి దగ్గర కూడు కన్న ఎదటివాడి కూడు రుచిగా అనిపిస్తుంది. తన భార్య కన్న పరుడి భార్య చక్కగా కనిపిస్తుంది. 'పంచ'దారకన్న పరదార తీయగా తోస్తుంది. నూరేళ్ళ ఆయుస్సున్నా చాలదు. చావే రాకూడదు. తను నాయకుడైతే చాలదు. రాజు కావాలి. మహారాజయ్యాక రాజాధి రాజు- ఆపైన భగవంతుడినే అవాలని ఆశ అహం ఆవరిస్తాయి...

రామరాజ్యం తరవాత ద్వాపర యుగం వచ్చింది...

కొంతకాలం ధర్మరాజ్యం సాగాక-

మనుషులలో ఇలాంటి కోరికలు చెలరేగాయి. వీటిని సాధించడం కోసం తపస్సులుచేసి సాధనచేసి భయంకరమైన అస్త్రాయుధాలు సంపాదించసాగారు.

ఈ మహాస్త్రాలు- రాముడికాలంలో రాముడు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, రావణుడు, ఇంద్రజిత్తు వంటి ఐదారుగురికే తెలుసు. అస్త్రానికీ శస్త్రానికీ తేడా వుంది... శస్త్రాలు అంటే కేవలం కండ పుష్టిమీద, హస్తనైపుణ్యంమీద ఆధారపడే కత్తి కటార్లు, బాణాలు గదలూను. అస్త్రాలు అంటే మంత్రశక్తితో అణువులోని ప్రకృతి

శక్తిని మేలుకొలిపి రెచ్చగొట్టి శత్రువునీ వాడి రాజ్యాన్నీ బూడిదచేసే మహత్తర ఆయుధాలు. అంటే ఈనాటి ఆటంబాంబు, హైడ్రోజన్, న్యూట్రాన్ బాంబులు, ఐదారువేల మైళ్ళ దూరం వెళ్ళి అక్కడ శత్రువుని నాశనం చేసే మిస్సైల్స్ ఆనాడూ వుండేవి.

ఆగ్నేయాస్త్రం అంతటినీ తగలబెట్టేది. వారుణాస్త్రం నీటిలో ముంచెత్తి నాశనం చేసేది. వాయువ్యాస్త్రం పెనుగాలిలా సర్వనాశనం చేసేది. మోహనాస్త్రం అందరినీ మూర్ఛపోగొట్టేది... వీటిలో ఏ ఒక్కటైనా సమస్త భూమండలాన్ని సర్వనాశనం చేయగలవు...

అలాటి భయంకర అస్త్రాలు ఇప్పుడు చాలామంది చేతుల్లోకి చేరాయి. వాళ్ళందరూ మంచివాళ్ళు కారు. అందరిలోనూ రాక్షసులు దూరి ఆక్రమించారు. వారిలో ఏ ఒక్కడు తలుచుకున్నా అమాయక నిస్సహాయ జీవులను కోటాను కోట్లుగా సర్వనాశనం చేయగలడు. ఈ లోపల వారి అధికారాలకోసం- సుఖాలకోసం ఆబాల గోపాలాన్ని పీడించుకుతింటున్నారు. నెత్తురు తాగుతున్నారు. బలివేస్తున్నారు. భూమికి పాప భారం పెరిగింది. భూమాత గోమాత రూపంలో భగవంతుడి దగ్గరకు వెళ్ళి మొరబెట్టుకుంది- ఈ బాధలను వారించమని కోరుకుంది. మహావిష్ణువు కటాక్షించారు.

'ఓ భూదేవీ... పూర్వం మానవులూ దానవులూ విడివిడిగా



వుండేవారు. అధర్మం ప్రబలినపుడు నేను వచ్చి దానవులను చంపి మానవులను కాపాడాను. ఇపుడు అంతా కలిసిపోయారు. మానవులలోనే దానవులున్నారు. దానవబుద్ధి కలవారందరినీ సంహరించాలి- వారితో పాటు వారు సంపాదించిన అస్త్రాలను- వాటి గురించిన జ్ఞానాన్నికూడా నాశనం చెయ్యాలి- ఇందుకై నేను భూమికి తరలివస్తున్నాను. కంసుడై పుట్టిన కాలనేమితో ఈ సంహారకాండ ఆరంభమై కురుక్షేత్రంలో మహాభారత యుద్ధంద్వారా పరిసమాప్తమవుతుంది- కంసుడి మరణం రేపే ఆరంభం...'

భూదేవి ఆశ్చర్యంగా చూసింది.

'కంస మరణానికి ఆరంభం అంతం ఏమిటి? నీ సుదర్శన చక్రంతో ఒక్క క్షణంలో సంహరించవచ్చుగదా?'

'అది వాడికి వరప్రసాదం అవుతుంది... ఆ ప్రకారాన్ని నువ్వే చూద్దువుగాని'- అన్నాడు మహావిష్ణువు.

వికటాట్టహాసం వినబడింది.

o o o

భూలోకంలో-

మధురా నగరంలో-

కంసుడు విరగబడి నవ్వుతున్నాడు-

అది పెద్ద చెరసాల...



నరకశాల- త్రిశంకు స్వర్గంలా కంస నరకం...

కంసుడు కొందరు ఋషులను భక్తులను హింసిస్తున్నాడు. వారిని నిప్పులుచెరిగే ఎండలో వట్టికాళ్ళతో నిలబెట్టి కాళ్ళకి గొలుసులువేసి కట్టేశాడు- సరిగ్గా అడుగుదూరంలో చల్లటి నీడ- అందులో మంచినీరు- అందివ్వడానికి సిద్ధంగా చక్కని అమ్మాయిలు... కాళ్ళు నేలమీద ఆన్చలేక గెంతుతున్నారు ఋషులు- దాహంతో నాలుక పిడచకట్టుకుని పోయి నీటికోసం అర్రులు చాస్తున్నారు కొందరు- అందీ అందనంత దూరంలో నీటూ పళ్ళూ అన్నీ వున్నాయి- ఒక తల్లిని కట్టిపడేశాడు- ఆమెకు అందీ అందనంత దూరాన బిడ్డని కట్టేశాడు-

'ఎవడురా మీరు కొల్చే దేవుడు?... ఉంటే దమ్ములుంటే- రమ్మనండి- వచ్చి మీకా నీడా నీళ్ళూ అందించమనండి... నమ్మిన భక్తుల్ని కాపాడలేనివాడు దేవుడేవిట్రా- నేనే దేవుడిని... తల్చుకుంటే మీకా నీళ్ళు ఇవ్వగలను- లేదా మాడ్చి చంపగలను...ఊఁ పిలవండి...' అంటూ వినోదిస్తున్నాడు కంసుడు.

'కంస రాజా! దేవుడు నువ్వు రమ్మని పిలిచినపుడు రాడు... రావలసిన వేళ అయినపుడే వస్తాడు- చెయ్యవలసిన పని చేస్తాడు'- అన్నాడు అక్కడే కొంచెం దూరంలో నించున్న నారదుడు-

కంసుడు అటు చూశాడు.

'అవసరమైన వేళకు రానివాడు ఆపదలేం కాస్తాడు... అసలుంటేగా రావడానికి...ఆ దేవుడు వట్టిభ్రమ...మీబోటివాళ్ళ కల్పన... పామర జనాన్ని భయపెట్టి ఆశపెట్టి లోబరుచుకుందుకు మీరు వడ్డించే మత్తు మందు-' అన్నాడు కంసుడు.

అంతలో ఒక భటుడు వచ్చాడు.

'ప్రభూ...! తమ సోదరి దేవకీ- వసుదేవులవారూ కళ్యాణ మంటపం దగ్గర తమకై వేచియున్నారు- దేవకీదేవి అత్తవారింటికి వెళ్ళే సమయం ఆసన్నమైంది- తమ అనుమతికై ...'

'అనుమతి ఏమి... మేమే ఆమెను స్వయంగా సాగనంపి వస్తాము... మా అనుంగు సోదరి...' అంటూ కదిలాడు కంసరాజు...

మధురా నగరంలో మహారాజ ప్రాసాదం శోభాయమానంగా అలంకరించి వుంది. మంగళవాయిద్యాలు ఆ శోభను ముల్లోకాలూ మురిసిపోయేలా సర్వజన సమ్మోహనకరంగా కీర్తిస్తున్నాయి.

రాజ భవనం ముంగిట రథం సిద్ధంగా వుంది. దానికి ముందు దారిచూపే అశ్వాలు- వెనక సారె తీసుకు వెళ్ళే రథాలూ బారులుతీరి వున్నాయి.

మహారాజు ఉగ్రసేనుడు, మహారాణి, మంత్రి, సైనికాధికారులు, పురోహితులు- శకునం రావడానికి గో బ్రాహ్మణ సుమంగళీజనం నిలచివున్నారు.

దేవకీ వసుదేవులు కంసుడికి మొక్కారు. కంసుడు సాదరంగా లేవదీసి చెల్లెలి మూర్ధం ఆఘ్రాణించాడు. తాను చెయ్యి పట్టుకుని ఆమెను రథం ఎక్కించాడు. మహారాజు ఉగ్రసేనుడు, రాణి, పరివారం అంతా సంభ్రమంతో చూస్తున్నారు. సారథిని తప్పుకోమని సైగచేసి- కంసుడే రథం ఎక్కి పగ్గాలు అందుకున్నాడు.

నారదుడు ఇదంతా చూసి కన్నులరమోడ్చి పైకి చూశాడు.

'నారాయణ నారాయణ' అన్నాడు.

కంస సారథ్యంలో రథం వనమార్గంలో ఉత్సాహంగా సాగుతోంది.

'చెల్లీ మనం వియ్యమందాలి. నీకు ముందు కూతురే పుట్టాలి. ఆ పాపను మా అబ్బాయికిచ్చి పెళ్ళిచేసి కోడలిగా తెచ్చుకోవాలి. బావ గారితో చెప్పు కొడుకుని కంటే క్షమించనని!'

కంసుడి మాటలకి కొత్త దంపతులు ఆనందంగా నవ్వారు.

ఆకాశంలో పిడుగు పడింది. మేఘాలు గర్జించాయి. ఒక్కసారిగా చీకటి పడింది. మెరుపు మెరిసింది. కంసుడు ఆశ్చర్యపోయి రథం ఆపాడు.

'ఓ కంసరాజా! నీకా అదృష్టంలేదు. నీ చెల్లెలు నీతో వియ్యానికి రాదు. కయ్యానికే వస్తుంది. ఆమె కడుపున పుట్టే ఎనిమిదవ బిడ్డ

నీ పాలిట యముడు. వాడే నిన్ను చంపుతాడు. ఇది సత్యం' అని పలికింది ఆకాశవాణి.

'ఇది సత్యం' అన్నమాట భూసభా లదిరేలా మారుమోగింది.

కంసుడు రథంమీదనుండి ఉరికాడు. చెల్లెలినీ బావనీ తదేకంగా చూశాడు.

వాళ్ళు భయభ్రాంతులై చూస్తున్నారు.

'ఇది సత్యం - దేవకీదేవి అష్టమగర్భ సంజాతుడు నీ పాలిట మృత్యువు. ఇది సత్యం ఇది సత్యం.'

'దేవకీ' అంటూ పెద్ద కేకపెట్టి, కంసుడు ముందుకురికి దేవకి జుట్టు పట్టుకుని లాగాడు. రథం మీద నుండి ఆమె కిందికి ఉరికింది. కెవ్వున కేక పెట్టింది. 'అన్నా' అని ఆక్రోశించింది.

కంసుడు కత్తిదూశాడు. ఎడమచేత్తో ఆమె జుట్టు పట్టుకుని తల నరకబోయాడు.

వసుదేవుడు కిందకురికి అతని చేతిని పట్టుకు ఆపాడు. చేతులు జోడించి మొక్కాడు. పరిపరి విధాల బ్రతిమలాడాడు.

'చెల్లెల్ని చంపడం ధర్మంకాదు అని వాదించాడు.

'తండ్రి శపిస్తాడన్న భయంతో కన్నతల్లి నే గొడ్డలితో నరికి చంపాడు మీ పరశురాముడు. ప్రాణభయంతో నేను చెల్లెలిని-చంపడం తప్పా?' అన్నాడు కంసుడు.

'ఆమెకి పుట్టే కొడుకుగదా నిన్ను చంపేది. వాడు పుడితేనే గదా! అసలు వాడు పుట్టడు. వాడేకాదు అసలు ఆమెకి ఈ జన్మకి

సంతానం కలగదు. నేనీ క్షణంనించి బ్రహ్మచారినై సన్యాసం తీసుకుంటాను. ఆమెను చంపకు' అని బ్రతిమాలాడు వసుదేవుడు.

కంసుడు క్షణకాలం ఆలోచించాడు.

'వీల్లేదు' అని గర్జించాడు.

'మీ దేవుడు మోసగాడు. దొంగ దెబ్బల్లో వెన్నుపోట్లలో ప్రజ్ఞాశాలి. ఆనాడు హిరణ్యకశిపుడు జాతి జాతినీ పేర్కొని పగలూ

రేయీ; నింగీ నేలా; కత్తీ గదా అన్నిటిమందీ చావు రాకూడదని వరం కోరుకున్నాడు. మీ దగాకోరు దొంగ దేవుడు మనిషీ జంతువూ కలసిన నరసింహుడై పగలూ రేయీకాని అసుర సంధ్యవేళ భూమి ఆకాశం కాకుండా తన వడిలో వుంచుకుని కత్తీ గదా కాకుండా చేతి గోళ్ళతో చీల్చి చంపాడు. ఎంత మోసం! అలాగే రావణబ్రహ్మ అన్ని జాతులను పేర్కొని చావులేకుండా వరంపొందితే- అతను చెప్పమరచిన నరవానర జాతులను ఎన్నుకుని ఆ రూపాల్లో చంపాడు. మీవాడిని నమ్మను. ఎనిమిదో గర్భం అంటే ఎనిమిదో గర్భమే! నిన్ను చావనివ్వను. సన్యాసం అంతకన్నా వీల్లేదు. వాణి ప్రకటన ప్రకారం ఈ దేవకి ఎనమండుగుర్నీ కనవలసిందే! ఎనమండుగురినీ వరసగా నేను చంపవలసిందే! లేదా ఇపుడే దాన్ని చంపేస్తాను.

'వద్దు నీ మాట ప్రకారమేకానీ! ఆమెకు బిడ్డ పుట్టగానే నీకు సమర్పిస్తాను' అన్నాడు వసుదేవుడు.

'నువ్వెవడివి? నేనే ఆ పని చూస్తాను. మీ యిద్దర్నీ నా కోటలోనే ఒక పెద్ద సౌధంలో అన్ని సౌఖ్యాలతో బంధిస్తాను. సౌఖ్యాలు సమకూర్చి సంతోషం దక్కకుండా చేయడం నాకు అలవాటే. చాలా యిష్టంకూడా' అన్నాడు కంసుడు.

రథం వెనక్కు మళ్ళింది.

ం ం ం

దేవకీ వసుదేవులను చక్కని ఉద్యానవనంగల విశాలమైన సౌధంలో బందీలుగా వుంచాడు కంసుడు.

కాపలాకి పూతనని నియమించాడు.

ఆమెపై కాపలాకి ఆమె భర్తని వుంచాడు.

అతనిపై కాపలాకి అతని ప్రియురాలిని-

ఉగ్రసేన మహారాజు, రాణి వారించారు.

'నాయనా- నీవు నమ్మని దేవుడికి ఇంత భయపడడం ఎందుకు! కంటికి కనబడని వాడిగురించి ఉన్న వాళ్ళని బంధించి బాధించడం ధర్మంకాదు. వాళ్ళని విడిచిపెట్టు' అని బ్రతిమలాడింది తల్లి.

'తండ్రిగా, రాజుగా ఆజ్ఞాపిస్తున్నాను అన్నాడు రాజు ఉగ్రసేనుడు.

'కంసుడు ఆజ్ఞలు పాటించడు. ఆజ్ఞలు ఇవ్వడం ఒకటే తెలుసు- మీరుకూడా ఒక చెరసాలలో పడి వుండండి-' అని భటులకు సైగ చేశాడు. కంసుడి భటులు ఉగ్రసేనుణ్ణి బంధించారు.

'వినాశకాలే విపరీత బుద్ధిః అన్నాడు ఉగ్రసేనుడు.

'మీకా మాకా?' అన్నాడు కంసుడు విరగబడి నవ్వి.

ం ం ం

దేవకీ వసుదేవుల కలయికను సృష్టి ప్రేరేపించింది. ఇదికూడా కృష్ణలీలే!

వసంత ఋతువు మేలుకొంది. పురివిప్పి నాట్యమాడసాగింది. పువ్వులు రంగులు సంగీతం పిల్లతెమ్మెరలు సెలయేళ్ళు అన్నీ చెలరేగాయి. పశువులూ పక్షులూ అన్నీ జత గూడుతున్నాయి. కొత్త దంపతులు దేవకీ వసుదేవులకు కూడా కోరిక లేరిక లెత్తాయి. నిర్బంధం

లోనే అయినా వన విహారం చేశారు. ఆడారు పాడారు. ఒక వెన్నెల రాత్రివేళ మైమరచి కలిశారు. రతివేళ దూరాన ఆవుదూడ అంబా అని అరిచింది. దేవకి కెవ్వున కేకవేసి భర్తను దూరంగా నెట్టి వేసింది. ఆమె కళ్ళలో భయం కలవరం! ఆ తోపుకి పక్కనే వున్న పాలూ పక్షూ ఎగిరి చెల్లాచెదరై పడ్డాయి. పశ్చెం చప్పుడు గది అంతటా దంపతుల గుండెల్లో భయంకరంగా మారు మోగింది.

వసుదేవుడికి అర్థంకాలేదు.

దేవకి భోరున ఏడ్చింది. భుజంమీద చేయివేసి తట్టి దగ్గరగా తీసుకున్నాడు.

'నేను పాపిష్టిదాన్ని. అభిశప్తురాలను. దాంపత్య సుఖానికి నోచుకోని ఇల్లాలిని. పుట్టబోయే బిడ్డని కన్ను తెరవగానే దారుణంగా

మా అన్న చంపుతాడని తెలిసీ నేను గర్భం ధరించలేను. తొమ్మిది నెలలు నా రక్త మాంసాలు పంచి ఊపిరిపోసిన బిడ్డను ఆ కసాయి వాడికి బలియివ్వలేను. ఒద్దు. నాకీ సుఖం వద్దు. మీరు మరో భార్యను కట్టుకోండి. నేనిలా గొడ్రాలుగానే చస్తాను' అంటూ ఏడిచింది.

కంసుడి కంఠధ్వనితో గది అదిరిపోయింది. 'వీల్లేదు. నీ ఎనిమిదో సంతానంవల్ల నాకు ప్రాణహాని వుంది. అందువల్ల ఏడుగురూ పుట్టి చచ్చితీరవలసిందే. లేదా వాళ్ళకి జన్మనిచ్చే తల్లిదండ్రులు బలవుతారు.'

ఇద్దరూ నివ్వెరపోయి చూశారు.

ఇది భ్రమా? నిజమా!?

దేవకి చేతులలో ముఖం కప్పుకుని భోరున ఏడ్చింది.

తూలి పడింది. మూర్ఛపోయింది.

ం ం ం

ఉదయం తోటలో వున్న చిన్న కోవెల దగ్గర దేవకి తలను వడిలో వుంచుకుని నిమురుతూ వసుదేవుడు ధైర్యం చెప్పాడు.

'ఇది శాపమో వరమో ఏదైనా భగవంతుడి నిర్ణయం. మీ అన్న కంసుడిది కాదు. ఏ జన్మలోనో చేసిన పాపానికి ఇలా ఏడుగురు బిడ్డలను తెలిసీ కని బలివేసే శిక్ష పడింది; ఎనిమిదవ సంతానంగా ఆ శ్రీమన్నారాయణుడే నీ గర్భఫలంగా ఉదయించే భాగ్యం కలిగింది. దేవకీ! ఈ రాక్షసుడిని సంహరించే జగన్నాటకంలో, పరమాత్ముడిని బిడ్డగా పొందడం కోసమైనా నువ్వీ గర్భశోకం భరించక తప్పదు. సృష్టి చరిత్రలోనే ఇంతటి విలక్షణమైన శిక్ష ఎవరూ అనుభవించి వుండరు అన్నాడు.

దేవకి కళ్ళు విప్పార్చి భర్తవంక చూసింది. ఆయన చేతిని చెంపలకు అద్దుకుని నిట్టూర్చింది.

ం ం ం

ఏకాంత మందిరం.

కంసుడు మధుపానం చేస్తూ- సుందరాంగుల ఆటపాటల మధ్య

వినోదిస్తున్నాడు. కొత్త దంపతులను వేరు చేసి భర్తలను ఖైదుచేసి, భార్యలతో బలవంతాన క్రీడిస్తున్నాడు. రతిక్రీడ తారాస్థాయి చేరి తన్మయుడౌతున్న వేళ- కెవ్వుమంటూ పసిపాప పురిటికేక గుండె చీల్చుకుపోయేలా వినబడింది. ఒక్కసారిగా సంగీత నృత్యాలు ఆగి నిశ్శబ్దం ఆవరించింది.

కత్తిదూసి కదిలాడు కంసుడు.

రాజభవనం మెట్లు దిగే వేళకే- దేవకీ వసుదేవులు బిడ్డతో సిద్ధంగా వున్నారు. దేవకి నిస్పృహతో రథానికి చేరబడి నిలబడి వుంది. వసుదేవుడు బిడ్డని పొత్తిళ్ళలో చుట్టి పట్టుకున్నాడు.

'రాజా! అన్నమాట ప్రకారం తొలి చూలు బిడ్డని తీసుకు వచ్చాను. కన్నతల్లిని ఉసురుపెట్టి తీసుకువచ్చాను.'

కంసుడు అందుకోబోయాడు.

వసుదేవుడు ఒక్కడుగు వెనక్కి నడిచాడు.

'నీకు హాని చేసేవాడు ఎనిమిదో సంతానంగదా. గుడ్డు తెరవని ఈ పసికందు మీద కనికరించి ప్రాణదానం చేయవా బావా' అన్నాడు దీనంగా.

కంసుడు బిడ్డవంక తేరి చూశాడు.

గుడ్డు తెరవని పసిబిడ్డ యోగ నిద్రలో ఉన్నట్టుంది. దేవకివి చూశాడు. కళ్ళు విప్పార్చి ఆశగా చూస్తోంది. కంసుడు దూసిన కత్తిని ఖణేల్మంటూ విడిచిపెట్టాడు.

వసుదేవుడు శిరసా వందనం చేశాడు.

దేవకి ఆనందాతిరేకంతో బిడ్డని గుండెలలో పొదువుకుంది. దేవుడి మందిరంలోకి పరుగెత్తి బిడ్డని అక్కడ వుంచి మొక్కింది.

o o o

కాలచక్రం తిరుగుతూంది.

దేవకి మందిరం ఆపగురు బిడ్డల ఆటపాటలతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. పరుగెత్తే బిడ్డ. పారాడే బిడ్డ. ఉయ్యాలలో బిడ్డ. తండ్రి వడిలో బిడ్డ. తల్లి బుజాన బిడ్డ.

కంసుడు వచ్చాడు. దేవకీ వసుదేవులు బిడ్డలందరిచేతా మామకి మొక్కించారు. చివరి బిడ్డని పాదాలపై వుంచారు. కంసుడు అందుకుని బుగ్గ మీటాడు. చిరునవ్వు నవ్వి వెళ్ళాడు.

ం ం ం

కంస మందిరం-

నారదుడు విశాలంగా నవ్వాడు. 'నారాయణ! నారాయణ! ఏవయ్యా స్వామీ! ఈ వెర్రిబాగుల రాక్షసుల్ని అబద్ధాలతో దగా చెయ్యడం ధర్మంకాదయ్యా! దేవుడివి నీకు అన్నీ చెల్లినా భక్తుడిని నాకు చెల్లదే! సత్యం తెలిసి చెప్పకపోవడం అసత్యం చెప్పడంకన్నా ఘోరం' అన్నాడు నారదుడు పైకి చూస్తూ.

కంసుడు కంగారు పడ్డాడు.

నారదుడు అతనికి చెప్పాడు.

'కంసరాజా! ఎనిమిదో వాడుగదా నాకు గండం అని నువ్వు దేవకి పిల్లలు ఆరుగుర్ని హాయిగా బతకమని వదిలేశావు. అశరీరవాణి మాటని పాపం నువ్వు నమ్మి వీళ్ళమీద దయచూపావు కాని ఆ దేవుడు సూటిగా ఏదీ చెయ్యడు. సత్యం కాపాడటం కోసం అబద్ధాలు చెప్పించే ఆ దేవుడు, ధర్మాన్ని కాపాడటంకోసం అధర్మం చేయించే ఆ దేవుడు నీలాంటి అమాయకుల్ని, నోట్లో వేలుపెడితే కొరకలేని అమాయకులని, ఇలా దగా చెయ్యడం తగదు. నేను ఋషిని. అబద్ధం చెప్పనూ లేను-నిజాన్ని దాచనూ లేను. విను.

'నువ్వు కాలనేమివి. నీవాళ్ళంతా రాక్షసులు. దేవకి పిల్లలేకాదు, దేవకీ వసుదేవులూ, వ్రేపల్లెలో నంద యశోదాది గోపాలకులంతా మనుషులై పుట్టిన దేవతలు! నిన్ను చంపడంకోసం దిగి వచ్చారు. అంతా పెద్ద కుట్ర. నువ్వు గెలవటం వాళ్ళు ఓడడం ఇది నాకనవసరం.

ఉన్న సంగతి చెప్పడం మాత్రం నా ధర్మం. జాగ్రత్త!' అన్నాడు నారదుడు.

కంసుడు నివ్వెరబోయాడు.

భీకరంగా గర్జించాడు.

ం ం ం

ఒక్కసారిగా కోటి గోవులు మోరలెత్తి అరిచాయి. కోటి లేగ దూడలు 'అంబా' అని అరిచాయి. కోటిమంది తల్లులు ఏడుస్తున్నారు. కోటి పాపలు 'అమ్మా' అని అరుస్తున్నాయి.

పచ్చని అరటి చెట్లు, వాటికి చక్కని గెలలు. గోశాల దగ్గర పెద్ద కుండీ. అందులో కడవలతో పాలు గుమ్మరిస్తున్నారు భటులు. గుమ్మపాలు పున్నమినాటి సముద్రంలా నురగలు జిమ్ముతూ విజృంభిస్తున్నాయి. కంసుడి కత్తిపడి అరటిగెలని కసిగా తరిగింది. అరటి గెలలు ఆవుదూడల్లా అంబా అని అరిచాయి. పసిపాపల్లా అమ్మా అని ఏడిచాయి. పసిబిడ్డల తలలు నెత్తురు ముద్దలై ఎగురుతున్నాయి. కంసుడి కత్తి మెరుపుతీగలా వెలుగుతూ ఉరుముతూ గర్జిస్తూ విజృంభిస్తోంది. పాల నురుగుమీద నెత్తురు చిమ్మసాగింది. కల్లాపి ముంతలో జల్లి కొట్టినట్టు నెత్తురు పడుతూంది. కోటి గొంతులు ఘోష పెడుతున్నాయి. ఆర్తనాదాలు ఆకాశాన్నంటుతున్నాయి.

పాల సముద్రం రక్త సముద్రమైపోయింది. కొండంత కెరటాలు లేచి విరుచుకు పడుతున్నాయి. పాలు సుడిగుండాలు కట్టితిరుగుతున్నాయి. సుడిగుండాల 'కన్ను' నెత్తురుతో ఎర్రగా గిర్రున తిరుగుతూంది. ఆ సుడిగుండాలు పసిబిడ్డల తలకాయలను లోపలకి పీల్చేసుకుంటున్నాయి. దేవకి ఆ బిడ్డల వెంట సుడిగుండంలోకి దూకుతోంది. కంసుడు తాటితో గాలం వేసి ఉచ్చు బిగించి బయటకు లాగుతున్నాడు. అట్టహాసం చేస్తున్నాడు.

వసుదేవుడు ఒకచెట్టుకింద పరిదీనుడై కూర్చున్నాడు. దేవకి రోహిణీదేవిని వెంటబెట్టుకు వచ్చింది.

'ఆరుగురు బిడ్డల్ని బలిగొన్న మా అన్న నిజంగా రాక్షసుడే. ఆ రాక్షసుడు మనకి పుట్టవలసివున్న మిగతా ఇద్దర్నీకూడా చంపి తీరతాడు. ఎనిమిదవ సంతానం వాడినే చంపుతుందన్న అశరీరవాణి వాక్కుని నమ్ముకుని, ఆ ఆశతోనే బిడ్డల్ని కని బలివేస్తున్నాను. ప్రభూ! పుత్రశోకం అనేది అలవాటైపోయేటంత హీనస్థితికి జారిపోయింది నా హృదయం. ఒక్కటే కోరుతున్నాను. ఎనమండుగురు బిడ్డల్ని కని పోగొట్టుకున్న తల్లిగా అటుతరవాత ఒక బిడ్డ అయినా కనబడకపోతే బతకలేను. భగవంతుడికి మానవ జన్మమిచ్చిన తల్లిదండ్రులుగా మనకింత భాగ్యం కలిగినా మన బిడ్డల్ని ఒక్కసారైనా ఎత్తుకు లాలించే

భాగ్యం మనకు దక్కదు. అందువల్ల నా సోదరి మీ పెద్ద భార్య రోహిణీదేవి గర్భంలో మన వంశాంకురాన్ని నిలపమని వేడుకుంటున్నాను. ఆ ఒక్క చెట్టునీడ, ఆ ఒక్క దీపం ఇచ్చే వెలుగు- ఇవే బతుకంతా మనకి ఊపిరి' అంది.

వసుదేవుడు రోహిణి వంక చూశాడు.

○ ○ ○

వైకుంఠం-

జే గంటలు మోగుతున్నాయి. మంగళప్రదమైన సంగీతం శ్రీ మహావిష్ణువును అర్చిస్తోంది. దేవతలు స్తోత్రాలు చేస్తున్నారు. మానవుల ఆర్తనాదాలు చేరుకుంటున్నాయి. యోగనిద్రలో వున్న మహావిష్ణువు కనులు తెరిచాడు. సమస్త దేవతాగణం శిరసా మనసా వందనం చేసింది.

'దానవులనూ, దానవులావేశించిన దుష్ట మానవులనూ సంహరించే సమయం ఆసన్నమైంది. కంస వధతో ఆరంభమయ్యే ఈ ఉద్యమం-

కురుక్షేత్ర సంగ్రామందాకా కొనసాగుతుంది. నేను కృష్ణ నామధారి దేవకీ వసుదేవుల పుత్రుడిగా జన్మిస్తాను.'

'ధన్యులం' అన్నారు దేవతలు.

విష్ణువు ఆదిశేషువు వంక చూశాడు.

'రామావతారంలో నాకు తమ్ముడివై సేవలు చేశావు. ఇప్పు నాకు అన్నవై మన్ననలందుకోవాలి. అందుకై నువ్వు దేవకీమా సప్తమ గర్భంలో శయనించు. ఆ పిమ్మట యోగమాయ నీ తేజా ఆకర్షించి వ్రేపల్లెలో రోహిణీదేవి గర్భాన ఆధానం చేస్తుంది. మాయాదేవీ! అటుపిమ్మట నీవు నందుడి భార్య యశోదకు పుత్రి జన్మించు' అని ఆదేశించాడు భగవంతుడు.

దేవ దేవుడు దివినుండి భువికి తరలే మహోజ్వల సన్నివేశా ప్రకృతి వేనోళ్ళ గానం చేసింది.

o o o

ఆదిశేషువు తేజం దేవకీదేవి గర్భంలో ప్రవేశించింది.

భవనం లోపల చుట్టూరా వుండే కాపలా వాళ్ళందరికీ మ కమ్మి నిద్రకి ఒరిగిపోయారు.

యోగమాయ దేవకీ గర్భస్థ తేజాన్ని తిరిగి ఆకర్షించి ఆకాశమార్గాన వ్రేపల్లెకు కదిలింది.

o o o

వ్రేపల్లెలో నిదురిస్తున్న రోహిణిలోకి ఆదిశేషువు అం ప్రవేశపెట్టింది.

సూర్యోదయంతోబాటు బలరామ దేవుడు రోహిణి గర్భ ఉదయించాడు.

ఉత్తర క్షణాన మధురలో నిదురిస్తున్న దేవకి గుండెల పోయేలా కేక పెట్టింది. కాపలావాళ్ళు రాజసౌధంవైపు పరుగులెత్త

కంసుడు కత్తి దూశాడు.

'మోసం! దగా! దేవకికి గర్భస్రావమా! ఎనమండుగురు బిడ్డ పుడతారని చెప్పి ఏడోసారి గర్భస్రావమా! ఇదేదో నాటకం

తోస్తోంది. ఎనిమిదవ గర్భానికింకెన్ని నాటకాలు సాగుతాయో! లెండి! ఎవరక్కడ! వీళ్ళిద్దర్నీ చెరసాలలో బంధించండి. అహర్నిశలూ కాపలా వుంచండి. పూతనా! ఈసారి పూర్తి బాధ్యత నీదే- పొరబాటు జరిగిందా నువ్వు నీ భర్త నీ బిడ్డలు సర్వనాశనం అయిపోతారు జాగ్రత్త!'

అంతేకాదు మంత్రిని సేనానిని పిలిచి చెరసాలచుట్టూ వేయిమంది సైనికులను కాపలా వుంచాడు కంసరాజు.

'పసిబిడ్డ పుట్టీ పుట్టగానే మననేం చెయ్యగలడు? ఎందుకింత కలవరం ప్రభూ?' అన్నాడు వృద్ధమంత్రి.

'ఆ దొంగ దేవుడి కథలు వినలేదా? ఏడేళ్ళ కుర్రాడిగా వచ్చి బలిచక్రవర్తిని దేహీ అని చెయ్యిజాపి నెత్తిమీద కాలుపెట్టాడు. 'ఎదురు దెబ్బ కొట్టేవాడి గురించి భయపడక్కరలేదు, దొంగదెబ్బ కొట్టేవాడే ప్రమాదం' అని చెప్తారు చక్రవర్తి జరాసంధులవారు' అన్నాడు కంసరాజు.

o o o

మహాదేవుడి కోవెలలో స్వామినీ, జగన్మాతనూ అర్చించి మొక్కుతున్న వారిని,

నదిలో నిలిచి అర్ఘ్యం విడిచి ధ్యానం చేస్తున్న వారినీ,

ఆనందంగా నడిచిపోతున్న ఆలుమగలను,

కంస భటులు అనుమానంగా చూస్తున్నారు. కొందరిని పట్టి ఈడ్చుకుపోయారు.

కంసరాజు ప్రతిమకి మొక్కిస్తున్నారు.

'ఏవని మొక్కావు? ఎవడికోసం? రాజహంతకుడు వస్తాడనేనా ఆ కులుకు? ఆకాశంనించి ఊడిపడమనా, అర్ఘ్యం విడుస్తున్నావు? చెప్పు' అంటూ వాళ్ళని కొరడాలతో కొట్టి హింసిస్తున్నారు.

కంసరాజు నిలువెత్తు విగ్రహం ఒక మంటపంలో వుంది.

'కంస మహారాజే దేవుడు. ఆయన చిరకాలం ఉండాలి. మా ఆయుస్సుకూడా పోసుకుని మమ్మల్ని చల్లగా పాలించాలి' అని వాళ్ళ చేత చెప్పించి కొడుతున్నారు.

కడుపుతో వున్నవాళ్ళని కడుపుమీద తంతున్నారు.

కంసుడు మద్యం సేవిస్తున్నాడు. వినోదాలు చూస్తున్నాడు.

మద్యం ఎక్కువై కన్నులు మూసుకున్నాడు. చీకటి అయింది.

చీకటి చెలరేగింది. మధురానగరి నంతటిని కారుమేఘాలు కమ్మేశాయి. హోరున వర్షం మెరుపులు పిడుగులు.

కంసుని చెరసాలలో కాగడాలన్నీ ఆరిపోయాయి. కాపలా వారంతా మాయకమ్మి నేలకొరిగి నిద్రపోయారు. దేవకీ వసుదేవులు మాత్రం మెలకువగా ఉన్నారు. దేవకికి పురిటినొప్పులు అధికమవుతున్నాయి. అయినా ఆమె ముఖంలో ఒక గొప్ప వెలుగు. కళ్ళలో సంభ్రమం ఆనందం ఉత్సాహం. తన తనువూ జన్మా తరించే తరుణమాసన్నమైనట్టు ఆమె కళ్ళు చెప్పాయి వసుదేవుడికి.

ఆమెను తిన్నెపై పరుండబెట్టాడు. పైకి చూసి నమస్కరించాడు కన్నులరమోడ్చి.

భీకరమైన పిడుగులు వర్షం చప్పుడు అంతరించిపోయి ప్రశాంతత

నెలకొంది. అందులోంచే భువనైకమోహన వేణుగానం సహస్ర కంఠాలతో జగతిని ముంచెత్తింది. సృష్టి అంతా పరవశించిపోతూంది.

నక్షత్రాలు కోటి సూర్యప్రభలై దీపిస్తున్నాయి. జే గంటలు గుడి గుడిలో గుండె గుండెలో మారుమోగుతున్నాయి.

దేవకి ముఖం దుర్నిరీక్ష్యమైన తేజంతో, బాధతో ఆనందంతో వెలిగిపోతూంది.

అంతలోనే ఆమె కన్నులు మూతపడ్డాయి. అలసిన సొలసిన ముఖం భువన మోహనంగా పక్కకు వాలింది. తృప్తిగా నిట్టూర్చింది.

జగన్నాథుడు, జగదోద్ధారకుడు, జగత్పతి, జగత్పిత, జగదేక వీరుడు, జగదేకమోహనుడు, జగదేక వంద్యుడు, జగద్గురువు, జగన్నాటక సూత్రధారి, జగదభిరాముడు, లీలామానుషవిగ్రహుడై - చిన్ని శిశువై ఉదయించాడు.

శ్రావణ మాసం, బహుళపక్షం, అష్టమి తిథి, రోహిణీ నక్షత్రం, అర్ధరాత్రి, అభిజిన్ముహూర్తవేళ దుష్ట శిక్షణకు, శిష్టరక్షణకు, లోక కళ్యాణానికి మహోజ్వల ముహూర్తవేళ, మంచివాళ్ళకు గుండెలు పొంగేవేళ, చెడ్డవాళ్ళకు గుండెలు కుంగేవేళ, కన్నులు తెరిచీ తెరవకుండానే ఒక్క చిన్నారి చిరునవ్వుతో జగతిని కాంతి మయం చేశాడు.

సంభ్రమంతో భక్తులు; భయంతో ఆనందంతో దేవకీ వసుదేవులు పైకి చూసి చేతులు జోడించి మొక్కుతున్నారు.

జగదానంద కారకుడైన శ్రీమహావిష్ణువు చతుర్భుజుడై శంఖ చక్ర శార్ఙ్గ గదా ధారియై దర్శనం ప్రసాదించాడు.

'పుణ్యదంపతులారా! నేను మీ దాంపత్య ఫలాన్ని కావాలన్న మీ కోరికను మన్నించి నాడు ప్రశ్నివర్గుడుగా వామనుడుగా ఈనాడు కృష్ణవర్ణుడిగా మీ బిడ్డనై పుట్టాను. ఈ జన్మ తర్వాత మీకు ముక్తి లభిస్తుంది. వసుదేవా! నువ్వు శిశు రూపానవున్న నన్ను వ్రేపల్లె తీసుకు వెళ్ళి అక్కడ నందుని సతి యశోద చెంత వుంచి, ఆమె పొత్తిళ్ళలో ఉన్న యోగమాయను దేవకీ మాత వడిలో చేర్చు. దుష్టశిక్షణకూ శిష్ట రక్షణకూ కాలచక్రం ద్వారా నేను సంకల్పించి ప్రయోగించే జగన్నాటకం ఈ క్షణాన నేను జన్మిస్తున్న ఈ అభిజిన్ముహూర్తాన ఆరంభమవుతోంది. మీకు శుభం' అంటూ శ్రీ మహావిష్ణువు అంతర్థానం చెందాడు.

దేవకీ వసుదేవులను తిరిగి మాయ కమ్మింది. కొన్ని క్షణాలపాటు వసుదేవుడు కన్నులు మూసుకుధ్యానంచేశాడు. నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. దేవకి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దేవకి

వడిలో బిడ్డ కేరుకేరున ఏడుస్తున్నాడు, ఏమీ తెలియని వాడిలా. వసు
దేవుడు కర్తవ్యం గుర్తుచేసుకుని లేచి బిడ్డను అందుకున్నాడు.

దేవకిని మాయ ఆవహించింది.

వసుదేవుడు కన్నులతోనే జగన్నాథునకు మొక్కి కదిలాడు.

చెరసాల తాళం నిశ్శబ్దంగా దానంతటదే విడివడింది. తలుపు
తెరుచుకున్నాయి. కావలివాళ్ళు మాయ కమ్మి పడివున్నారు.

వసుదేవుడు నడుస్తుండగా ద్వారాలన్నీ తెరుచుకుంటూ దా
యిచ్చి తిరిగి మూసుకున్నాయి. తాళాలు అవే పడిపోతున్నాయి.

వసుదేవుడు చెరసాల దాటి బయటకు వచ్చాడు. బిడ్డపైన చెం
కప్పాడు. గుండెల్లో పొదువుకున్నాడు. అంతలో ఒక గాడిద పక్క
వచ్చింది. అదిరిపడి చూశాడు. అది మోర పైకెత్తి ఓండ్ర పె
బోయింది. వసుదేవుడు భయంతో తటాలున మోకరిల్లి, బిడ్డను ఒ
చేతిలో అదుముకుని రెండవచేత దాని పాదాలని తాకాడు. భయం
అటూ ఇటూ చూసి గిలగిలలాడాడు. గాడిద ఆలోచించి ఓండ్రపె
ప్రయత్నం విరమించుకుంది. వసుదేవుడు ముందుకు కదిలాడు.

యమునానది ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది, స్వామి
వస్తున్నాడని. ఆ నాట్యానికి వర్షం ఉరుములూ మెరుపులూ తోడైనాయి.
వసుదేవుడు భయపడి స్థాణువై నిలబడిపోయాడు. బిడ్డను రెండు
చేతులా పట్టి తన తలపైకెత్తి పట్టుకున్నాడు. చీకటిలో చిన్నికృష్ణుడు
చిరునవ్వు నవ్వాడు.

'రేపటినించి ఆటపాటలన్నీ నీ చెంతనేకదా కాస్త దారినివ్వు.
అంది చిన్నికృష్ణుడి చిరునవ్వు.

యమున ఆనందావేశాన్ని నిగ్రహించుకుని శాంతించింది.
పరవళ్ళు తొక్కడం మాని దారి నిచ్చింది. దారిని చూపింది.

కన్నులు మూసుకుని స్వామిని నమ్ముకుని యమునలో దిగి
నడుస్తున్న వసుదేవుడు మొలబంటి నీరు నేలంటి పోయిన భావన
రాగానే ఆశ్చర్యంతో కన్నులు తెరచి చూశాడు. యమునానది మధ్య
చక్కని దారి ఏర్పడివుంది. ఆ దారికి అటూ యిటూ ముకుళిత హస్తా
లతో నీటి తెరచాటున నిలిచి స్వాగతమిస్తున్న మత్స్య కన్యలూ, సర్ప
రాజములూ, జలగర్భంలోని జీవకోటి అంతా సంభ్రమానందాలతో కళ్ళు

విప్పార్చి చూస్తున్నాయి. దేవుడు మన పేటకే వచ్చేశాడని మణుల ముత్యాలు వెలుగులు వెదజల్లు తున్నాయి.

పైనించి పడే పన్నీటి జల్లుకు ఫణిరాజు పడగవిప్పి గొడుగు పట్టి అనుసరిస్తున్నాడు.

వరుణుడు - వర్ష, దేవకన్యలూ పంతంతో వానజల్లును పన్నీటి పాత్రలతో పట్టుకుని పక్కనించి జల్లి స్వామిని అర్చించబోయారు.

వేయిపడగల ఆదిశేషువు పడగలతో నాట్యమాడి ఆ పన్నీటి జల్లుకు అడ్డుపడుతున్నాడు.

వసుదేవుడికీ 'భాగవతం' తెలియదు. 'పైన' వున్న స్వామి చిరునవ్వు నవ్వుతున్నాడు.

చిన్నారి చేతితో పడగ గొడుగును దాటి పన్నీటి జల్లును అందుకున్నాడు.

స్వామి చిటికెన వేలుమీద నిలచిన చిన్నారి నీటిబొట్టు ముత్యమై తెల్లగా వెలిగింది.

స్వామి ఎర్రని పెదిమలకు చేరేవేళ అదీ ఎరుపెక్కింది. నాలికపై మాణిక్యమై వెలిగింది.

స్వామి తృప్తిగా నవ్వాడు. స్వామిని ఆహ్వానించిన భూదేవి నమస్కరించింది.

నిద్రలో యశోద నవ్వుకుంటోంది.

○ ○ ○

వసుదేవుడు వ్రేపల్లె చేరాడు. అర్ధరాత్రి. ఇక్కడ వాన లేదు. అంతా ప్రశాంతంగా వుంది.

ఇంటిముందు నందుడూ పరిచారికలూ పచార్లు చేస్తున్నారు. వసుదేవుడు అల్లంత దూరాన ఉండగానే వాటని మాయ కమ్మింది. ఎక్కడి వారక్కడ మైకంలో పడుకున్నారు.

లోపల యశోదాదేవి మంచంపై పడుకుని వుంది. ముగ్గురు నలుగురు పరిచారికలు చుట్టూ వున్నారు. పురుడు పోస్తున్నారు.

బిడ్డ శీర్షోదయం అయింది. అంతలో వారినీ మాయ కమ్మింది.

ఆ బిడ్డను పక్కమీద ఉంచగానే నిదుర కౌగిలించింది. వసుదేవుడి భార్య రోహిణి మాత్రం మెలకువగా ఉంది.

వసుదేవుడు మండువా దాటి ఆ గదిలోకి వచ్చాడు. యశోద మగతగా పడుకుని వుంది. పక్కన పసిబిడ్డ. వసుదేవుడు స్వామిని ఆ స్థానంలో పడుకోబెట్టాడు. బుగ్గలు నిమిరాడు ప్రేమతో. కంట నీరు తిరిగింది.

రోహిణి యశోద పక్కలోవున్న పాపను ఎత్తుకుని పొత్తిళ్ళలో చుట్టింది. వసుదేవుడికి అందించింది. కన్నుల కద్దుకున్నాడు.

నిదురించే యశోదకు నమస్కరించాడు. కదిలాడు. రెండడుగులు వేసి ఉండబట్టలేక తిరిగి వెనక్కు వచ్చాడు. తనకేమీ తెలియనట్టు కాళ్ళూ చేతులూ ఎగరేసి ఆడుకుంటున్న దివ్యమంగళ రూపుడిని, లీలా మానుష విగ్రహుడిని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని తనివితీరా చూశాడు. ఎంత చూసినా తనివి తీరలేదు. చేతులలో బిడ్డ కేరుమని ఏడిచింది. కర్తవ్యం గుర్తుకువచ్చి కంగారుగా బయటకు నడిచాడు వసుదేవుడు.

నడవ దాటుతూండగా,

రోహిణి ఏడాది పసిబిడ్డని ఎత్తుకువచ్చి ఎదర నిలబడింది. మోకరిల్లి శిరసా వందనంచేసి తన బిడ్డను దగ్గరగా వుంచి చూపింది.

ప్రశ్నార్థకంగా చూశాడు వసుదేవుడు.

'మన ఇంటి దీపం. దేవుడికన్న ముందుపుట్టిన అన్న' అంది రోహిణి.

'పేరు ?'

'రాముడు. బలరాముడు అని పిలుస్తున్నారు.'

'చిరంజీవ!' తన ఆశీస్సుమీద తనకే నమ్మకం లేక వసుదేవుడు నిట్టూర్చి, బాధ అణుచుకుని కన్నులతోనే ఆకాశానికి మొక్కాడు. కంట నీరు తిరిగింది. కదిలాడు. త్వరత్వరగా అడుగులు వేశాడు.

○ ○ ○

చెరసాల ద్వారపాలకులకు పసిపాప ఏడుపు కర్ణ కఠోరంగా

వినబడింది. దిగ్గున లేచారు. గదిలో చూశారు. దేవకీదేవి పక్కలో పసిపాప!

ఏడుస్తున్నాడు.

అష్టమ గర్భం!

రాజుగారికి ప్రాణగండం!

యమదూత!

'మహారాజా' అంటూ కేకలువేస్తూ పరుగెత్తారు.

○ ○ ○

రథాశ్వాలు మోరలు పైకెత్తి ముంగాళ్ళు నేలకి తన్ని ఒక్క సారి విసురుగా పైకి లేచాయి.

భూ నభా లదిరేలా భీకరంగా ఘోష పెట్టాయి. కొరడా ఛెళ్ళుమంది.

రథం ముందుకు కదిలింది.

కంసుడు మహోగ్రదగ్రుడై రథం తోలుతున్నాడు.

ఉదయపు నీరెండలో అందంగా హాయిగా మేలుకుంటున్న మధుర రథచక్రాల ధాటికి అశ్వపదఘోషకి అదరిపడసాగింది. వీధులలో కసువూడ్చే చోట్ల కొద్దికొద్దిగా లేస్తున్న ధూళి సుడిగాలికి ఎడారిలో ఇసుకలా చెలరేగి విజృంభించింది.

పసిబిడ్డలూ, ఆవులూ దూడలూ పుష్పలావికలూ నీళ్ళ పాలకావిళ్ళవాళ్ళూ కకావికలై పరుగిడుతున్నారు. పాలూ నీటూ కూరలూ పళ్ళూ నేలమీద చెల్లాచెదురుగా పడిపోతున్నాయి.

రథంలో కంసరాజు రౌద్రావేశంలో వణికిపోతూ గుర్రాలను మళ్ళీ మళ్ళీ ఛెళ్ళు ఛెళ్ళున కొడుతున్నాడు. దేవకి చెరసాల ద్వారం పెద్ద చప్పుడుతో తెరుచుకుంది. పసిబిడ్డను చేతుల్లో పెట్టుకుని దంపతులిద్దరూ కంసుడికి ఎదురు వచ్చారు. కంసుడు కత్తి దూశాడు. చేయి జాచాడు.

'అన్నా ఇది ఆడపిల్ల! అశరీరవాణి మాట అసత్యం!'

కంసుడు కత్తిని దించి ఆశ్చర్యంగా చూశాడు.

'అష్టమ గర్భాన పుట్టే పుత్రుడు గదా నీకు హాని చేసేది! కాని ఇది పుత్రిక. దీన్ని చంపకు. ఈ ఒక్క బిడ్డ ప్రాణదానంచేసి నా పుత్ర శోకాన్ని చల్లార్చు.'

'దేవకీ ఇదంతా మోసం. మీ దొంగ దేవుడు ఆడుతున్న కపట నాటకం. మొన్న ఏడవ బిడ్డ బదులు గర్భస్రావం. ఇవాళ కొడుకు కాకుండా కూతురు. ఇది నాటకం. ఆడా మొగా నా కనవసరం. అష్టమ గర్భం - అది నాశనమై తీరాలి. తే' అంటూ ఆ బిడ్డను ఎడమచేత లాగి పైకెగరేసి కత్తి ఝళిపించాడు.

కాని ఆ బిడ్డ నేల కూలలేదు. అంతరిక్షంలో నిలబడిపోయింది.

దివ్యకాంతితో దేదీప్యమానంగా వెలిగిపోతోంది యోగ మాయాదేవి. ఎనిమిది చేతులు, ఆయుధాలు ఆభరణాలు, ఆమెను సేవించే దివిజకోటి.

కంసుడు నిర్విణ్ణుడై పోయాడు. నిస్తేజుడై పోయాడు. ఉపచ్ఛవమై పోయాడు.

చేతిలో కత్తిజారి నేలమీదపడి ఆ నిశ్శబ్దంలో ఝల్లుమని దీనంగా మోగింది.

'ఓరీ కంసుడా! నిన్ను చంపేవాడు ఇక్కడ లేడు. నీ వూహ కందని చోట నీకు దొరకని చోట పెరుగుతున్నాడు. నిన్ను చంపడానికి సిద్ధమవుతున్నాడు' అని అంతర్ధానం చెందింది.

కంసుడు చేష్టలు దక్కి అలాగే కొద్ది క్షణాలు శూన్యంగా చూస్తూ నిలబడిపోయాడు.

○ ○ ○

ప్రళయ వేళ మేఘంలా గర్జించాడు కంసుడు.

'నిన్నా ఇవాళా రేపూ పుట్టిన పుట్టబోయే బిడ్డలందరినీ చంపండి. రాజ్యం నలుమూలలా దండెత్తి వెదికి వెదికి చంపండి. ఆడా మగా ఎవరయినా సరే నిర్దాక్షిణ్యంగా చంపండి' అన్నాడు.

తలలు వంచి నిల్చున్న అతని మంత్రులు ముఖ్యానుచరులు ముఖముఖాలు చూసుకున్నారు భయంగా.

పూతన సాహసించింది.

'ప్రభూ! మన రాజ్యంలో తమ భక్తులు, బంట్లు, బంధువులు, తమ రాణివాసంలో, తమ విలాస మందిరాలలో పుట్టిన శిశువులు ఎందరో వుంటారు. వారందరినీ చంపితే మనవారే మనకి పగవారై పోతారుగదా' అంది.

'పూతనా! నా చెల్లి బిడ్డల్నే చంపడానికి వడిగట్టాను. ఆరుగుర్నీ నా చేతులతోనే చంపాను. భటులూ బంధువులూ నాకొక లెక్కా? రాజ భక్తి వుంటే వారే స్వయంగా చంపి నాకు చూపాలి. వెళ్ళు. రాజ ప్రాణానికే ఆపద వచ్చినపుడు ప్రజల ప్రాణాలకి విలువేమిటి' అన్నాడు కంసుడు.

పూతన తలవంచుకుంది.

'వెళ్ళు. నువ్వు వెతుకు. వాడెవడో ఎక్కడ వున్నాడో ఎలా బతగ్గలడో చూడు. వాడిని చంపితే...' అంటూ ఆమె దగ్గరగా వచ్చి ఆగాడు. మందహాసం చేశాడు. ముందుకు వంగి నెమ్మదిగా అన్నాడు.

'పసిబిడ్డలను చంపడంలో నీకు చాలా ప్రజ్ఞవుంది గదూ! చాలా కుటుంబాలలో ఆస్తికి ఇద్దరూ ముగ్గురూ వారసులు పుట్టినపుడు నీవు వాళ్ళకి సాయంచేసి అమకున్నావు.'

పూతన కలవరంతో చూసింది.

'లేదు ప్రభూ! ఇప్పుడవన్నీ మానుకున్నాను. నాకూ ఇద్దరు పసిబిడ్డలున్నారు.'

'ఓ! అయితే ఓ పూతనా! శిశుహంతకీ! నీకో గొప్ప బహుమతి.'

పూతన అదిరిపడి భయంగా చూసింది.

బహుమతి అంటే భయపడతావేం పూతనా?'

పూతన వణికిపోతూంది.

'నా చెల్లెలి అష్టమ గర్భాన్ని చంపితెస్తే నీకు గొప్ప బహుమతి. నీ బిడ్డ లిద్దరికీ నీ భర్తకీ ప్రాణదానం చేస్తాను. వాళ్ళని చూసి కలకాలం ఆనందించడానికి నీక్కూడా ప్రాణదానం చేస్తాను. మాట తప్పను.'

పూతనకి ముచ్చెమటలు పట్టాయి.

కంసుడు విరగబడి నవ్వుతున్నాడు.

'వెళ్ళు. వాడెవడో ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో...'

o o o

వ్రేపల్లెలో కోలాహలంగా వుంది.

నాయకుడు నందయ్యగారికి లేకలేక ఇన్నాళ్ళకి సంతానం! అదీ మగబిడ్డ! అందులోనూ ఎంత చక్కనివాడు ఎంత నల్లనివాడు ఎంత చల్లనివాడు! ఈ నల్ల చందమామ నవ్వులు వెన్నెలకన్న వెయ్యింతల తెలుపట!

ఆటలూ పాటలూ విందులూ వినోదాలు దానాలూ ధర్మాలూ! పూతన మారువేషందాల్చి మందిలో కలిసింది. అజాపజా చూస్తోంది.

ఆమె సమీపించినపుడు ఆవులూ దూడలూ కుక్కలూ పక్షులూ చెదిరి దూరంగా పోతున్నాయి.

పూతన ఒక గడ్డివాము చాటున నిలచి కన్నులు మూసుకు మాయ చేసింది.

తనబిడ్డలు వచ్చారు. గుండెకు హత్తుకు ముద్దులాడింది. చంక నొకణ్ణి, భుజాన ఒకడినీ వేసుకుని నలుగురిలో తిరుగుతోంది. కృష్ణుని తొట్టికేసి వెళ్ళి చూస్తోంది. తన బిడ్డలని చూసుకుంటోంది. వాళ్ళని చూసి భయపడుతూంది. కృష్ణుడిని కసిగా చూస్తోంది.

చివరకు బిడ్డలను ఒక తోటలో ఏకాంత ప్రదేశంలో వదిలి కృష్ణుడి కోసం కదిలింది.

బిడ్డలిద్దరూ ఒక్కసారిగా ఏడుస్తూ ఆమె చేయీ చెంగూ పట్టుకు లాగసాగారు.

పూతన వారికేసి జాలిగా చూసింది. 'ఈ ఒక్కసారి ఈ ఒక్క పిల్లాడిని చంపక తప్పదు. ఇంకెప్పుడూ ఈ పనులు చెయ్యను. ఇది చివరిసారి. ఇది మీ కోసం, మీ ప్రాణాల్ని కాపాడడం కోసం' అంది.

అయినా పిల్లలు మరింత గొడవచేసి ఆమెని ఆపసాగారు. పూతనకి ఓపిక పోయింది. వాళ్ళిద్దర్నీ మాయచేసి మధురకి పంపేసింది.

○ ○ ○

పూతన ఒక చెట్టుచాటున నిలిచి రైకలో దాచిన ఒక విషపు మందును తీసి చనుమొనల చుట్టూరా అలమింది. ఆ వేలిని పక్కనే వున్న ఒక లేగదూడకి నాలికకి రాసింది. అది పిచ్చిగా అరిచి కిందపడి గిలగిల తన్నుకుని చనిపోయింది. పూతన తృప్తిగా తలవూపి రైక బిగించుకుంది.

○ ○ ○

నందయ్యగారిల్లు చాలా సందడిగా వుంది. చిన్ని కృష్ణయ్యకు కానుకలిచ్చేవారు, హారతులిచ్చేవారు, ముద్దులు పెట్టేవారు, మెటికలు విరుచుకునేవారూ, దిష్టి తీసేవారూ బిడ్డని ఒకరి చేతిలో ఒక్క నిమిషం

కూడా వుండనివ్వకుండా ఎగరేసుకుపోతున్నారు. ఏదో ఒక నెపంతో కిష్టయ్యని తాకాలన్న తపన అందరిలో.

నందయ్యగారింట లేకలేక పుట్టిన బిడ్డ మగబిడ్డ కావడం, ఆ బిడ్డ భువన మోహనుడు కావడం, ఊరందరికీ పండగగా వుంది. ఊరంతా తోరణాలతో ముగ్గులతో అలంకరించారు.

పూతన మనోహరమైన రూపం ధరించి ఊరంతా కలయదిరుగుతూంది. అందరూ ఆమె అందాన్ని చూసి మురిసిపోతున్నారు. మగవాళ్ళు గుడ్లు తేలవేస్తున్నారు. అప్పుడప్పుడామె గాలిలోంచి మంచి పళ్ళు, పిండివంటలూ పుట్టించి పిల్లలకి కానుకలిస్తోంది. నందుడి ఇంట చేరి కృష్ణయ్యకు ఒక రత్నాల హారం, మామిడి పిందెల మొలతాడు, కాలికి అందెలు, చిరుమువ్వల గజ్జెలు తీసి యశోదచేతి కిచ్చింది. యశోద ఆశ్చర్యంగా చూసింది.

'బుల్లావుల పాలెం పెత్తందార్లం. మా వారు జోడు కపిలగోవుల్ని తోలుకవస్తున్నారు. నేను ముందుగా వచ్చేశాను. ఏం పుణ్యం చేశావమ్మా ఏం పూజలు చేశావమ్మా' అంది పూతన. యశోద తలమీద రెండు చేతులూ నిమిరి మెటికలు విరుచుకుంటూ.

యశోద సిగ్గుపడిపోయింది. 'అంతా వాడి దయ.'

'కాదు వీడి దయే' అంటూ కృష్ణయ్య బొజ్జలో ఓ పోటు పొడిచింది పూతన.

'మాలాటోళ్ళ కోటానకోట్ల మొక్కుబళ్ళు గాదని నీ ఇంటి కొచ్చి కొలువు దీరాడు. నాకూ వున్నారు పిల్లలు, కాని' అంటూ నొప్పి నటించింది. యశోద తెల్లబోయి చూసింది.

'ఏం జెప్పను! పద్దానుగునాళ్ళ బాలింత్రాల్ని. బిడ్డను వదిలొచ్చా ఈ నల్లబంగారాన్ని చూడగానే పాలు చేపేయి తల్లీ! చేపడంగాదు పొంగులెత్తాయి. ఇంత చక్కనయ్యను కనిపెంచే పుణ్యానికి నోచకపోయినా గుక్కెడు పాలిచ్చే అదృష్టం ఇస్తావా చెల్లెమ్మా?' అంది కళ్ళు కలువ పువ్వులా విప్పార్చి.

యశోదకి ఇష్టం లేకపోయినా ఏం చెప్పలేక అటూ ఇటూ

చూసింది. తొట్టిలో కృష్ణమ్మ కేరింతలు కొట్టి తెగ వూపుతున్నాడు.

'నాతో సైగ చేస్తున్నాడు' అంటూ పూతన అమాంతం బిడ్డని తొట్టెలోంచి పైకితీసి గుండెలకు హత్తుకుంది.

యశోద ఏమీ చెప్పలేక చూస్తోంది.

నందయ్య పిలిచాడు 'యశోదా ఇట్రా ఒకపాలి' అని.

నగలు పట్టుకుని కంగారుగా పరుగెత్తింది యశోద.

పూతన కృష్ణయ్యని ఎత్తుకుని పెరటికేసి నడిచింది. అరుగు మీద స్తంభానికి జేరబడి కూర్చుని పైట తొలగించి రైక సడలించి కృష్ణయ్యకు చన్నిచ్చి పైట కప్పింది.

ఉత్తర క్షణంలో ఆమె ఒళ్ళు జలదరించింది.

వేదాలను ప్రవచించిన పవిత్ర అధరాలు,

శ్రీ మహాలక్ష్మి కుచకుంభాలలో అమృతాన్ని ఆస్వాదించి అలంగించిన పుణ్యాధరాలు,

సమస్త విశ్వాన్నీ ఉర్రూతలూగించే మురళికి వూపిరు లందించనున్న మధురాధరాలు,

రాధమ్మ చెక్కిలిపై తీపి గురుతులు కానున్న మధురాధరాలు,

రాసక్రీడలో పదారువేల గోపికలను ముద్దులతో ముంచెత్తనున్న అధరాలు,

విశ్వమోహనంగా లాస్యం చిందించే అధరాలు, అతి మధురాధరాలు

భగవద్గీతోపదేశం కావించనున్న మనోజ్ఞ అధరాలు,

అసత్యాలు పలికించనున్న అధరాలు...

దైవత్వం చిలిపితనం నిండిన అధరాలు.

ఒక రాక్షసి విషాన్విత విషపూరిత కుచాగ్రాలను స్పర్శించాయి

పూతన జన్మ తరించింది.

ఆ పుణ్యం అతిలోకమైన అనిర్వచనీయమైన అనుభవైక వేద్యమైన శారీరక సౌఖ్యాన్ని క్షణంలో సహస్రాంశంపాటు ఆమెకు కలిగించింది.

ఆమె నాడులు వేయి వీణలై, శతకోటి వేణువులై ఒక కొత్త రకమైన సంగీతంతో ఆమెను నింపివేశాయి. భరించరాని ఆనందంలో సుడులు తిరిగిపోతూంది. మరొక్క క్షణం తరవాత భరించరాని ఆనందం బాధగా మారిపోయింది. పారవశ్యంతో కన్ను లరమోడ్చిన ముఖం క్రమంగా వికారమై, భయంకరమై, బాధాసర్పదష్టమై ఆర్త నాదాలారంభించింది. అందంగా కోమలంగా వున్న పూతన నిజరూపం క్రమంగా ఆవిర్భవించ సాగింది.

'వద్దు! వదులు కృష్ణయ్యా వదులు. చచ్చిపోతున్నాను వదులు. తండ్రీ! ప్రభూ! జగన్నాథా! వదులు. ప్రాణాలు పోతున్నాయి. ప్రభూ వదులు. వదలద్దు ప్లీజ్. ప్రాణాలు తోడెయ్. నన్ను చంపెయ్. నన్ను విడుదలచెయ్. ప్రభూ! కృష్ణా!' పెద్ద కేకతో పూతన ఒక్కసారి పైకి లేచింది. ఆమె మహాశరీరం లేచిన తాకిడికి ఆమె కూర్చున్న

వసారా పైకప్పు ఫెడేలున బద్దలై పైకెగిరి పడిపోయింది. పూత
మొదలు నరికిన మహా వృక్షంలా నేల కొరిగింది.

ఆమె చనుబాలు పెరడంతా తెల్లటి మడుగులా పడివున్నా
వాటి మధ్య ఆమె చను మొననుండి జలపాతంలా ఎర్రటి నెత్తురు
కిందికురికి పాలతెలుపు మధ్య మంటలా ఎగజిమ్ముతోంది.

బాలకృష్ణుడు ఏమీ తెలియనట్టు పారాడుతూ ఆడుకుంటున్నా

ఈ ఘోషవిని నంద యశోదలు అంతా పరుగున వచ్చా
హాహాకారాలు చేశారు. యశోద బిడ్డ నెత్తుకు గుండెకు హత్తుకుం
రోహిణి బిడ్డ వీపు చరిచి భయపడ వద్దంది.

మరి వలుగురు వాళ్ళని పక్కకి తీసుకుపొదూరు. ఇంకిద్ద
దిష్టి తీశారు. మరిద్దరు తాపీదులు కట్టేస్తున్నారు. శ్రీరామరక్ష హ
రక్ష అంటూ రక్షలు వల్లిస్తున్నారు.

పురుషులంతా పూతన శవం దగ్గర నించుని ఆశ్చర్యంగా
చూస్తున్నారు.

నందుడి ఆజ్ఞపై పూతన మహాకాయాన్ని గొడ్డళ్ళతో ఖండ
ఖండాలుగా నరికి ఊరి చివరకు ఈడ్చుకుపోయి తగలబెట్టారు.

o o o

కంసుడి ఉద్యానవనం - కంసుడి మంత్రులు, సేనానులు తల
వంచుకు నించున్నారు. కంసుడు నిశ్చేష్టుడైపోయి ఆకాశంలోకి
చూస్తున్నాడు.

ఎక్కడో తీతువు పిట్ట కసిగా గీపెడుతూంది. ఎక్కడో ఒక
కుక్క అపశకునంగా ఏడుస్తోంది. అవి తప్ప అంతా నిశ్శబ్దం.

కొద్ది క్షణాల తర్వాత కంసుడు కదిలాడు. అప్రయత్నంగా
మాటలు వెలువడ్డాయి.

'పూతనని చంపినది ఆ పసివాదే అయితే, పాలిచ్చే రొమ్ము
లోంచి నెత్తురు పీల్చి చంపాడంటే, కాలకూట విషాన్ని మింగి
బతికాడూ అంటే...

వాడే! వాడే! నా శత్రువు. వాడే దొంగదేవుడు. పిరికిదేవుడు'
అంటూ వుద్వేగంగా అరిచాడు. చేతిలో మధుపాత్రని విసిరికొట్టాడు.
అది కొంచెం ఎడంగావున్న చిన్న కొలనులోపడి ఊగిసలాడి గుడగుడ
మని శబ్దం చేస్తూ మునగసాగింది.

సలహాదారులంతా తలెత్తి భయంగా చూశారు. కంసుడు వారి
ముఖాలను చూస్తూ మెల్లిగా నడుస్తున్నాడు. కొలనులో మునుగుతున్న
మధుపాత్ర గుడగుడ శబ్దం చిరాకెత్తిపోయింది. కంసుడు ఒక్క
అడుగులో అటు లంఘించి, ఒరలోంచి కత్తిదూసి తన కసినంతా
ఆ పాత్రమీద చూపించి కొట్టాడు. అది ఆ దెబ్బకి మునిగి మరుక్షణం
లోనే బంతిలా పైకి తన్నుకు వచ్చింది.

'ఇంక జాగేలా! పదండి - సైన్యాలను కదిలించండి. చతురంగ
బలాలతో దండెత్తి నా దూతికను చంపిన ఆ హంతకుడిని ఖండించండి.
ఆ వ్రేపల్లెని సర్వనాశనం చేసిరండి. పొండి' అన్నాడు.

అంతా ముఖముఖాలు చూసుకున్నారు. ఎవరూ కదలలేదు.
ముఖ్యమంత్రి ప్రలంబుడు సాహసించి ఒకడుగు ముందుకు వేశాడు.

'ప్రభూ ముందు నా శిరసు ఖండించి 'పిదప వ్రేపల్లెపు దండ చండి' అన్నాడు తలవంచి.

'అదేమి వితండ వాదన?'

'నా ప్రభువులకి అపకీర్తి కలగడం, అపజయం వాటిల్లడ చూసి ఎలాగూ బతకలేను. అందువల్ల!'

'ప్రలంబా!'

'అవును ప్రభూ. ఒక సైన్యం ఇంకో సైన్యంతో పోరా గెలవచ్చుగాని అది ఎంత పెద్ద సైన్యమైనా ప్రజా సముద్రాన్ని గెల లేదు. ఒక నది సముద్రంమీదికి ఉరికితే, అది ఎంత కోపంగా ఉరికి సముద్రమే నదిని మింగేస్తుంది గాని నది సముద్రాన్ని మింగలేదు.

'వ్రేపల్లె గొల్లలు అంత గొప్పవాళ్ళా?'

'కోపంతో రెచ్చిపోయాక కొద్దివాళ్ళైనా గొప్పవాళ్ళని కొ గలరు. పిల్లి పులిని ఎదిరించగలదు. ప్రభూ! మీ సోదరి దేవ సంతానం ఆరుగురిని చంపినందుకే ప్రజలలో కోలాహలం బయ దేరింది. ఎనిమిదో శిశువు వేట పేరిట దేశంలో పసిబిడ్డలని వేలాదిగ చంపించారు. ఇవ్వాళ ప్రజలందరిలో చెప్పరాని బాధ, పట్టరాని కోప అలముకున్నాయి. అగ్నిపర్వతం ఎపుడో పేలే మనవచ్చున ఇవ్వాళ పూతనని చంపిన పసివాడిమీద పగతో మనం దండెత్తి ఆమెని పంపింది మీరేనని శిశుహత్యలన్నీ మీ వల్లేననీ తేలిపోతుంది

వ్రేపల్లె గొల్లలమీద కత్తిదూస్తే ఆ ప్రాంతపు చిన్న రాజ లన్నీ ఏకమై మనమీద విరుచుకు పడతాయి. వాళ్ళదగ్గర క లుండక్కరలేదు. వాళ్ళ ఆలమందల గిట్టలకింద మనం మన రాజ్య బూడిదలో కలిసిపోతాం. మన రాజ్యానికి కావల్సిన పాడీ-పంట వ్రేపల్లె గొల్లలే పంపిస్తున్నారు. వారు ఆగ్రహిస్తే తమ ఏలుబడి ఆకలి చావులుకూడా తప్పదు. మన ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమవుతు కరువు కాటకాలూ చెలరేగుతాయి. మీ మీద కసివున్న శత్రువు ఇంటా బయటా ఏకమవుతారు.'

కంసుడు మాట్లాడలేదు. పచార్లు చేస్తున్నాడు.

'ప్రలంబా నువ్వంటే నాకు అసహ్యం. పచ్చిగా నిజం చెప్పి వ్యతిరేకిస్తున్నావు. నిన్ను చంపడానిక్కూడా నాకు భయం, నీపాటి నిజం చెప్పే దుర్మార్గుడు ఒక్కడుకూడా వుండడని!'

ప్రలంబుడు చిరునవ్వుతో వందనం చేశాడు. మిగతా అంతా మనసులో తేలికపడి నిట్టూర్చారు.

కంసుడు తిరిగి బుసకొట్టాడు ఆవేశంతో.

'అంటే వాడు ఆ పసివాడు ఇంత చావుదెబ్బ కొడితే వాన పాములా పడివుండనా?

'ప్రభూ వాడెవడో చాటునించే పోరాడుతున్నాడు గదా! మీరు కొట్టిన చాటు దెబ్బకి దొంగదెబ్బ కొట్టాడు గదా! ఇంకోసారీ, ఇంకో సారీ తామూ అలాటి దెబ్బలే కొట్టండి. వజ్రాన్ని వజ్రంతో, మోసాన్ని మోసంతో కొయ్యాలి. ఈసారి గట్టివాళ్ళని ప్రయోగించండి, తమ చేతులకి మట్టి కాకుండా' అన్నాడు ప్రలంబుడు.

కంసుడు అతని వంక తేరిపార చూశాడు, గౌరవంతో, సాలో చనగా.

శ్రీకృష్ణుని జన్మనక్షత్రం రోహిణి. ఆనాడు యశోదా నంద
పెద్ద పండగ చేశారు. చెరసాలలో దేవకికూడా తన బొమ్మకి పం
చేస్తోంది. అక్కడ తలంటి పోస్తుంటే ఇక్కడ బిడ్డ కంటిలో నలు
దేవకి తల్లడిల్లిపోయి చెంగుతో ఆదిరి పట్టింది.

అక్కడ కృష్ణయ్యకు పట్టుపంచెకట్టి కురులు దువ్వుతూం
ఇక్కడ దేవకి పూలు ముడిచింది. వంకరగా వస్తున్న పాపిడిని
దిద్దింది. దిష్టిచుక్క పెట్టింది. నెమలి పింఛం కొప్పున తురిమి
చేసింది.

వసుదేవుడు నిస్సహాయంగా కంటనీరు పెట్టుకుని చూస్తున్నా

అక్కడ కృష్ణయ్యకు యశోద చన్నిచ్చి పాలుపడుతో
కృష్ణయ్య రెండవ చేయి, కాలూ ఆమె రెండో రొమ్ముని కు
తున్నాయి.

కృష్ణయ్య బొమ్మని పైట చాటున పెట్టుకుని తన్మయురాలై కూర్చున్న దేవకికి పాలు చేపుతున్నాయి. పైట తడుస్తోంది.

కృష్ణయ్య చేయి కాలు రెండో రొమ్ముమీద తన్నుతున్నాయి. ఆ ఆనందం భరించలేక అలాగే సొమ్మసిల్లి పడిపోయింది.

కలగంది. అందులో చిన్నారి కృష్ణమ్మ చిన్నారి కాళ్ళు జాచాడు. ఆమె ఆ వడిలో తలవుంచి పడుకుంది. చిన్నారి చేతులు కన్నీటిని తుడిచి జోకొడుతున్నాయి. లయ వేస్తున్నాయి ఆమె చెంపలమీద. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది ఆనందంతో.

వసుదేవుడు చూశాడు. ఆమె చేతిలోని బొమ్మని తీసి పదిలంగా పూపొదల మాటున దాచి, ఆమెను లోపలికి తీసుకువెళ్ళాడు.

○ ○ ○

చిన్ని కృష్ణయ్యకు, బలరాముడికి మంగళారతులిచ్చారు. దిష్టి తీశారు. దీవించారు. కృష్ణయ్య ఎక్కడో చూస్తున్నాడు. ఆవులించి కన్నులరమూశాడు. యశోద అది గుర్తించి వెంటనే ఎత్తుకుని వాకిటిముందు చెట్టుకు వేసిన ఉయ్యాల తొట్టిలో పడుకోబెట్టింది. చిన్ని కృష్ణుడు కాలి బొటనవేలు నోటపెట్టుకు పడుకున్నాడు.

భక్తులు ఋషులు చూస్తే జగత్తంతా ప్రళయంతో సంక్షోభించి నాశనం అవుతున్న వేళ సముద్ర మధ్యాన రావి ఆకుమీద పసిపాపడై పడుకున్న 'వటపత్రశాయి' దివ్యరూపం స్ఫురించి, వాళ్ళు ముగ్ధులై స్తోత్రాలు చేసేవారే. కాని హాయిగొలిపే మాయమధ్యవున్న యశోదమ్మ మాత్రం 'ఛీ తప్పు. నోట్లో వేళ్ళెట్టుకోకూడదు' అని ఆ కాలిని లాగేసి లోపలికి వెళ్ళిపోయింది.

పది అడుగుల దూరంలో ఒక రెండెడ్ల బండి కాడి వాల్చివుంది. బండినిండా కూరలు, పళ్ళు, వెన్నదుత్తలు, పాలకుండలూ వున్నాయి. యశోద వెళ్ళగానే క్రిష్ణయ్య నవ్వుకుని క్రీగంట అటు చూశాడు. బండి మీదకు ఒక గాలి దిగింది. వాడు శకటాసురుడు. బండిని పూనాడు. బండి కాడి లేచింది. లంఘించే సింహంలా పైకి లేచింది. బండి భయంకరంగా ముందుకు కదిలింది. కృష్ణయ్య గమనిస్తున్నాడు.



చుట్టుపక్కల ఆడుకుంటున్న పిల్లలు ఎద్దులు లేకుండా బండి కారి లేవడం, కదలడం గమనించి, ఆటలు మానేసి అటే చూస్తూ నిలబడి పోయారు.

బండి కృష్ణయ్య తొట్టిని ఒక్క పుదుటున వచ్చి కొట్టింది.

తొట్టిలో బిడ్డ ఎగిరి కింద పడ్డాడు,

కృష్ణయ్య మీదకు ఉరికింది బండి. కృష్ణయ్య ఎడమకాలితో ఒక తాపు తన్నాడు.

బ్రహ్మాండం బద్దలైనంత శబ్దంతో బండి పైకి ఎగిరింది. ఎగురుతూనే ముక్కముక్కలై పోయింది. బండి ముక్కలు జీలుగ బెండు ముక్కల్లా పైకి ఎగిరి నెమ్మదిగా నేల కొరిగాయి. ఒక్కొక్క టే భీకరమైన శబ్దంచేస్తూ అక్కడున్న పందిరిని, ఇంటి చూరుని కూల్చేశాయి.

లోపల్నించి యశోదా నందులు, రోహిణీ పరుగున వచ్చారు. యుద్ధరంగంలా వున్న ఆ చోటు, బండి ముక్కల మధ్య; చితికిపడిన పళ్ళు, చెదిరిన వడ్ల బస్తాలు, నేలపాలైన పాలు వెన్నల మధ్య చిన్ని కృష్ణమ్మ కాలిమీద కాలేసుకుని ఆడుకుంటున్నాడు. అతని పక్కన బండి చక్రమంత అరచెయ్యి వుంది.

నందుడు ఆ చేతి దగ్గర ఆగి చూశాడు. అది శకటాసురుడి

విరిగిన హస్తం. చుట్టూ శకటాసురుడి కాళ్ళు, తల ముక్కముక్కలుగా చెల్లాచెదరై పడివున్నాయి.

యశోద దిగ్గున ముందుకురికి బిడ్డను ఎత్తుకుని గుండెలకు హత్తుకుంది. ఆడుకునే పిల్లలు అరుస్తున్నారు.

'కిష్టయ్య బండిని తన్నాడు. బండి బూచాడు చచ్చిపోయాడు అంటున్నారు.

నందుడు ఆకాశం పంక చూసి నమస్కరించాడు. రోహిణి యశోద క్రిష్టయ్యకు దిష్టి తీస్తున్నారు. తాయెత్తులు కడుతున్నారు.

ం ం ం

ఉషఃకాలం.

వ్రేపల్లె మోహనంగా మేలుకుంటూంది.

కోళ్ళు మేలుకొలుపులు పాడుతున్నాయి. తుమ్మెదలు ఝుమ్మంటున్నాయి. ఆవులూ దూడలూ 'అంబా' అంటున్నాయి. నూతిమీద నీరుతోడే గిలకలు కిలకిల కిచకిచ మంటున్నాయి.

పనులమీద తిరిగే గొల్లభామల కాళ్ళ 'అందెలు' గజ్జెలు ఘల్లు ఘల్లు మంటున్నాయి. అందంగా వంగి ముగ్గులుదిద్దే అమ్మాయిల కూని రాగాలు గుమ్మ దేదే, గోపిదేవీ పాటలు మెత్తగా మంచుతెర వెనుక చందమామ కనిపించినట్టు లీలగా వినిపిస్తున్నాయి.

ఆవుదూడలు చెంగుచెంగున దూకుతూ పరుగులెత్తేటప్పుడు విన్పించే మువ్వల చప్పుడు, తల్లి దగ్గర ఆత్రంగా పాలుకుడిచే చప్పుడు 'నెమ్మది నెమ్మది. పాలన్నీ నీకేనమ్మా' అని చెబుతూ గోమాతలు చేసే గంభీరమైన మంద్రస్థాయి మందలింపులు. 'నీకు తెలీదులేమ్మా మళ్ళీ మమ్మల్ని దూరంగా కట్టేస్తారు' అంటూ పొదు గును ఎగబొడిచి కసిగా పాలు తాగేసే లేగదూడల మురిపాలు సంగీ తమై వెల్లివిరుస్తున్నాయి.

లేగలు చెప్పినట్టే పాలుపితికే శబ్దం స్పష్టంగా వినబడుతూంది. ఒకచోట వంద ఆవులకి గొల్లభామలు పాలు పితుకుతున్నారు. పాల నురగతో వెలిగే లేగల్ల నల్లని మూతుల్ని వాటి నాలికలతో తుడుచు కుంటున్నాయి. ఆవుల పొదుగులు మబ్బుల్లా వున్నాయి. పాలధార వెండి తీగెల్లా మెరుస్తున్నాయి. వంద ఆవుల పొదుగులు పితుకుతుంటే పాలవాన కురుస్తున్నట్టుంది.

ఆ పైన చల్ల కడవల్లో వెన్న కవ్వాలపాట ఘుమ్మ ఘుమ్మని మేలుకుంది. పాతికమంది ఇల్లాళ్ళూ, కన్నెపిల్లలూ స్థంభాలకు నిలువు కవ్వాలేసుకుని మజ్జిగ చిలికి వెన్న తీస్తున్నారు. తీసిన వెన్నని పక్కనేవున్న పెద్ద బానలలో వేసి నింపుతున్నారు. ఒక బాన నిండింది. పైన ఏపుగా గోపురం కడుతోంది వెన్న. ఆ బాన చాటున ఐదారేళ్ళ చిన్ని కృష్ణమ్మ మోకాళ్ళమీద కూర్చుని మెల్లిగా లేచాడు. కవ్వమాడించే గోపిక అది గమనించనేలేదు. క్రిష్ణయ్య ఆ వెన్న గోపురం మీంచి అటునించి పట్టెడు వెన్న తీశాడు. అతని వెనక ఆరుగురు పిల్లలు వరసగా పొంచి కూర్చున్నారు. ఈ వెన్న చిన్ని కృష్ణుడు వెనకవాడి కిచ్చాడు. వాడు కొంచెం తిని తన వెనక వాడికి అందించాడు. గోపిక మళ్ళీ పట్టెడు వెన్నతీసి బానమీద వేసేసరి

వెన్న గోపురం చదునుగా వుంది. ఒక్క క్షణం అనుమానంగా చూసి వెన్నముద్ద పడేసి మళ్ళీ చిలుకుతూంది. కృష్ణయ్య మళ్ళీ వెన్నతీసి పంచుతున్నాడు. గోపురం తరిగిపోయింది. గోపెమ్మ మళ్ళీ ఓ పెద్ద వెన్నముద్ద వెయ్యబోయి - చూసి ఆగింది. ధగధగలాడే కంకణం మురుగులు గల చిన్నారి నీలాల చెయ్యి వెన్న తియ్యబోతూంది.

'కృష్ణా' అంది గోపెమ్మ.

కృష్ణయ్య, తోడు దొంగలూ ఉలికిపడి లేచారు. వెనక వాళ్ళు పారిపోయారు గాని - కృష్ణయ్య చెయ్యి గోపికకి దొరికిపోయింది. ముందుకు వంగింది గోపిక.

'నిన్ను, నిన్నూ' అంటూ పక్క బానలోవున్న తెడ్డుతీసి ఎడం చేత్తో కొట్టబోయింది. తటాలున కృష్ణయ్య తన ఎడంచేత్తో ఇంత వెన్నతీసి గోపిక ముఖాన కొట్టడం, గోపిక తెడ్డు గురితప్పి కుండని పగలగొట్టడం ఒక్కసారే జరిగాయి.

కృష్ణుడు చెయ్యి లాక్కుని చప్పట్లు కొట్టాడు. అటూ ఇటూ వున్న గోపికలు వచ్చి పట్టుకోబోయారు. అందరినీ వెన్న బంతులతో

కొట్టి. మధ్య మధ్యలో **తనొకటి తింటూ** నానా తిప్పలూ పెట్టి, ఎగిరి ఉట్టిని అందుకుని ఊగి దూరాన దూకి పారిపోయాడు క్రిష్ణయ్య. వాళ్ళు తరిమారు. చివరికి ఎటూ పోడానికి వీల్లేక ఒక గోడ మూల దొరికి పోయాడు క్రిష్ణయ్య. పదిమంది గోపెమ్మలు గోడ కట్టినట్టు దిగ్బంధం చేశారు. నల్ల క్రిష్ణయ్య తెల్లగా నవ్వాడు. ఆ నల్ల క్రిష్ణుని నలుపు మీద వెన్నముద్దల పాలమీగడల చాయలు తెల్ల బంగారు నగలలా మెరిశాయి. మధ్యలో మట్టి మరకలు. మూతి బుగ్గలు బుజాలు చాలా అంతా నలుపు తెలుపులమయం. గోపికలంతా ఒక్కసారి ఒకరి ముఖం మరొకరు చూసి పగలబడి విరగబడి నవ్వసాగారు.

○ ○ ○

ఒకచోట ఇద్దరు గోపికలు ఒక ఇంటిపక్కన చెట్టుకింద నిలబడి మాట్లాడుకుంటున్నారు. చిన్న క్రిష్ణయ్య, బలరాముడు, జతగాళ్ళు పైన చెట్టుకొమ్మ మీదికి చేరారు. క్రిష్ణయ్య చేతిలో తామరతూడు వుంది. దాని చివర విరిచాడు. దాంతో గోపికల తలపైవున్న పాల కడవలపై కప్పిన గుడ్డని తొలగించాడు. బోర్లగిలా పడుకుని ఆ తామర గొట్టం కడవలో దింపి పాలు తాగాడు. తరవాత నేస్తాలకి ఇచ్చాడు. పాలన్నీ పీల్చేశారు జతగాళ్ళు. గోపికలు కదలబోయి కడవలు బరువులేవని అనుమానం వచ్చి, చేతులతో పైకెత్తి చూశారు. అనుమానం బలపడి కడవలు దించి చూశారు.

కడవలు ఖాళీ. తెల్లబోయి పైకి చూశారు. కృష్ణయ్య జతగాళ్ళు కొమ్మమీంచి చూసి హాయిగా నవ్వుతున్నారు. కృష్ణ తన చేతిలోవున్న గొట్టాన్ని గోపెమ్మల మీద దులిపాడు. వాళ్ళ బుగ్గలమీద రెండు పాల బొట్లు నిలిచాయి.

○ ○ ○

రాత్రి కృష్ణయ్య జతగాళ్ళు ఒక ఇంట్లో జొరబడ్డారు. పాలు ఉట్టిమీద ఉన్నాయి. ఉట్టి అందలేదు. కృష్ణుడు కన్ను గిలిపాడు. జతగాళ్ళు ఒకడిమీద ఒకడు ఎక్కి చిన్న గోపురం కట్టారు. కృష్ణుడు ఆ గోపురం ఎక్కి పాలకడవ అందుకోబోయాడు. కడవ పైకిలేచింది.

కృష్ణుడు ఇంకోసారి ప్రయత్నించాడు మునివేళ్ళు కూడా జాపి. ఉట్టి అందినట్లే అంది మళ్ళీ పైకి వెళ్ళిపోయింది. కృష్ణుడు కదిలాడు. కింద వాళ్ళు చెదిరి పడిపోయారు. కృష్ణుడు కింద పడ్డాడు. లేచాడు. చూచాడు. దూరాన ఓ మూల ఉట్టితాడు పట్టుకున్న గోపబాల కిలకిల నవ్వింది. కృష్ణుడు తటాలున మొలలోంచి ఉండేలుబద్ద తీసి క్షణంలో ఉట్టిమీది కడవని కొట్టాడు. పాలు ధారకట్టి జారసాగాయి.

గోపిక కెవ్వుమంది. ఉండేలుని గోపికకి గురిచేశాడు. కదలద్దని ఆజ్ఞాపించాడు. గోపిక భయంతో అలా వుండిపోయింది.

పిల్లలంతా పాలధారను తృప్తిగా ఆరగించారు. **అంతలో** పక్క గదిలో **అలికిడైంది.** కృష్ణుడు గోపిక **ముంజేతిమీద కొట్టాడు.** పట్టు

పదిలేసింది. ఉట్టి జారి పెద్ద చప్పుడుతో పాలకుండ నేలపడింది. కృష్ణయ్య జతగాళ్ళు కిటికీలోంచి దూకేశారు. ఈలోగా తలుపు తీసుకుని అత్తగారు వచ్చింది. భయపడుతున్న గోపెమ్మను చూసి చెయ్యెత్తింది.

బయట కృష్ణయ్య నవ్వుతున్నాడు.

మరో ఇంట్లో—

ఆలుమగలు పడుకున్నారు. ఆమె జడను, అతని కొప్పుకి కట్టేశాడు క్రిష్ణయ్య. అటూ ఇటూ చక్కగా పిల్లల్ని కూర్చోబెట్టాడు. అరిసెలు, అప్పాలు, మీగడ, వెన్న, సున్నుండలూ అన్నీ మూతలు తీసిన కడవల్లో వున్నాయి.

'తినండ్రా' అన్నాడు. అందరూ కేరింతలు కొడుతూ తిన

సాగారు. ఆలుమగలు దిగ్గునలేచి పట్టుకోబోయారు. జుట్టు పీక్కుని కెవ్వున కేకలువేస్తూ మళ్ళీ మంచంమీదే పడ్డారు. క్రిష్ణయ్య వాళ్ళిద్దరి నోళ్ళలో వెన్న కూరి పారిపోయాడు.

o o o

యశోద బెత్తం, తాడు పట్టుకుని తరుముతూంది. అమ్మా కొట్టకు అమ్మా కొట్టకు. అమ్మా... అమ్మా అంటూ పెరడంతా పరిగెడుతున్నాడు కిష్టయ్య. యశోద కోపంగా తరుముతూంది...

o o o

చెరసాలలో—

'రా బాబూ రా' అంటూ దేవకీదేవి చేతులు జాచింది. క్రిష్ణయ్య పరుగున వచ్చి అమ్మ సందెట్లో దూరి దాక్కున్నాడు. అమ్మ బిడ్డని గుండెల్లో పొదువుకుంది...

'నీకేం భయం లేదు బాబు. నేనున్నా. నిన్నెవరూ కొట్టరు!' అంటూ దేవకి ఒక బొమ్మని కౌగలించుకుని సతమతమైపోతోంది.

ఎదట గర్గాచార్యుడు, రోహిణి, వసుదేవుడు కంగారు ప
తున్నారు. వసుదేవుడు బొమ్మని లాక్కున్నాడు.

దేవకి కోలుకుంది. ఇదంతా భ్రమ అని గ్రహించింది. కన్నీ
పెట్టుకుంది.

'ఇలా అయితే ఇంక నేనేమీ చెప్పనమ్మా—' అం
రోహిణీదేవి.

'కాదు... నేనింక భ్రమపడను. కలగనను. బాధపడను...
బంగారు తండ్రి కథలు చెప్పండి. కనే భాగ్యం లేనేలేదు. వినేభాగ్య
పోగొట్టకండి...' అన్నది దేవకి చేతులు జోడించి ఏడుస్తూ.

o o o

వ్రేపల్లెలో—

ఒక ఇంట్లో లక్ష్మీనారాయణుల పటాలు. ఒక గోపిక పా
వెన్నం నైవేద్యం పెడుతూంది. కళ్ళు మూసుకు దండం పెట్టిం
క్రిష్ణయ్య విలాసంగా అక్కడ నించుని వెన్న గిన్నెలో వేలు
తీసుకు తిన్నాడు.

'ఆయ్! తప్పుకదూ - దేవుడి కివి నైవేద్యం... ఎం
చేస్తావా...?'

'నేనే దేవుణ్ణి!' అంటూ మళ్ళీ వెన్న తీబోయాడు.

'హన్నా' అంటూ గోపిక లేచి పట్టుకోబోయింది. క్రిష్ణు
పరుగెత్తాడు. ఓ మూల దొరికిపోయాడు. ఆమె వంగి అతన్ని
మీద ఒకటి కొట్టింది. అంతలో కృష్ణుడు ఆమె రొమ్ము పట్టుకున్నా
కెవ్వన కేకవేసింది. బుగ్గన ముద్దుపెట్టుకు కొరికి పారిపోయాడు
దొంగ—ఆమె భర్త తరుముతున్నాడు. కృష్ణుడు పరుగెడుతూ
చోట - అరుగుమీద ఉన్న నేతిగిన్నెను అందుకుని ఆ వచ్చే ఆసా
పాదాలకేసి విసిరాడు. వాడు జర్రున జారి, వెల్లకిలా పడ్డాడు.

మరోచోట ఆలుమగలు కలసి అన్నం తింటుంటే - విసన
ఇద్దరి మధ్య అడ్డంపెట్టి, గోపికకి కన్నుకొట్టి 'వస్తావా' అని సై
చేశాడు.

ఊరి అమ్మలక్కలంతా యశోద ఇంటికివచ్చి క్రిష్ణయ్య
దుడుకుతనం గురించి కోపంగా ఏడుస్తూ దీనంగా రోషంగా మొర
పెడుతున్నారు. యశోద బుగ్గలు నొక్కుకుని ఆశ్చర్యంగా వింటోంది.

యశోదమ్మ అన్నీ విని 'అబద్ధాలు. అన్నీ అబద్ధాలు. మా
వాడసలు నన్ను వదిలి ఎక్కడికీ వెళ్ళడు. ఇపుడు కూడా ఇంట్లోనే
వున్నాడు' అంది.

'కాదు మా ఇంట్లో రాటకి కట్టేసి వచ్చాను. రండి చూపిస్తా.

'కాదు. నేనుమావంటింట్లో పెట్టి తాళంవేసి వచ్చా. రా చూడు.

ఇలా అందరూ చెబుతుంటే యశోద నవ్వింది. తలుపు
తెరిచింది.

క్రిష్ణయ్య సావడిలోని తూగుటుయ్యాలలో నోట్లో వేలుపెట్టుకు
నిద్రపోతున్నాడు. గోపెమ్మలంతా తెల్లబోయారు.

'కాదు ఇది మాయ. మీ వాడు దొంగ పిల్లడు - మాయదారి
పిల్లాడు. ఏం కన్నా... ఇట్రా!' అంటూ క్రిష్ణయ్య మీదకి నడిచారు.

కెవ్వన అరిచింది - చెరసాలలో దేవకి. చేతులు బారచాపి
అడ్డుపెట్టింది.

'వద్దు. నా కన్నయ్య మంచివాడు. బంగారు దేవుడు. వాడినేం
చెయ్యకండి. రాకండి. కన్నా నా చిన్నారి కన్నా!' అంటూ వడిలో
బొమ్మని గుండెలకు పొదువుకుని ఏడవసాగింది.

వసుదేవుడు అతని వెంట నారదుడు వచ్చారు. అక్కడే వున్న
రోహిణి, గర్గాచార్యులు అంతా కలసి దేవకిని ఊరడించారు.

దేవకి కృష్ణ విగ్రహాన్ని చూసి ఆక్రోశంలో దూషించసాగింది.

'కన్నయ్యా! నన్ను కన్న తండ్రీ! నేను కన్న బిడ్డా! ఇదేమి
పరీక్ష. ఇదేమి శిక్ష. శ్రీమన్నారాయణుడు సర్వేశ్వరుడు నా కడుపున
బిడ్డగా పుడతాడని ఆశపడ్డంతసేపు నిలవలేదు ఆనందం. ఇది వరమా?
నరకహింసా? కన్నబిడ్డ లెవరూ తల్లిదండ్రుల నిలా హింసించలేదే -
మనుషులూ రాక్షసులూ పెట్టని హింసని నువ్వు నాకు విధిస్తున్నావు.

‘ఊరందరికి అమృతం పంచుతూ - నాకు మాత్రం చేదు పెడతావా? లోకమంతటికీ వెన్నెల వెదజల్లుతూ నన్ను చీకటిలో కుమిలమంటావా? కన్నబిడ్డకి గుక్కెడు పాలిచ్చే భాగ్యం లేకుండా చేస్తావా? నా పాలు విషమని భయపడ్డావా? గోకులంలో గోపస్త్రీలకన్నా గోవులకన్న నికృష్టురాలినా? విషం పూసిన పూతన రొమ్ములపాలు తాగేవాడే. పోనీ నాకు కూడా ఆ అదృష్టం ఇచ్చి నా ప్రాణాలు పీల్చి చంపెయ్యి తండ్రీ. నేనీ బాధ భరించలేను’ అంటూ ఏడవసాగింది.

నారదుడు ఆమెను ఓదార్చాడు.

‘అమ్మా దేవకీదేవీ! జగన్నాథుని కన్న తల్లీ! నిన్ను మాయ కమ్మింది. నా మాటలు విను. దేవుడు మన కిచ్చిన భాగ్యాన్ని అనుభవిస్తూ ఆనందించే బదులు - మనకివ్వని వాటికి, మనం కోరని వాటికి ఏడవడం మానవ సహజం - కాని నువ్వు సామాన్య స్త్రీవి కావు. పుణ్యాత్మురాలివి. వేలాది సంవత్సరాలు తపస్సు చేస్తూ - ఒక్క క్షణంపాటు ఆ స్వామి రూపు మనసులో మెరిస్తే చాలని వాపోతారు ఋషులు. వారి కాపాటి భాగ్యంకూడా దక్కదు. నీకు - ఆ శ్రీమన్నారాయణుడు నీ కడుపున పుట్టాడు. నీ జఠరంలో శయనించి - నీ రక్తమాంసాలు పంచుకుని లీలామానుష విగ్రహుడై జన్మించాడు. అదెంత భాగ్యమో గ్రహించి ఆనందించడం మాని నీ దగ్గర పాలు తాగలేదని బాధపడిపోతున్నావు. పూర్వజన్మలో నువ్వు కోరిన వరం అంతేనమ్మా. ఆయన నీ కడుపున పుట్టాలనే. కాని యశోదానందులు ఆ వరం కోరక స్వామిని పెంచి పెద్దచేస్తూ సేవించే భాగ్యం అడిగారు; వారి కది లభించింది. ఈ సత్యాన్ని తెలుసుకో. నీకు కలిగిన అసదృశ భాగ్యాన్ని అనుక్షణం తలుచుకుని మురిసిపో. ఆ పరమాత్ముని నామం జపిస్తూ ఆయన దర్శనం కోసం ఎదురుచూస్తూ - ఆ ఆశతో హాయిగా ఆనందంగా జీవించు’ అన్నాడు. దేవకి కన్నులు అరమోడ్చి వింటూంది. క్రమంగా ఆమె ముఖంలో దుఃఖం ఉపశమించింది. ప్రశాంతత ఉదయించింది.

నెమ్మదిగా కళ్ళు తెరిచింది.

నారదుడి వంక చూసి నమస్కరించింది. నారదుడు మందహాసం చేశాడు.

‘మరో రహస్యం చెప్పనా? దేవుడు నీ కన్నబిడ్డ అని మీకు తెలుసు. కాని యశోదా నందులకు తాము పెంచుతున్న బిడ్డ దేవుడని తాము కోరిన వరం పండిందని తెలీదు. సామాన్య బాలుడిగానే వాళ్ళు ముద్దుచేస్తున్నారు. కోప్పడుతున్నారు. కొడుతున్నారు. అంతా విష్ణుమాయ. కృష్ణ మాయ.’

వ్రేపల్లెలో—

యశోద శ్రీమహావిష్ణువు విగ్రహానికి దండ వేయబోతుంటే కృష్ణుడు తనకిమ్మని లాక్కోబోయాడు. యశోద నెట్టేసింది.

'తప్పు. ఇది దేవుడికి. నీకు వేరే కడతాను.'

అంటూ ఆ దండ దేవుడి మెడలోవేసి చేతులు జోడించి ధ్యానం చేస్తోంది. కృష్ణుడు కోపంగా వెళ్ళిపోయాడు.

అంతలో బలరాముడు పరుగున వచ్చాడు.

'పెద్దమ్మా తమ్ముడు మన్ను తింటున్నాడు. నేను వెన్న పెట్టినా వద్దని—'

యశోద పరుగెత్తింది.

మన్ను తింటున్న కృష్ణుడు తల్లి కేక విని వెనక్కి తిరిగాడు.

'అన్న చెప్పేవన్నీ అబద్ధాలు. అన్నయ్య నా మీద అన్నీ చాడీలే చెప్తాడమ్మా. నేనంటే వాడి కిష్టంలేదు' అన్నాడు కిష్టయ్య.

'తప్పమ్మా! అన్నకి నువ్వంటే చాలా యిష్టం.'

'ఏం కాదు. తను తెల్లగా వుంటాడుగదా - నల్లవాళ్ళకన్న

తెల్లపిల్లలు గొప్పవాళ్ళట. అసలు నేను మనబ్బాయినే కాదుట! ఎందు కంటే నువ్వూ నాయనా తెలుపు గదా. నేను నలుపు గదా. అందుకని నన్ను సంతలో కొనుక్కు తెచ్చుకున్నారుట!' అన్నాడు కృష్ణుడు బుంగమూతిపెట్టి.

'ఛీ తప్పు. అదేంకాదు. నువ్వు మనబ్బాయివే. నేను అమ్మనీ-నువ్వు కన్న తండ్రిపీని' అంది యశోద బిడ్డని ముద్దాడి.

'అవునా! అయితే మరి అన్న చెప్పింది అబద్ధమే గదా. మరి మన్ను తినడం కూడా అంతే. కావాలంటే నా నోరు చూడు' అంటూ నోరు తెరిచాడు అమాయకంగా గుడ్లు తిప్పుకుంటూ—

యశోద ముఖాన ఒక్కసారి దుర్నిరీక్ష్యమైన కాంతి పడింది. కళ్ళు కనబడనంత కాంతి—

చర్మ చక్షువులను మూసి - జ్ఞాన చక్షువులను తెరిపించే దివ్య కాంతి—

అపుడామెకు క్రిష్టయ్య నోటిలో సమస్త విశ్వం గోచరించింది. సూర్య చంద్ర తారామండలం - సముద్రాలు, పర్వతాలు - సమస్త చరాచర జీవకోటితో చైతన్యవంతంగా పరిభ్రమిస్తున్న భూమండలం - అందులో వ్రేపల్లె - అందులో తాను తన భర్త, గోకులం, ఆల మందలు, అందులో తన ఇల్లు తాను. అందులో నోరుతెరచి విశ్వ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్న శ్రీకృష్ణమూర్తి. చూసి విభ్రాంతబోతున్న తానూ కవిపించారు.

యశోద దిగ్భ్రాంతురాలై పోయింది. అప్రయత్నంగా చేతులు జోడించింది. కన్నులు మూసి భగవంతుని ధ్యానించింది. కలయో, వైష్ణవ మాయయో, ఇతర సంకల్పార్థమో అంటూ కంగారు పడింది.

'ఏ మహాత్మువల్ల నీ విశ్వరూపంబు గానబడిన బుద్ధి కంప మయ్యె, నా మహాత్మ విష్ణు నఖిల లోకాధారు నార్తులెల్ల బాయ నాశ్ర యింతు' అని స్తుతించింది.

చిన్నారి కృష్ణుడు నెమ్మదిగా నోరు మూసుకున్నాడు. చిరునవ్వు నవ్వుతూ కలువ కనులు మూసుకున్నాడు. తిరిగి నెమ్మదిగా తెరిచాడు.

యశోదని తిరిగి మాయ తెర కప్పేసింది.

కలవరంతో కృష్ణయ్య బుగ్గలు రెండు వేపులాపట్టి సాగదీసింది. నోటిలో వేలుంచి తడిమి చూసింది.

'చూశావా! అనవసరంగా నన్ను అనుమానించావు' అన్నట్టు క్రిష్ణయ్య చిత్రంగా తలవూపి బుజా లెగరేశాడు.

యశోద పకాలున నవ్వి, గాఢంగా కౌగలించుకుని ముద్దులో ముంచెత్తింది.

○ ○ ○

యశోద బాలకృష్ణుడిని ఎత్తుకు చంకన వేసుకుని చకచకా యింటికి పోతోంది.

పట్టపగలే అయినా హఠాత్తుగా చీకటి పడుతున్నట్టు అయింది. మబ్బులు కమ్ముకొస్తున్నాయి. గాలి జోరుగా వీస్తోంది. కృష్ణుడు హఠాత్తుగా బరువెక్కుతున్నట్టు అనిపించాడు. యశోద అతన్ని అటు నించి ఇటు మార్చుకుంది. మరింత బరువెక్క సాగాడు. ఆమె అడుగులు భారంగా పడుతున్నాయి—

'ఏవిటిది క్రిష్ణా! ఇంత బరువెక్కుతున్నావు?' అంటూనే ఆమె బిడ్డని క్రిందకు దించి ఒక అరుగుమీద కూర్చోబెట్టి అలసట తీర్చుకో సాగింది. అంతలో గాలి జోరు హెచ్చింది. దుమ్ము లేచింది. సుడి గాలి పుంజుకుంది. చూస్తుండగా ఆ సుడిగాలి వచ్చి బాలకృష్ణుడిని ఎత్తుకుని పైకి లాక్కుంది. అతి వేగంగా అతణ్ణి ఆకాశంలోకి లాక్కు పోయింది. కళ్ళలో దుమ్ము తుడుచుకున్న యశోదకు బిడ్డ కనబడ లేదు. కృష్ణా! కన్నయ్యా అంటూ తడుముళ్ళాడుతూ పడుతూ లేస్తూ వెతకసాగింది. కొద్ది సేపటిలో వ్రేపల్లె అంతా అలాగే గందరగోళం అయిపోయింది.

కృష్ణుడిని ఎత్తుకుపోయిన సుడిగాలి 'తృణావర్తుడు' అనే రాక్షసుడు. పైకి పోయినకొద్దీ కృష్ణుడు బరువెక్కి పోయాడు. రాక్షసుడు నిజరూపం ధరించి కృష్ణుడి పీక నులమ సాగాడు. కాని బరువు

మోయలేక కిందికి తూలిపోతూ గింజుకోసాగాడు. కృష్ణుడు వాడి పీక పట్టుకు నులిమాడు.

పెనగులాట భీకరంగా సాగింది. తృణావర్తుడి నోట నెత్తురు కారసాగింది. మరో క్షణం తరువాత కృష్ణుడి గట్టిపట్టుకి, కంఠం దగ్గర రక్తనాళాలు చిట్లి బద్దలయ్యాయి. నెత్తురు చిమ్మన గ్రోవిలోంచి వచ్చి నట్లు చిమ్మసాగింది. పెద్ద కేకతో నేలకూలిపోయాడు రాక్షసుడు. వ్రేపల్లె వీథులలో ఆ కళేబరం భయంకరంగా పడింది. చూస్తుండగా సుడిగాలి దుమ్ము ఆగిపోయాయి. చీకటి పోయి వెలుగు వచ్చింది.

పర్వతంలా పడివున్న ఆ కళేబరంమీద కృష్ణుడు ఏమీ ఎరగనట్టు పారాడుతూ దిగుతున్నాడు. యశోద రోహిణి పరుగున వచ్చారు. బిడ్డని అందుకున్నారు.

'బాబూ! కన్నయ్యా బాగున్నావా - భయపడలేదు. గదా.
ప్పలు తగల్లేదు గదా. భయపడకు. నేను వచ్చేశానుగా' అంటూ శోద అతని వీపు చరిచి భయం పోగొట్టింది. రోహిణి నేలమీద ము్మ తీసి మంత్రించి అతని నొసట అద్దింది.

'ఏం జరిగింది బాబూ? అంది యశోద.

'వాడొచ్చి నన్ను గట్టిగా పట్టుకుని ఎగిరిపోయాడమ్మా! నేను డి పీక పట్టుకున్నాను. మరేమో వాడు కింద పడిపోయాడు. నేను డిమీద పడిపోయాను పాపం' అన్నాడు కృష్ణుడు చక్కగా కళ్ళు ప్పుకుంటూ—

ఘుమ్మ ఘుమ్మని పాలు తరచగా...
గుమ్మడేడే గోపిదేవి

యశోద స్తంభానికి నిలువు కవ్వంవేసి లయబద్ధంగా పెరుగు లికి వెన్న తీస్తోంది. కవ్వం చప్పుడు ఆమె చేతి గాజుల సంగీతం అప్రయత్నంగా లయకలిపే పాద మంజీరాల మట్టెల తాళం. ఆ లయ

ప్రకారం కదలాడే రొమ్ములు. నన్నటి నడుము నానుకుని ఊగిసలాడే జఘనాలూ - మోహనంగా ఉంది ఆ దృశ్యం.

భువనైక మోహనుడు బాలకృష్ణుడు వచ్చి వెన్నకుండ దర్శించుచున్నాడు.

యశోద కవ్వం తిప్పుతూనే క్రీగంట చూసి ముద్దుగా నవ్వింది.

'అమ్మా! పాలు' అన్నాడు క్రిష్ణయ్య.

'కాగుతున్నాయి. కాస్సేపాగు ఇస్తాను' అంది యశోద వెన్న ముద్ద తీసి పక్క కుండలో వేస్తూ—

'ఆ పాలు వద్దు. ఈ పాలు కావాలి' అన్నాడు కిష్టయ్య వేలితో ఆమె పైటకేసి చూపిస్తూ—

యశోద కవ్వం ఆపి అలవోకగా ప్రేమతో చిరునవ్వుతో చూసింది.

'గుమ్మపాలకన్న అమ్మపాలే మంచివిట. ఇవి తాగితేనే అన్నయ్యకన్న పొడుగుజుట్టు వస్తుందిట' అంటూ కళ్ళు విప్పార్చి ఆశగా చూస్తున్నాడు కిష్టయ్య.

నవ్వుకుని, కవ్వం వదిలేసి ముక్కాలి పీట లాక్కుని కూర్చుంది యశోద. బిడ్డను వడిలో పొదువుకుని పైట నడలించింది.

ఒళ్ళంతా మెరుపులు మెరిసినట్టయింది.

పరవశించి పోయింది.

లోకాతీతమైన ఆనందం అనుభవిస్తోంది. అప్రయత్నంగా క్రిష్ణయ్య కురులు నిమురుతోంది.

'జుట్టు పొడుగైందా?' అన్నాడు పైటచాటు కిష్టమ్మ చిన్నారి చేతులుజాచి తనుకూడా లోన కురులను తడుముకుంటూ.

యశోద పకాలున నవ్వింది. అంతలో—

'యశోదమ్మా పాలు పాలు... పాలు పొంగేను' అని కేక వినబడింది. ఆమె ఉలికిపడి చూసింది.

పాలు పొంగి దాలి గుంటలోపడి వాసన వస్తున్నాయి. ముక్కుపుటా లెగరేసి వాసన చూసింది.

అయ్యో! ఒక్క క్షణం! ఇట్టె వచ్చె!' అంటూ కంగారుగా బిడ్డనోట పాలిచ్చే చన్ను తప్పించి బిడ్డని దించి పరుగెత్తింది.

క్రిష్ణయ్య నల్లని ముఖం కోపంతో ఎర్రబడింది.

'అమ్మా' అని అరిచాడు.

యశోద వినకుండా పరుగెత్తింది.

క్రిష్ణయ్యకి కోపం ఆగలేదు. అక్కడున్న చిన్న పిడతతో వెన్న కుండని కొట్టాడు. అది పగిలింది. చేతినిండా వెన్న తీసుకుని బొక్కేశాడు. ఇంకా తీసుకు పరిగెత్తాడు.

అంతలో యశోద వచ్చింది. చేతిలో బంగారు గిన్నెలో 'రా కన్నయ్యా! రా! మీగడపాలు తెచ్చాను.'

కాని క్రిష్ణయ్య కనబడలేదు.

కంగారుగా అటూ ఇటూ చూసింది. అల్లంత దూరాన చిన్ని కృష్ణుడు రోలుమీదెక్కి కాళ్ళు పైకెత్తి నిలబడి వున్నాడు.

గోడమీదవున్న కోతిపిల్లకి వెన్న తినిపిస్తున్నాడు.

యశోద అప్పుడు కిందకి చూసింది. కాళ్ళ దగ్గర పనికిరాకుండా నేలపాలైన వెన్న ముద్దలు.

'క్రిష్ణయ్యా' అంటూ చేతిలో గిన్నె పడేసి – ఆ పక్కనున్న బెత్తం తీసుకు పరుగెత్తింది.

క్రిష్ణయ్య చెంగున ఇటు దూకాడు. కోతి చెట్టుమీదికి దూకింది భయంగా—

'ఇట్రా... ఇట్రా... నీకు మరీ అల్లరెక్కువైపోయింది' అంటూ తరమసాగింది. అల్లరి క్రిష్ణయ్య అందకుండా అటూ యిటూ పరుగులు పెడుతున్నాడు.

'అమ్మా కొట్టకే! ఇంకెపుడూ అల్లరి చెయ్యనే! అమ్మా కొట్టకే!' అంటూ తల్లికి దండాలు పెడుతూ ఏడుస్తూ అరుస్తూ పరిగెడుతున్నాడు.

యశోద పంతంతో మరింత రెచ్చిపోయింది.

'అయితే పోమాకు. రా యిట్రా.'

'అమ్మో నువ్వు కొడతావు.'

ఇంట్లో పనివాళ్ళు, పాలేళ్ళు, గోపెమ్మలు, గోడ వరసగా ఇరుగు పొరుగమ్మలూ చోద్యం చూస్తున్నారు.

'పోనీమ్మా యశోదా వదిలెయ్యమ్మా. కొట్టకమ్మా' అని సలహాలిస్తున్నారు. బ్రతిమిలాడుతున్నారు.

'ముందు మీరంతా ఇక్కడనించి పొండి' అని కేక వేసింది యశోద. పంతం పౌరుషంతో ఆమె కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. ఒళ్ళంతా చెమటలు కారుతున్నాయి. కొప్పు ముడివిడి జుట్టు చెదిరిపోయింది. పైట జారిపోయింది. రైక ముడి సడలింది.

ఆమె కేకలకి అంతా భయపడి సర్దుకున్నారు. చివరికి క్రిష్ణయ్య రెండు గోడలు కలిసే మూల ఇరుక్కుని దొరికిపోయాడు.

యశోద బెత్తం పైకెత్తి మీదికి వస్తోంది ఉగ్రంగా.

క్రిష్ణయ్య ఏడుస్తున్నాడు. చిన్నారి చేతులతో కాటిక కళ్ళు నులుముకుని అంతా పులుముకున్నాడు. కాటిక నలుపు, వెన్నముద్దల తెలుపు, కన్నీళ్ళు, దీనంగా చూసే కళ్ళు.

ఎత్తిన చెయి ఎత్తినట్టే ఉంచి ఆగింది యశోద.

'రెండు దెబ్బలు పడితేగాని పిల్లలకి బుద్ధిరాదు. కన్నయ్యా కొట్టనీ...' అంది.

'ఒద్దమ్మా... బుద్ధి వచ్చేసింది. ఇంకెప్పుడూ అల్లరి చెయ్యనుగా.'

యశోద బెత్తం పడేసింది.

మోకాళ్ళమీద కూచుని చేతులు జాచింది.

క్రిష్ణయ్య ఒక్క పరుగున వచ్చి కౌగిట యిమిడిపోయాడు.

ముద్దులతో ముంచెత్తింది. కొంచెం వెనక్కి జరిగి బిడ్డ ముఖాన్ని పరిశీలనగా చూసింది. 'నన్నింత యాతన పెట్టావు. నిన్ను వూరికే వదిలిపెట్టను.



రా. కాసేపు కట్టేస్తాను' అంటూ రాట దగ్గరకి లాక్కెళ్ళింది. కవ్వం నించి పగ్గాలు రెండు తీసి కిష్టయ్య నడుముకి చుట్టి రోటికి కట్టేసింది.

'కాసేపేనా కుదురుగా కూచో' అంటూ వెళ్ళిపోయింది యశోద.

కిష్టయ్య బుద్ధిగా మఠం వేసుకుని చేతులు కట్టుకుని కళ్ళు మూసుకుని ధ్యానిస్తున్నట్టు కూర్చున్నాడు.

రెండు క్షణాల తర్వాత ఓ కన్ను కొంచెం తెరిచాడు.

తల్లి లోపలికి వెళ్ళినట్టే వుందని, మెల్లిగా రెండో కన్ను తెరిచాడు. చుట్టూ చూశాడు.

కోతిపిల్ల గోడమీదే కూర్చుంది.

'దా... ఇంకా స్త వెన్న పెడతాను' అంటూ కదిలాడు. రోలు బరువుకి ఆగాడు.

అలవోకగా వెనక్కి ఓ చూపు చూసి పాకుతూ కదిలాడు. రోలు పక్కకి వాలి దొర్లుకుంటూ వెనకాలే వస్తోంది.

పెరట్లో రెండు పెద్ద మద్దిచెట్లు జంటకట్టి పక్కపక్కగా దగ్గరగా నిలబడి వున్నాయి. కిష్టయ్య వాటి మధ్యనించి పాకుతూ వెళ్ళాడు. రోలు అడ్డుపడింది.

'హు' అని విసుక్కుని ముందుకు సాగాడు క్రిష్టయ్య.

ఫెళఫెళ మంటూ పెద్ద చప్పుడు చేస్తూ రెండు చెట్లూ నేలకి ఒరిగాయి. క్రిష్టయ్య చలించలేదు. ముందుకు పోతున్నాడు.

'ధన్యులం పరమాత్మా! ధన్యులం' అంటూ ఆ కూలిన చెట్ల లోంచి కుబేర పుత్రులైన నలకూబర మణిగ్రీవులు బయటకు వచ్చి నమస్కరించారు. వారిద్దరూ ఒకపుడు మదిరాపాన మత్తులై మోహావేశంలో అప్సరసలతో దిగంబరులై విహరిస్తుండగా నారదముని అటు వెళ్ళడం జరిగింది. ఆయనను చూసికూడా వాళ్ళు లక్ష్యపెట్టకుండా అలాగే విహరించారు. నారదముని వాళ్ళను మద్ది చెట్లై పడివుండమని శపించాడు. శ్రీకృష్ణమూర్తి దయవల్లనే శాపం తీరి నిజరూపాలు లభిస్తాయని చెప్పాడు.

లీలామానుష విగ్రహుడైన బాలకృష్ణుడికి వాళ్ళు మొక్కారు.

'నారదముని శాపం మా పాలిట వరమైంది. అందువల్ల నీ అనుగ్రహం, దర్శనం లభించి శాపముక్తి పొందే భాగ్యం కలిగింది' అని వారు మాయమైపోయారు.

అంతలో నందుడు యశోద అంతా పరుగున వచ్చారు. కూలిన పెద్ద చెట్ల మధ్య ఏమీ ఎరగనట్టు ఆడుకుంటున్న కృష్ణుణ్ణి చూసి ఆశ్చర్యపోయారు.

యశోద క్రిష్ణుడిని ఎత్తుకుని గుండెలలో పొదువుకుంది.

'అమ్మో! ఎంత గండం తప్పింది నా కన్నయ్యకి' అంటూ కాపాడిన దేవుళ్ళకి మొక్కింది.

'గాలీ లేదు. వానా లేదు. మబ్బూ లేదు. కాని పిడుగులు పడిన శబ్దం, ఈ చెట్లు కూలడం అంతా ఇదేదో రాక్షస మాయలాగా వుంది' అంటూ నందుడూ ఉపనందుడూ ఆలోచనలో పడ్డారు.

ఆనాడు పూతన తృణావర్తుడు శకటాసురుడు...

'ఈ ప్రాంతం బాగాలేదు. నిత్యం రాక్షసులతో భూతాలతో పీడ పట్టింది. మన బిడ్డలకి - ఆలమందలకూ ఇక్కడ క్షేమం కాదు. అందువల్ల మనం బృందావనానికి తరలిపోదాము' అన్నాడు నందుడు.

'అవును. యమునానది ఒడ్డున - ఆ క్షేత్రం అన్ని విధాల

మనకి బాగుంటుంది. అక్కడ గోవర్ధనగిరి కూడా చాలా పచ్చని కొండ. పశుల మేతకు పుష్కలంగా పచ్చిక. నీరు దొరుకుతాయి' అన్నాడు ఉపనందుడు.

'శుభం' అన్నారు పెద్దలు నలుగురూ.

భేరీ తూర్యనాదాలు, ఆ వెనక సన్నాయి డోలువంటి మంగళ వాద్యాలు, వేద మంత్రోచ్చాటన చేస్తూ పురోహిత జనం దారి చూపగా- ఆబాల గోపాలం వ్రేపల్లెనుండి బృందావనికి తరలింది. వేలాది పశువులు - తెల్లవి, నల్లవి, ఎర్రవి, మచ్చలవి, గేదెలు, నందీశ్వరుడివంటి వృషభాలూ, చెంగు చెంగున చెంగనాలువేసే లేగదూడలూ, మేకలూ, గొర్రెలూ, పెద్ద చదునుగా కట్టిన బళ్ళమీద గంపలలో కోళ్ళూ, పావురాలూ, బాతులూ, పంజరాలలో చిలకలూ, మైనాలూ యాత్ర సాగిస్తున్నాయి.

కావిళ్ళలో సామగ్రితో కొందరు బళ్ళ పక్క నడుస్తున్నారు.

గోధూళి ఎర్రటి మేఘంలా పైన నడుస్తూ వాటికి నీడ నిస్తోంది.

ఆ వెనక బళ్ళమీద కడవలతో నీరు పెట్టుకుని పరిచారికలు పిడతలతో నీరుజల్లి లేచే గోధూళిని నేలకి అణుస్తున్నారు. వాటికి కొంచెం ఎడంగా రథాలూ, గూడుబళ్ళూ సాగుతున్నాయి. వాటిలో నందుడూ, ఉపనందుడూ, వారి వారి కుటుంబాలవారూ కూర్చున్నారు. కొందరు మగవాళ్ళు బళ్ళు తోలుతున్నారు. వాళ్ళు ఏనుగు కుంభస్థలంపై కూర్చున్న సింహాలలా వున్నారు. కొందరు నడుస్తున్నారు. బళ్ళమీద, కంచర గాడిదలమీద రకరకాల సామగ్రి వుంది.

ఒక వయసు గొల్లభామలంతా కొన్ని బళ్ళలోచేరి గాజుల చేతులలో చప్పట్లు చరుస్తూ, బళ్ళమీదనే అందెల కాళ్ళలో చిందులు వేస్తూ పాటలు పాడుతున్నారు.

క్రిష్ణయ్య, బలరాముడు వాళ్ళ జతగాళ్ళ అల్లరికి, హడావుడికి పట్టపగ్గాలు లేవు.

బళ్ళమీంచి దూకి అటూ యిటూ పరుగెడుతున్నారు.

వెన్న పాలూ పళ్ళు నీళ్ళువున్న బళ్ళమీదికి చెంగుచెంగున దూకి దొరికింది తిని దూకి పారిపోతున్నారు.



బళ్ళ చక్రాల నడుమ ఇరుసుకి అన్నపు కుండలు వేలాడుతున్నాయి. కొన్నిటికి చిక్కాలలో పచ్చగడ్డి వుంది.

బళ్ళని దాటి చిమ్మన గ్రోవితో నీళ్ళు తీసుకుని ఆడపిల్లల బండీమీదికి వచ్చి భామల రొమ్ములమీద నీరు చిమ్మి ఏడిపిస్తున్నాడు క్రిష్ణయ్య. వాళ్ళ మధ్య దూరి ఒక పిల్ల పిర్రమీద గిల్లుతాడు - మరో పిల్ల పైటలో చెయి దూర్చుతాడు - మరో పిల్ల బుగ్గమీద ముద్దు పెడతాడు. మరోపిల్ల ముద్దుమీద బుగ్గ పెడతాడు.

ఒక దాని కంటి కాటుక వేలితో తీసి ఇంకో పిల్ల ఎర్రటి పెదిమల మీద, బుగ్గలమీద నల్లగా పూస్తాడు.

పట్టుకోబోతే పారిపోతాడు.

అందరిలోకీ రాధ అన్న అమ్మాయి క్రిష్ణయ్య కన్నా కొంచెం పెద్దది. గొల్ల భామల్లో క్రిష్ణయ్యకి ఉజ్జీగా పోటీగా అల్లరి చేస్తోంది.

పారేపోయే కిష్ణయ్యని పైట చెంగుతో కట్టి లాగేసి పడేసింది. ముద్దు యిస్తా రమ్మని, దగ్గరగా వచ్చాక చెవి మెలేసి - తనే ముద్దుపెట్టి పారిపోయింది.

ఓసారి క్రిష్ణయ్య ఆమె చెవిలో ఏదో చెప్పాడు. రాధ ముఖం ఎర్రగా అయిపోయింది. పట్టుకోబోయింది. విడిపించుకు పారిపోయాడు.

రాధ తరిమింది. క్రిష్ణయ్య బళ్ళన్నీ దాటి ఆలమందల్లో కలిసిపోయాడు.

రాధ తరిమింది. ఆవుకీ ఆవుకీ మధ్యనించి, ఆవుల కిందనించి, పైనించి పిచికలా దూరి పారిపోతున్నాడు.

వేలాదిగా వున్న ఆవుల వీపులమీద చిన్నారి పాదాలు మోపుతూ చెంగు చెంగున తూనీగలా ఎగురుతూ పరిగెడుతున్నాడు. ఒకసారి నల్లటి ఆవుమీద పడుకున్నాడు. రాధ పక్కనే వుండికూడా గమనించలేకపోయింది. 'భోఁయ్' మని అరిచాడు. జడుసుకుంది రాధ.

పొద్దు వాలింది.

ఒక చక్కని ఏరు దగ్గర విడిది చేశారు. నెగళ్ళు, వంట పొయ్యిలు, కాగడాలూ చీకటికి నగలై వెలిగాయి.

చీకటిలో నల్ల క్రిష్ణుడికి అన్నం పెట్టడానికి యశోదకు, పదిమంది గొల్ల భామలకూ కూడా సాధ్యం కాలేదు. ఇట్టట్టే పారిపోతాడు. చెట్లకొమ్మ మీదికి ఎగిరిపోతాడు. చీకటి మధ్య నించుని తెల్లగా నవ్వి, పాములా బుసకొడతాడు. తోడేలులా, పులిలా అరుస్తాడు. కొమ్మనించి తలక్రిందుగా వేలాడి - అలాగే అన్నం నోట్లో పెట్టమంటాడు. నోటి

దగ్గరవున్న అమ్మచేతిని పట్టుకుని అటు ఇటు తిప్పి కంగారుపెట్టి చివరకి అమ్మచేతి ముద్ద అమ్మ నోట్లోనే పెట్టేస్తాడు. యశోద కంటనీరు కారే దాకా నవ్వింది. ఆమె మూతిమీద పూసిన అన్నం ముద్దని చూసి నందుడూ - గోపెమ్మలూ అందరూ నవ్వారు. కిష్టమ్మ చప్పట్లు కొట్టాడు. చివరికి యశోద నిజంగానే ఏడ్వసాగింది.

క్రిష్ణయ్య బుజ్జి కుక్కపిల్లలా వచ్చి, దాసింపీట వేసుకుని చేతులు కట్టుకుని కళ్ళు మూసుకుని నోరు తెరిచాడు, 'అమ్మా ఆకలే' అంటూ. యశోద ఆ బాలకృష్ణుణ్ణి చూసి పరవశించిపోయి - చేతిలో అన్నం ముద్దతో అలాగే వుండిపోయింది.

రాత్రి - అంతా పడుకున్నారు. రాధ పాకుతూ వచ్చి క్రిష్ణుడి పాదాల దగ్గరకు చేరింది. కోమలమైన నల్ల కలువ రేకుల్లాంటి పాదాలు కంది ఎర్ర కలువల రంగు తేలాయి. వాటిని మృదువుగా అదమ సాగింది.

అది బ్రహ్మ కడిగిన పాదము.

బ్రహ్మము తానౌ పాదము.

శ్రీమహాలక్ష్మి సంసేవించే శ్రీమన్నారాయణ శ్రీపాదము.

రాధ ఎవరో... ఎక్కడిదో ఎంత పుణ్యాత్మురాలో... జాలి నెపంతో స్వామికి పాదసేవచేసే భాగ్యం పొందింది.

సూర్యుడు ఉదయించాడు.

వ్రేపల్లె వాసులు బృందావనంలో చక్కని పల్లె కట్టుకుంటున్నారు.

జెండాలు ఎగురుతున్నాయి. ఒక వంక యమునా నది. దూరాన గోవర్ధనగిరి. ఎటు చూసినా కంటికి చల్లగా పండుగలా వెలిగిపోతూ వనలక్ష్మి శోభ...

○ ○ ○

కృష్ణుడు, బలరాముడు పన్నెండేళ్ళ పిల్లలయ్యారు.

క్రిష్ణయ్యని నందుడు యశోద, గోపెమ్మలూ పశుల కాపరిగా

ముస్తాబు చేశారు. ధోవతి గోచిపోసి కట్టారు. నడుముకి దట్టి.. చక్కని పాగా చిన్న కర్రకి చివర చద్దిమూట కట్టి బుజాన అమర్చింది యశోద. ఒకడుగు వెనక్కి వెళ్ళి చూసింది. అంతలో రాధ వచ్చింది పాగాలో చక్కని నెమలి పింఛం అమర్చింది. దట్టీలో మురళి అమర్చింది. వేలుని నాలికతో తడిచేసి తన కంటి కాటిక తీసి బుగ్గన దిష్టి చుక్క తీర్చింది...

అందరూ మెచ్చుకున్నారు. ఒక్క క్షణం అటూ ఇటూ చూసి తెగించి బుగ్గమీద ముద్దాడింది.

యశోద హౌరా అని ముక్కున వేలేసుకుంది.

నందుడు తల పక్కకి తిప్పుకున్నాడు...

మిగతా గోపెమ్మల గుండె ఝల్లుమంది. తమకా ధైర్యం లేకపోయిందే - అదృష్టం లేకపోయిందే అని బాధపడ్డారు.

బలరాముడు చప్పట్లు కొట్టాడు - రాధ కదలబోయింది—

'మరి ఇటో...?' అన్నాడు కృష్ణుడు అమాయకంగా చూస్తూ.

'ఇటు... ఇటు నేనిస్తాగా!' అంటూ యశోద ఆ బుగ్గని చిదిపి ముద్దులాడింది.

క్రిష్ణయ్య బయటకి పరుగెత్తాడు.

○ ○ ○

చిట్టడివి...

పొడుగుపాటి వెదురుగడ వాలి వుంది. దానికి గోపాలకులంతా- వాళ్ళ చిన్నారి చలిది మూటలను కట్టి ముడివేస్తున్నారు. క్రిష్ణయ్య గడ చివర విలాసంగా ఆని నించుని చూస్తున్నాడు - చిరునవ్వుతో. మూటలు కట్టడం పూర్తికాగానే చెయ్యి తీశాడు. గడ నిటారుగా పైకి లేచిపోయింది. దానితోపాటు చద్దిమూటలూను. పిల్లలు గొల్లుమన్నారు. క్రిష్ణయ్య వకపక నవ్వాడు. పిల్లలు తరిమారు క్రిష్ణయ్యని. అందరికీ అందీ అందక మాయచేసి పారిపోతూ తిప్పలు పెట్టాడు... చివరికో పెద్ద చెట్టు ఎక్కి సీమచింతకాయలు విసిరాడు. వాళ్ళ కోపం పోయింది. తరవాత కోతి కొమ్మచ్చు లాడారు. కుస్తీలు పట్టారు. ముష్టియుద్ధం చేశారు. క్రిష్ణ డొక్కడు శత్రువులు పదిమంది. పైనించి దేవతలు ఋషులు నివ్వెరపోయి చూస్తున్నారు. జగదేక వీరుడిని - ఈ చిన్న పిల్లలు యిష్టం వచ్చినట్టు కొడుతున్నారు. ఆయన నవ్వుతూ దెబ్బలు తింటున్నాడు. వాళ్ళంతా ఎంత పుణ్యాత్ములో...

అంతలో క్రిష్ణయ్య యమునలో దూకాడు. అందరూ ఈతలు కొట్టి ఆడుకున్నారు. మధ్యాహ్నం అయింది.

కృష్ణుడు వెదురు పొద దగ్గర మురళి వాయించాడు. మూటలు కాసినట్టున్న వెదురుగెడ దానంతటదే వాలింది. పిల్లలందంగా పరుగెత్తి మూటలు విప్పుకున్నారు. నీడలో ఆనందంగా భోజనాలకు కూర్చున్నారు. మట్టి తాబేటి కాయలతో నీళ్ళు పెట్టుకున్నారు.

అందరూ పోటీలుపడి క్రిష్ణయ్యకు తినిపిస్తున్నారు...

'మా ఇంట్లో పెరుగు బావుంది - కాదు మా మీగడ తిను - కొంచెం యీ వెన్న... ఇది మా జున్ను... ఇదిగో మా మాగాయ... మా పచ్చడి... ఇది కొంచెం... ఇంకొంచెం... మరి కొంచెం...' అంటూ తినిపిస్తున్నారు.

ఆకాశంలో దేవతలూ ఋషులూ యీ దృశ్యాన్ని చూసి ముగ్ధులయిపోయారు.

యాగభోక్త శ్రీమహావిష్ణువుకి గోపబాలురు చలిది తినిపిస్తున్నారు. ఇది అపూర్వం, అసదృశం, అని పరిపరి విధాల పొగిడారు. గొల్లపిల్లల భాగ్యానికి అసూయపడ్డారు.

కృష్ణుడు అందరు పెట్టినవీ తినేశాడు. ఆ సంతోషంలో, ఉత్సాహంలో - పిల్లలెవరూ ఏమీ తినలేదు. వాళ్ళ చలిది మూటలన్నీ ఖాళీ అయిపోయాయి.

'మరి మీకో?' అన్నాడు కృష్ణయ్య.

గొల్లపిల్లలు తెల్లబోయారు. 'మాకా...' అంటూనే పొట్టలు తడుముకున్నారు.

'అమ్మో... కడుపు లుబ్బరించుకుపోయాయి. ఇంకా ఏం తింటాం! మాకు నీళ్ళక్కూడా చోటులేదు. అమ్మో ఆయాసం...

నిద్దరొస్తోంది...' అంటూ తలో చోట నీడ చూసుకుని కునుకు తీస్తున్నారు...

బకాసురుడు ఒక చిన్న కొండలా వున్నాడు. ఆ కొండకి చేరువ నీడలో పిల్లలు పడుకున్నారు.

ఆవులు కూడా ఆ నీడలో విశ్రాంతిగా పడుకుని నెమరు వేస్తున్నాయి.

బకాసురుడి ముక్కు పెద్ద బాకుని భూమిలో గుచ్చినట్టు వుంది. తిరగేసిన కొండ మొనను భూమిలో పాతినట్టుంది. కృష్ణుడు దానికి చేరబడి పడుకుని - పరాగ్గా వేణువుతో ఆ ముక్కుమీద లయబద్ధంగా కొడుతున్నాడు. ముక్కుకి మరోవేపు ఒక గోపబాలుడు కూర్చుని - దానిమీద కొడవలిని పదును పెడుతున్నాడు.

ముక్కు మొనకి ముప్ఫై అడుగుల పైన బకాసురుడి ముఖంలో ఒక కన్ను తెరుచుకుంది. దొంగచూపు చూసింది.

ఒక్క క్షణంలో బకబక మంటూ అడివి అదిరిపోయేలాంటి చప్పుడు చేసి లేచింది. ఆవులు దూడలు 'అంబా' అంటూ రంకెలువేసి తలోవేపు పరుగెడుతున్నాయి. గోపాలకులు కూడా అయోమయంగా పరుగెడుతున్నారు. కృష్ణుడు ఉలికిపడి లేచాడు.

బకాసురుడి ముక్కు ఒక్కసారిగా తెరుచుకుంది. పైకి లేచింది. అమాంతం కృష్ణుడి మీదికి దిగి అతణ్ణి, బలరాముడిని, కొందరి పిల్లల్ని మింగేసింది.

బయట కోలాహలంగా వుంది. లోపల పిల్లలు ఊపిరి అందక వుక్కిరి బిక్కిరి అవుతున్నారు.

కృష్ణుడు నిశ్చలంగా నిలబడ్డాడు. భృకుటి ముడిచాడు. ఒక్కసారిగా ఎదగసాగాడు.

క్రమంగా బకుడి ముక్కు అంతా ఆక్రమించాడు. చేతిని జాపాడు. ఆ చేయి బకుడి తలలో దూరి కంటిని ఛేదించి బయటకు వచ్చింది. అలాగే రెండో చేయి రెండో వేపునించి వచ్చింది. రెండు చేతులూ బకుడి ముక్కు రెండు పెదలనూ పట్టుకుని

బలంగా లాగాయి. తేగను చీల్చినట్టు చీల్చసాగాయి. లోపల కృష్ణుడున్నాడు - బకుడు రెక్కలు విప్పి వాటితో, కాలి గోళ్ళతో కృష్ణుడిని పొడిచి గీరి హింసిస్తున్నాడు. కృష్ణుడు వాడి ముక్కుని ఇంకా చీల కొడుతున్నాడు. దేహాన్ని పెంచుతున్నాడు. కొద్ది క్షణాలలో కృష్ణుడి ముందు బకుడి శరీరం అల్పమైపోయింది - చీల్చి చెండాడి కింద పడేశాడు.

అంతలోనే తను తన పూర్వపు రూపానికి తగ్గిపోయాడు...

చీకటి పడింది.

బకుడి దేహం కూలిన కొండలా పడివుంది.

గొల్లపిల్లలంతా క్రిష్ణయ్య చుట్టూ చేరారు. దండం పెట్టారు.

'కృష్ణయ్యా... మన ఆవులన్నీ తలోవేపు పారిపోయాయి. దారి తప్పిపోయాయి. ఇపుడీ చీకట్లో వెదికి తోలుకు రావడం ఎలా... అన్నారు.

క్రిష్ణయ్య మందహాసం చేశాడు...

'మీరు పదండి... అవి వస్తాయి. మీ వెంట వస్తాయి... అని అభయం యిచ్చాడు.

వేణువు పూరించాడు.

ఎక్కడెక్కడో పొదల మాటున భయంతో దాగివున్న పశుగణం అంతా - వేణుగానం విని కృష్ణుడి దగ్గరకు పరుగున వచ్చాయి.

కృష్ణుడు వాటిని ఒక దారిలో పెట్టాడు.

గోపాలురు ఇళ్ళకు వెళ్ళారు గోవులతో...

కాని కృష్ణ భగవానుడు మాత్రం ఇంటికి వెళ్ళలేదు. వేణువుని వేదనాదంలా పూరిస్తున్నాడు. సకల చరాచర జీవకోటిని ఆకర్షిస్తున్నాడు - అమ్మలా నాన్నలా గురువులా దైవంలా బిడ్డలా బంటులా భార్యలా నేస్తంలా...

ం ం ం

వేణుగానం బృందావనం అంతటా విహరిస్తోంది, పిలుస్తోంది. స్నానంచేసే గోపెమ్మలనూ, భర్తలకు వీపురుద్ది నీళ్ళుపోస్తున్న గొల్లభామలనూ, అన్నం వడ్డించే సతులనూ, చెరోచేతినీ పట్టుకు రుద్దుతోన్న జంట భార్యలనూ, జడలల్లుకుని పూలు తురుముకునే బంతిపూల రథాలను, పంచకల్యాణి గుర్రాలను, బంగారు తల్లులను, బాచాల కొండలను పలకరించి పులకెత్తించి చెవి పట్టుకుని లాక్కుపోతూంది.

జడలు పట్టుకుని కళ్ళెంలా తోలుతూంది. చెయి పట్టుకుని లాక్కుపోతోంది...

అందరిదీ ఒకటే గమ్యం-బృందావనం - కాదు క్రిష్ణమూర్తి.

అది వెన్నెలవేళ మల్లెలవేళ నవ్వులవేళ - వేయి వేణువులు మోగేవేళ... హాయి చల్లగా పాడేవేళ...

కొండమీద జలపాతం నేలను చేరినట్టు—
నదులు సముద్రాన్ని చేరినట్టు—
దూడ ఆవును చేరినట్టు—

అర్థం మాటని చేరినట్టు—
పార్వతి శివుని చేరినట్టు—
గోపికలు కృష్ణుడిని చేరుతున్నారు...

వెన్నెల వాళ్ళ మనసుల్లో ఆనందంలా వెల్లివిరిసింది.

పిల్లగాలి వాళ్ళ ముంగురులను సవరించినట్టు- వేణుగానం వాళ్ళ గుండెలలో కోరికలను సవరిస్తోంది.

కృష్ణుడు ఒక చెట్టుకు ఆనుకుని విలాసంగా నిలబడి వ్యత్యస్త పాదారవిందుడై వేణువు వాయిస్తున్నాడు.

ఒక గోపిక పరుగున వచ్చింది. ఆయాసంతో ఆమె ఒగురుస్తోంది. నెన్నుదుట చిరుచెమటలు...

కంగారుగా అటూ యిటూ చూసింది.

'ష్... వాళ్ళందరూ వచ్చి పడిపోతారు. ఇటురా. నాకు తెలిసిన

ఒక చక్కని చోటుంది. అక్కడి కెవ్వరూ రాలేరు. మనిద్దరమే అంటూ కృష్ణుడి చేయి పట్టుకుని వెనక్కి చూడకుండా పరుగెత్తింది. నించున్న కృష్ణమూర్తిలోంచి మరో మూర్తి కదిలి ఆమె వెంట పరుగెత్తింది.

అంతలో మరో గోపబాల వచ్చింది.

'ఇట్రా ఇట్రా కన్నయ్యా చప్పున... ఈ పొదలో దాంకుందాం' అంటూ కృష్ణుడిని మరోవేపు లాక్కుపోయింది.

మరో అమ్మాయి వచ్చి పైటచెంగు మెడచుట్టూ వేసి తనవేపు లాక్కుపోయింది.

ఇంకో అమ్మాయి ఇంకోవేపు - ఇలా 24 మంది గోపికలు 24 గురు క్రిష్ణయ్యలూ యమునా తీరాన విహరిస్తున్నారు.

ఒక పొదరింటిలో - గోపిక పచ్చిక పరచింది. పూలు జల్లింది. కృష్ణుడిని కూర్చోపెట్టి తను అతనిని అనుకుంది. పరవశించి పోతూంది.

'మనమిలా దాంకుంటే పాపం వాళ్ళంతా వెతుకుతారు' అన్నారు కృష్ణుడు.

'వెతుకోన్నీ... ఎవరికి వారే యమునా తీరే...' అంది రాధ.

ఒక చెట్టు కొమ్మన ఒక బాల, స్వామితో నిలువు టుయ్యాల వూగుతూంది. ఉయ్యాల చుక్కల్ని చంద్రుణ్ణీ తాకుతోంది. నక్షత్రాలు ఆమె పాద మంజీరాలలో తళుకులలా మెరుస్తున్నాయి. కృష్ణుడు భయపడ్డాడు.

'నీకేం భయంలేదు. నేనున్నానుగా. నన్ను గట్టిగా కావలించి పట్టుకో!' అంది ఒక రాధ.

'ఓట్టు? నిజంగా?' అన్నాయి కృష్ణయ్య కళ్ళు.

మరోచోట కృష్ణుడికి తాంబూలం ఇచ్చి నాలిక చాపమంది - రంగు చూడ్డానికి.

'అబ్బో నీకు నేనంటే చాలా ఇష్టం...' అంటూ ముందుకు వంగి ఆ నాలికను తన నాలికతో తాకి ముద్దు పెట్టింది.

ఒకచోట గోపీ కృష్ణులు చక్కని చిన్న పడవలో నదిమీద విహరిస్తున్నారు.

మరోచోట ఒక బాల, క్రిష్ణయ్య కురులను తన జడ చివర జుట్టుతో కలిపి పెనవేసి జడ అల్లుతూంది.

మరోచోట కృష్ణుడి వడిలో తల పెట్టుకు పడుకుంది. కృష్ణుడు వేణువు వాయిస్తున్నాడు.

ఒకచోట రాధాకృష్ణులు జలక్రీడ లాడుతున్నారు.

కృష్ణుడు రాధ ఒకరిమీద ఒకరు నీళ్ళు చిమ్ముకుంటున్నారు.

జంట చేపల్లా ఈతలు కొడుతున్నారు.

అంతలో రాధ కెవ్వున కేకవేసింది—

నీటిలో ఎవరో మునిగి వచ్చి రాధ తొడ గిల్లారు. ఒక్క క్షణం తరవాత ఆ గిల్లిన కృష్ణుడు నాలు గడుగులు అవతల పైకితేలి కొంటెగా నవ్వి కన్నుగిలిపి ఈదుకు పోతున్నాడు.

రాధ - 'చూశావా... పోడు పిల్లాడు...' అన్నట్టు చూసింది.

కృష్ణయ్య నవ్వాడు.

'ఎవడో నాలాంటి పోకిరీయే!'

'వాడి మొహం... నీలాంటి పోకిరీ నువ్వొక్కడివే...' అంది రాధ.

ఒకచోట ఒక చంద్రలేఖ భుజాలమీద చేతులువేసి, వెనక్కివాలి ఆమె ముఖాన్ని పరిశీలనగా చూస్తున్నాడు.

'నీ ముఖం చందమామ... నీ ముక్కు నువ్వుపువ్వు... నీ కళ్ళు...' అంతలో కృష్ణుడికి కొంచెం దూరంలో ఇంకో సుందరి కనబడింది. ఆమె పైట సరిచేసుకుంది. 'ఊఁ... నీ కళ్ళు... చెప్పు'

అంది చంద్రలేఖ. 'దబ్బ పళ్ళు... అన్నాడు కృష్ణుడు ఇంకో సుందరి పైట పొంగులను చూస్తూ—

ఒక పొదరింటిలో ఒక భామ తను కృష్ణుడి బట్టలు వేసుకుని, తనవి కృష్ణుడికి తొడిగింది.

కృష్ణుడు తలవంచి తన రొమ్ముకేసి చూసుకుని ప్రశ్నార్థకంగా చూశాడు భామకేసి. భామ తటాలున వెనక్కి వెళ్ళి గాఢంగా కౌగలించుకుంది. కృష్ణయ్యకి రొమ్ములు పొంగాయి.

విశాలంగా చదునుగావున్న ఒక పచ్చికబయలుమీద కృష్ణుడు గోపికలను వర్తులాకారంగా నిలబెట్టాడు. తాను వేణువుతో నృత్యం చేస్తూ ఒక్కొక్కరి మధ్యనుండి వెళ్తున్నాడు.

భామలు వున్నచోటే నర్తిస్తూ తమ చుట్టూ తాము తిరుగుతున్నారు...

అంతలో ఒక భామ ఎదర మరో కృష్ణుడు నిలిచాడు. ఆ చివర ఇంకో కృష్ణుడు గానం, నాట్యం క్రమంగా ప్రస్తారితమై పై స్థాయికి చేరేసరికి ఇరవై నలుగురు గోపికలకీ ఇరవై నలుగురు కృష్ణమూర్తులు అమరారు. అందరూ కలసి చక్రాకారంలో తిరుగుతూ నర్తిస్తున్నారు. మధ్యలో ఒక కృష్ణుడు నిలచి వేణు వూదుతున్నాడు.

నారీ నారీ నడుమ మురారీ
హరికీ హరికీ నడుమ వయారీ!

○ ○ ○

ప్రకృతి పురుషుల యుగళ గానం, యుగళ నాట్యం పరాకాష్ఠనందుకుంది. స్త్రీ పురుష సంయోగ వైభవం కొత్త సౌందర్యంతో వెల్లివిరిసింది.

ఆకాశాన నిలిచి ఈ మహోజ్వల ఘట్టాన్ని ముగ్ధులై చూస్తున్న ముక్కోటి దేవతలు పుష్ప వృష్టితో స్వామిని పూజించారు...

చంద్రుడు చెట్టు చాటుకు వెళ్ళిపోయాడు.

పచ్చిపాలలాటి తెల్లటి వెన్నెలకి కాచిన పాల ఎర్రదాలు

రోచింది. పక్షులు మేలుకున్నాయి. కోళ్ళు మేలుకొలుపుతున్నాయి. లేగ దూడలు అమ్మని పిలుస్తున్నాయి.

యమునా తీరాన దృశ్యాలు చూసి తూరుపు సిగ్గుతో ఎర్రబారింది...

ఒక పొదరింటిలో రాధాకృష్ణులు బట్టలు వేసుకున్నారు. ఇద్దరూ అలసిపోయి వున్నారు. కన్నులు ఎర్రగా వున్నాయి. ఇంతసేపు రాని నిద్ర ఇపుడు ముంచుకు వస్తోంది. రాధ కురులు మాధవుడి నగలలో, మాధవుడి సరాలు రాధ చెవులకు తగులుకుని చిక్కుపడ్డాయి. కృష్ణుడు రాధ ముంగురులను సవరించాడు.

మరోచోట చంద్రలేఖ రొమ్ముల మీద, బుజాలమీద నఖక్షతాలను చూసుకుంటోంది - మరోచోట ఒక బాల, కృష్ణుడి బుగ్గమీద పూసివున్న కుంకుమ మరకలసి చెంగుతో తుడుస్తోంది. రాధాకృష్ణులు బయలు దేరారు. ఒక పొద దగ్గర దారులు విడిపోయే చోట ఆగారు.—

రాధ కృష్ణుడి చేతులు రెండూ తన చేతులతో పట్టుకుంది—

'కృష్ణా! ఈ జన్మకే కాదు - శతకోటి జన్మలకి కూడా ఈ ఆనందం చాలు, కాని చాలదు... నన్ను నీలో కలిపేసుకో పాలలో నీరులా నీటిలో ఉప్పులా వేణువులో పాటలా మాటలో అర్థంలా చీకటిలో వెలుగులా పెదిమలో ముద్దులా మీగడలో రుచిలా కంటిలో చూపులా కలిసిపోనీ కరిగిపోనీ. కృష్ణా నిన్ను విడిచి వుండలేను. నిన్ను ఇంకొకరు ఎత్తుకుపోతే భరించలేను. నాకు మాటివ్వు కృష్ణా... నన్ను

Varalakshmi Srimurthy

తప్ప ఇంకెవరినీ చూడనని - నాకు తప్ప నీ మన సెవ్వరికి ఇవ్వనని ఒట్టుపెట్టు కృష్ణా' అంది. అరచేయి జాచింది.

కృష్ణుడు కొంటెగా చూసి మందహాసం చేశాడు. తల పంకించాడు. తన చేయి ఎత్తి ఆమె చేతిలో గట్టిగా ఒట్టు వేశాడు.

'టప్'న చప్పుడైంది.

ఉత్తర క్షణంలో దానికి ప్రతిధ్వనిలా టపటపటప మని చప్పుళ్ళు వినిపించాయి.

కృష్ణుడు తెల్లబోయి చూశాడు.

రాధ అనుమానంగా పక్కకి చూసింది. ఇంకో భామకి ఇలాగే కృష్ణుడు ఒట్టేస్తున్నాడు. అలాగే మరోచోట... మరోచోట... ఇంకోచోట... ఇరవై నాలుగు ఒట్లు... చప్పట్లు...

మందిరే మందిరే మాధవం... మాధవం...

సుందరీ సుందరీ మాధవం ... మాధవం...

o o o

బృందావనం—

ఒక రావిచెట్టుకింద కన్యకాపరమేశ్వరీ అమ్మవారి విగ్రహం వుంది. దానికి కొంచెం దూరంలో ఒక వెదురు పొద...

వేణుగోపాలుడు అటు నడిచివస్తూ వెదురుపొద దగ్గర ఆగాడు. తన చేతిలో వేణువుని చూశాడు. వెదుళ్ళని చూశాడు. లేత వెదుళ్ళు ఆనందంగా సన్నటి ఈలవేశాయి. ఉత్సాహంగా ముందుకు వంగాయి. నన్ను తీసుకో అంటే నన్ను తీసుకో అని పోటీలు పడుతున్నాయి. గోపాలుడు చిరునవ్వుతో ఒక వెదురు పిల్లను తాకి మునివేళ్ళతో

నిమిరాడు. వేణువు వాయించినట్టే రెండు చోట్ల వేళ్ళు ఆనించి తీశాడు. ఆ కన్నె వేణువు ఒళ్ళు పులకలెత్తింది. కిన్నెరలా పాడింది—

అంతలో కలకల నవ్వులు గలగల అందెల గాజుల చప్పుడు వినబడింది. గోపికాలోలుడు అటు చూశాడు. రావిచెట్టుకింద అమ్మవారి ఎదుట పదిపన్నెండుగురు కన్నెపిల్లలు కళ్ళు మూసుకుని మొక్కుతున్నారు.

కృష్ణుడు పొదమాటునుంచి చెట్టుచాటుకి నడిచాడు.

పిల్లలు కళ్ళు గట్టిగా మూసుకుని దండాలు పెడుతూ అమ్మవారికి గట్టిగా మొక్కుకుంటున్నారు.

'అమ్మా! కన్యకాపరమేశ్వరీ - మా పన్నెండు మందికీ గోపాలకృష్ణుడినే మొగుడిగా చెయ్యి. ఇంకెవరూ వద్దు. మేం పోట్లాడుకోకుండా సఖ్యంగా, సౌఖ్యంగా వుంటాం. క్రిష్ణమూర్తితో మాకు పెళ్ళయితే నీకు ఆ మార్నాడే ఉపారాలు పెట్టి పన్నెండు రోజులు జాతర చేస్తాము.'

కృష్ణుడు వారిని పరిశీలనగా చూశాడు. నవ్వుకున్నాడు.

అమ్మాయిలు యమునకేసి పరుగెత్తారు. పరుగెడుతూనే బట్టలు విడుస్తూ ఒడ్డుకు చేరగానే అవన్నీ గట్టున పడేసి నీళ్ళలోకి దూకారు. కేరింతలు కొడుతూ నవ్వుతూ పాడుతూ ఆటలాడుకుంటున్నారు. ఈతలు కొడుతున్నారు. అందరూ మత్స్య కన్యల్లా వెలిగిపోతున్నారు. ఈతలు కొడుతూనే చక్రాలుగా చదరాలుగా త్రికోణాలుగా పద్మాలుగా జల చిత్రాలు రచిస్తున్నారు.

కొంటె క్రిష్ణుడు వాళ్ళు చూడనివేళ ఆ బట్టల మధ్యకి దూకాడు. ఒక భామ చీర కప్పుకుని మెల్లిమెల్లిగా కదులుతూ చీర లన్నిటినీ



లుంగ చుట్టాడు. వాళ్ళు చూడకుండా పొన్నచెట్టు మొదలు చేరాడు. చెట్టెక్కి కూర్చున్నాడు.

కన్నెలు జలక్రీడలు చాలించి ఒడ్డు చేరబోయారు - కెవ్వున కేక పెట్టారు.

'చీరలు... మన చీరలు!'

అందరూ అప్రయత్నంగా నీళ్ళలోకి దూకి పీకలదాకా మునిగి వించున్నారు.

కళ్ళలో భయం... కంగారు—

జుట్టు పైకి చుట్టి కట్టుకున్న 'ఆజాను వేణి' ఒకతె జుట్టువిప్పి రొమ్ములను, ఊరువులను కప్పుకుని, చేతులతో ఆ జుట్టుని అదిమి పట్టుకొని గట్టుదాకా నడిచివచ్చి అటూ ఇటూ చూసింది గాలి కెగిరాయేమోనని...

వేణుగానం వినబడింది.

ఒక్క కేకపెట్టి చేపలా నీళ్ళలోకి దూకేసింది.

అందరూ పైకి చూశారు.

పొన్నచెట్టు కొమ్మమీద - రసిక చక్రవర్తి బాలకృష్ణుడు కూర్చున్నాడు- కాలిమీద కాలు వేసుకుని. కొమ్మమీద చీరెలు వేలాడుతున్నాయి. అందరూ గోలపెట్టారు.

'అల్లరి పిల్లాడా - పోకిరీ పిల్లాడా - మా చీరెలు మా కివ్వు - లేపోతే—'

'లేపోతే ఇలాగే వూళ్ళోకెళ్ళి అందరికీ చెప్తారుకదు ? వెళ్ళండి. మిమ్మల్ని అలా చూసేసి నేనూ వెళ్ళిపోతాను' అన్నాడు చిలిపి కృష్ణుడు.

గోపికలు బ్రతిమాలారు.

'మీరిందాక అమ్మవారి నేం వరమడిగారో నాకు తెలుసు. నేను విన్నాను. కాబోయే మొగుడిదగ్గర సిగ్గెందుకు - దాపరిక మెందుకు... అయినా నాకు తెలీని రహస్యాలు మీ దగ్గరేమున్నాయని... అంత గొడవ ?' అన్నాడు.

'అన్నీ తెలిస్తే - ఇంకీ గొడవెందుకు...

'అవి నేను తెలుసుకున్న రహస్యాలు. ఇవి మీరు మీ అంతట మీరు 'మనసు' విప్పి బైట పెట్టబోయే రహస్యాలు. కావాలంటే నా రహస్యాలన్నీ మీకు చెప్పేస్తాను. ముందు మీరు ఇటొచ్చి ఎవరి చీరలు వారు తీసుకోండి. నేను చెట్టుమీదే వుంటాను.'

గోపిక లందరూ ఒకరితో ఒకరు గుసగుస లాడుకున్నారు. వాదించుకున్నారు.

'చలి తట్టుకోలేం పద' అని ఒకరు. చచ్చిపోతాను గాని పైకి రానని ఒకతె. కాసేపుంటే వూరివాళ్ళెవరైనా వస్తే అదేగతి - అని ఒకరూ అంటున్నారు.

ఒకరు ముందుండి మిగతా వాళ్ళందరం వెనకాలే నించుని వెళదాం అని ఒక పిల్ల అంది.

'ముందుండే దెవరుటా!' అన్నాడు కృష్ణుడు. నువ్వంటే నువ్వు అంటున్నారు గోపికలు.

'నాకు నిద్రొస్తోంది- పడుకుంటాను. ఇక పిలిచినా లేవను.' అన్నాడు కృష్ణయ్య.

'వద్దు వద్దు' అంటూ చేతులతో రొమ్ములు కప్పుకుని ముందుకు వస్తున్నారు.

'అలా కప్పుకుంటే నే నొప్పుకోను... అసలు అమ్మవారి నోము పట్టి దిసమొలలో స్నానం చెయ్యడం మహాపాపం. అందుకని ఆవిడకీ-కాబోయే ఈ మొగుడికీ చేతులెత్తి దండాలు పెడుతూ రండి' అన్నాడు గోపికా లోలుడు.

వాళ్ళు విధిలేక ఒకచేయి పైకెత్తి మొక్కుతూ రెండో చేత్తో మానధనాన్ని కప్పుకుని పైకి రాసాగారు.

'ఒంటి చేతి చప్పట్లు పేలవు... ఒంటిచేతి దండాలు పలకవు' అన్నాడు క్రిష్ణయ్య.

ఇరవై నాలుగు కళ్ళు దీనంగా చూశాయి. కంట నీరు తిరిగింది.

కృష్ణుడు భువన మోహనంగా నవ్వాడు.

ఆ నవ్వుకి వాళ్ళ కళ్ళలో దైన్యం పోయి ఒక మహత్తరమైన ఆనందం మేలుకుంది.

ఇపుడు వాళ్ళ కళ్ళనిండా మనసునిండా గోపాల కృష్ణదే. సమ్మోహన చంద్రహాసమే.

తనువంతా అణువణువునా వేణుగాన నాదమే. తమకు కనబడే ప్రభువే తప్ప - తమని ఎవరు చూస్తున్నారు. తా మెవరూ అన్న ఆలోచనే పోయింది. నిర్మలమైన మనసుతో, కన్నులతో, నవ్వులతో నిస్సంకోచంగా చేతులు పైకెత్తి జోడించారు.

'శ్రీకృష్ణా! భువనైక మోహనా! మమ్మల్ని నీలో కలుపుకో!' అని కళ్ళతో మొక్కారు.

○ ○ ○

బకాసురుడి తమ్ముడు అఘాసురుడు గోపకులంపై పగబట్టాడు. అతడిని కంసుడు రెచ్చగొట్టాడు.

'పెద్ద ముక్కున్నా మా అన్న నోరులేని అమాయకుడు... వాడిని ఒక్కణ్ణీ చేసి కృష్ణుడూ గోపాలకులూ కలిసికట్టుగా కొట్టి చంపారు. ఇప్పుడు నేను ఒక్కడినీ వాళ్ళందరినీ మింగేసి చంపేస్తాను' అని ప్రకటించి కదిలాడు అఘాసురుడు.

గోకులం చేరి - ఒకచోట పెద్ద కొండంత కొండచిలువగా పడుకున్నాడు. వాడి నోరు పెద్ద కొండ గుహంత వుంది... పళ్ళ మధ్య ఇగుళ్ళ మధ్య ఉండే సందులే పెద్ద పెద్ద సింహపు గుహల్లా వున్నాయి. గోవులతో వెళ్తున్న గోపబాలకులు ఇది చూశారు.

వీ డింకో కొత్త రాక్షసుడు... కొండ గుహలా నోరూ వీడూను మన్ని మింగేస్తాడు కాబోలు... శకటాసురుడినీ బకాసురుడినీ చంపిన మన క్రిష్ణయ్య ఉండగా మనకేమిటి భయం... రండి ఈ రాకాసి గుహలోకి మనమే వెళ్ళి లోపలేం వుందో చూదాం' అంటూ గోపాలకులందరూ ఆలమందలు తోలుకుని అఘాసురుడి నోట్లో ప్రవేశించారు. లోపలికి వెళ్ళిపోయారు. క్రిష్ణుడు ఇది చూశాడు.

'అయ్యయ్యో... వీళ్ళు నా అండ చూసుకుని - నిర్భయంగా లోపలికి వెళ్ళిపోయారు... వాడు వీళ్ళని మింగి చంపేస్తే పెద్దలకేం

చెప్పాలి...' అనుకుని తనూ పరుగున వెళ్ళాడు. అఘుడి నోట్లో ప్రవేశించి కంఠం దగ్గర నిలిచి - శరీరం పెంచసాగాడు. పెరిగి పెరిగి కంఠ ద్వారాన్ని పూర్తిగా మూసేశాడు. వాడికి ఊపిరి ఆడకుండా దిగ్బంధం చేసేశాడు.

అఘుడు గాలికోసం గిలగిల తన్నుకుంటున్నాడు.

లోపల చీకటికీ సంచలనానికీ గో గోపకులు కలవర పడు తున్నారు. కొంచెం సేపటిలో అఘుడికి దేహం లుంగ చుట్టుకుపోయి గిలగిల తన్నుకుంటూ పెటేలున పొట్టబద్దలై చచ్చిపోయాడు.

గోప కుమారులు ఆవులను తోలుకుంటూ బయట పడ్డారు. ఆనందంతో చప్పట్లు కొట్టారు. 'మాకు తెలుసు కిష్టయ్య కాపాడతా దని...' అంటూ - రాక్షసుడిని తామే చంపేసినట్టు సంబరపడి పోయారు.

○ ○ ○

గోవర్ధనగిరి సమీపంలో ఒక పెద్ద తాటితోపు వుంది. అక్కడ తాటిపళ్ళు చాలా రుచిగా వుంటాయి గాని ధేనుకాసురుడనే వాడు తన బలగంతో గాడిద రూపంలో అక్కడ వుంటున్నాడు. ఎవరు వెళ్ళినా - మనిషి జంతువు పండు కాయ అని తేడా లేకుండా మింగే స్తున్నాడు.

బలరాముడి కిది తెలిసి ఒకనాడు ఆ వనంలోకెళ్ళి తాటి చెట్లను వూపి పళ్ళు నేలరాల్చాడు. పిల్లలంతా అపురూపంగా అవి తీసుకు తింటున్నారు.

దిక్కు లదిరేలా అరుస్తూ ధేనుకాసురుడు బలరాముడి మీదకు ఉరికాడు. బలరాముడి రొమ్ములమీద తన్నాడు. తిరిగి మీదపడి కరవ బోయాడు. బలరాముడు వాడి నాలుగు కాళ్ళు ఒక్కసారిగా దొరక పుచ్చుకుని గిరగిర తిప్పి విసురుగా గిరవాటేశాడు.

ఆ గాడిద ఒక తాడి చెట్టుకు కొట్టుకుని పడి చచ్చింది. ఆ దెబ్బకు ఆ తాడి మరో తాడిమీద అది పక్కదానిమీద పడి - ఇలా వందల చెట్లు ఫెళఫెళమంటూ కూలిపోయాయి.

గోపాలకులు పళ్ళు కోసుకుంటున్నారు. అంతలో ధేనుకాసురుడి బలగం అంతా గాడిదల రూపంలో విరుచుకుపడింది. బలరామ కృష్ణులు విజృంభించి వాటిన్నిటినీ వెనక కాళ్ళు పట్టుకు గిరగిర తిప్పి నేలకేసి కొట్టి చంపారు...

○ ○ ○

ఒకసారి కంసుడి పనుపున ప్రలంబాసురుడు వచ్చాడు. బలరామ కృష్ణులు చెలికాళ్ళతో ఆడుకుంటూ వుంటే వాడు కూడా ఒక గోపాల కుడిలా వచ్చి వాళ్ళలో కలసి ఆడసాగాడు. కృష్ణు డిది కనిపెట్టి అన్న కేసి చూసి కన్నుగొట్టి హెచ్చరించాడు...

ఆట వరసలో ఒకరి భుజాలపై ఒకరెక్కి పరిగెట్టిస్తున్నారు. వాటం చూసి ప్రలంబుడు బలరాముడిని తన భుజంమీద ఎక్కించుకుని పరుగెత్తాడు. పదడుగులు వేళ్ళగానే దేహం పెంచి రాక్షస రూపం ధరించి పైకెగిరి పోసాగాడు. వెంటనే బలరాముడు వాడి పీకపట్టుకు నులమసాగాడు. భుజాలమీద నించుని పిడికిలి బిగించి వాడి నెత్తిమీద ఒక్క దెబ్బ కొట్టాడు. తల పగిలిపోయి నెత్తురు భళ్ళున బయటకు వచ్చింది.

కిందనించి చూస్తే గోపాలకులకు రాక్షసుడి రక్తం ఎర్రటి జల పాతంలా కనబడింది.

ఇంకో క్షణానికి రెక్కలు తెగిన పర్వతంలా రాక్షసుడు నేల కూలాడు. వాడి తలపై నించి బలరాముడు కిందకి పురికాడు.

రాకాసి నెత్తురుతో బట్టలు తడిసివున్న బలరాముడు వేసవి సూర్యుడిలాగా నిప్పులు చెరుగుతున్నట్టు వెలిగాడు...

ం ం ం

ఒకనాటి రాత్రివేళ బలరామ కృష్ణులు గోపికలతో యమునా



సైకతాన ఆట పాటలతో వినోదిస్తున్న వేళ—

కుబేరుడి భటుడు శంఖచూడు డనేవాడు మాయచేసి గోపిక లంద రినీ మరుచోటికి ఎత్తుకుపోయాడు...

మహా మాయావి కనురెప్పపాటులో ఇది గ్రహించాడు.

గోపికలు ఆర్తనాదాలు చేసే వేళకే బలరామ కృష్ణులు రెండు

8

చెట్లు పెకిలించుకుని వెళ్ళారు. వారిని చూసి శంఖచూడుడు బెదిరి పారి పోయాడు. గోపికలను అన్నకి ఒప్పచెప్పి కృష్ణుడు శంఖచూడుని వెంట తరిమాడు. ప్రాణ భయంతో వాడు అనేక మాయ రూపాలు

ధరించి తప్పించుకోబోయాడు. వా డికెక్కడికి వెళితే అక్కడికి, ఏ రూపంలో వెళితే ఆ రూపంలో కృష్ణుడు వెంట తరిమి చావగొట్టాడు. చేసిన తప్పుకి చంపడం అనవసరమని క్షమించి వదిలేశాడు. వారి శిరస్సునవున్న పెద్ద రత్నాభరణాన్ని తీసుకుని వచ్చి అన్న బలరాము డికి కానుకగా సమర్పించాడు.

○ ○ ○

మరోనాడు వృషభాసురుడు ఆలమందమీద పడి కుమ్మి బీభత్సం చేయసాగాడు. కృష్ణుడు వాడితో తలపడి వాడి తలపట్టి కొమ్ములు ఒడిసి పట్టి మెడ విరిచాడు. ఒక కొమ్మును పీకి దానితోనే పొడిచి నేల కూల్చాడు.

○ ○ ○

కృష్ణలీలల కథలు, నమ్మశక్యంకాని పోరాటాలు, రాక్షస వధల కథలూ విన్నకొద్దీ కంసరాజుకి రోషం కసి కలవరం పెరిగాయి. భయం పట్టుకుంది... భయంలో శరణుకోరే బుద్ధి పుట్టలేదు. మరిద్దరు బల



వంతుల్ని పంపించి చంపించాలన్న పట్టుదల పెరిగింది. తన సైన్యంలో అత్యంత శక్తిమంతులైన కేశి, వ్యోముడు అనే రాక్షసు లిద్దర్నీ రెచ్చ గొట్టి పంపాడు.

కేశి ఒక మదించిన గుర్రం రూపం ధరించి వెళ్ళాడు. క్రిష్ణుడు వాడితో పోరాడి వాడి నోటిలో తన బుజాన్ని వుంచి పెంచసాగాడు... క్రమంగా అది వాడికి దిగ్బంధం చేసేసింది. ఊపిరాడక పొట్ట ఉబ్బి ఉబ్బి పతాలున దేహం దోసపండులా బద్దలై పోయింది.

○ ○ ○

వ్యోముడు దొంగచాటుగా వచ్చి గోపాలకు లందరినీ ఎత్తుక పోయి ఒక గుహలో పెట్టి పెద్ద బండతో ద్వారం మూసేశాడు. కృష్ణుడు అక్కడికి వచ్చి వాడిమీద కురికాడు. సింహం నక్కనిపట్టి కొట్టినట్టు కొట్టాడు. వాడు విలవిల తన్నుకుంటూ నేల కొరిగాడు. కృష్ణుడు గుహదగ్గర బండను కాలితో ఒక్క తాపు తన్నాడు. అది బంతిలా ఎగిరి దూరాన పడింది.

గోపాలకులూ గోవులూ బిలబిలమంటూ బయటకు వచ్చారు. దేవతలు పుష్పవృష్టి కురిపించారు.

నిశ్శబ్దం. ఒక కోడెదూడ తల్లిని విడిచి రెండడుగులు నడిచి పచ్చిక మేస్తోంది. పెద్ద పాముతోక విసురుగా వచ్చి పెద్ద శబ్దంచేస్తూ దూడని కొట్టి, చుట్టుకుంది. ఉత్తర క్షణంలో దూడని పైకి ఎగరేసి పట్టు విడిచింది. దూడ 'అంబా' అంటూ యమున. మధ్యలో పడింది. పడీ పడుతుండగానే సర్పరాజు కాళీయుడి పడగ గప్పున విప్పలు కక్కి, బుసకొట్టి వెనక్కివాలి దూడని కాటేసింది. యమున ఎర్రబారింది.

గట్టుమీదవున్న తల్లి ఆవు నీటిదాకా వచ్చి ఆగి - మోర పైకెత్తి 'అంబా' అని ఆర్తనాదంచేసి నీటిలోకి దూకింది బిడ్డకోసం... కాళీయుడి పడగ తిరిగి పైకొచ్చి విప్పారుచ్చుకుంది. ఆవుని కొట్టడానికి వాటం కుదుర్చుకుంటోంది.

నది ఒడ్డున చెట్టు కొమ్మమీదకి ఎగిరి వాలి నిల్చాడు కృష్ణుడు. పంచెమీద ధట్టీని బిగలాగి కట్టాడు... పై కెగిరాడు... సుదర్శన చక్రంలా గిరగిర తిరుగుతూ కాటేయబోతున్న కాళీయుడి శిరస్సుమీదికి ఉరికాడు. కాళీయుడి పడగ పెద్ద శబ్దం చేస్తూ మంటలు కక్కుతూ ఒక్కసారి నదిలోకి దిగిపోయింది. నేలని తాకింది. కృష్ణుడు మాత్రం పడగమీద తాపు తన్ని అదే ఊతగా పై కెగిరాడు. అడుగుకు పోయిన

పడగ సంభ్రమంతో పట్టరానికోపంతో తిరిగి ఉధృతంగా పైకి లేచింది. లేచిన క్షణానికి గాలిలో ఎగురుతున్న బాలకృష్ణుడు తిరిగి పడగమీద ఉరికాడు. పద ఘట్టనానికి కాళీయుడు అదిరిపోయాడు.

యమున అల్లకల్లోలమై కొండంత కెరటాలతో ఘూర్ణిల్లింది. కాళీయుడి పడగ లుమిసే మంటలూ - యమున కెరటాలు ఎగజిమ్మే నీటి జల్లూ అద్భుతమైన దృశ్యాన్ని కట్టాయి.

గట్టుమీదకి గోపబాలురు - నందుడు యశోద గోకులంలో పెద్దా చిన్నా అంతా రొప్పుతూ రోజుతూ వచ్చారు.

కాళీయుడు ఈసారి దెబ్బకాసి నీటిలో పడిన కృష్ణుడిని తోకతో కొట్టి చుట్టేశాడు. పడగతో విషజ్వాలలు చెరగుతూ కొట్టబోయాడు. కృష్ణుకు కాళీయుడి తోకనే అడ్డుపట్టాడు. తన కాటు తనకి తగిలి తన నిప్పు తనని కాల్చి - అదరిపడ్డాడు కాళీయుడు.

గట్టునున్న బలరాముడు - ఆదిశేషుని అవతారమూర్తి ఆనందంగా చప్పట్లు కొడుతున్నాడు.

నంద యశోదలు, రాధ, గోపభామలు అంతా ఆర్తనాదాలు చేస్తూ యమునలోకి ఉరకబోతున్నారు. బలరాముడు తన హలాయుధంతో వారిని బెదిరించి వారించి - నచ్చచెప్పాడు.

'మా తమ్ముడు నాటి పూతన నుంచి నిన్నటి బకాసురుడిదాకా మహా రాక్షసులను చంపిన మహాబలుడు. అవతార పురుషుడు.

మీరు నిర్భయంగా - నిశ్చింతగా కృష్ణలీలా సంగ్రామాన్ని

చూసి వినోదించండి. కొద్ది సేపటిలో మన కృష్ణయ్య మన దగ్గరకి వస్తాడు' అన్నాడు బలరాముడు.

మడుగులో కాళీయుడికీ, కృష్ణుడికీ భీకరంగా పోరాటం జరిగింది.

కొంచెంసేపు నదిమీద నెత్తురు సుడిగుండాలూ కెరటాలూ తప్ప ఏమీ కనబడలేదు. తరవాత పాలకడలిలోంచి కామధేనువు కల్పవృక్షం, చంద్రుడు, శ్రీమహాలక్ష్మి, అమృత భాండం క్రమంగా పైకి వచ్చినట్టు - శ్రీకృష్ణుడి చేయి, చేత చుట్టిన పాముతోక, శ్రీకృష్ణుడి శిరస్సు, నీలమేఘశ్యామ దేహం - ఆ తరవాత ప్రాణావశిష్టుడైన కాళీయుని శిరస్సుపై నర్తించే దివ్య చరణారవిందాలు పైకి వచ్చాయి.

గోకులం అంతా సంభ్రమానందాలలో ముగ్ధులై చూస్తూ - అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించారు - లీలామానుష విగ్రహుడికి... జయజయ ధ్వానాలు చేశారు. స్తోత్రాలు చేశారు. ఆనందంతో ఆడారు, పాడారు, ఏడ్చారు నవ్వారు.

చిన్నారి కృష్ణయ్య కాళీయమర్దన తాండవం సాగిస్తున్నాడు.

కాళీయుని భార్యలు - సర్పాంగన రూపులై పైకి వచ్చారు. శ్రీకృష్ణదేవుని పరివేష్టించి మొక్కారు. భర్తకు ప్రాణదానం చేయమని ప్రార్థించారు. కరుణాకరుడైన గోపాలకృష్ణుడు శాంతించాడు.

ఈ మడుగు వదలి పొండన్నాడు.

గరుత్మంతుడు పగపట్టాడనీ - శాపంవల్ల యీ ఒక్క చోటకే రాడనీ, ఈ మడుగు వదిలితే అతడిచేత చావు తప్పదనీ - విన్న వించారు కాళీయుడి భార్యలు.

'మీరు సముద్రం చేరుకోండి... ఇటుపై ఎక్కడున్నా గరుత్మంతుడు మిమ్మల్ని బాధించడు.

'కాళీయుడి శిరసుపైన నా పాదాల ముద్రలు పడ్డాయి. వాటిని మన్నించ గలడు' అని అభయం ఇచ్చాడు శ్రీకృష్ణదేవుడు.

కాళీయుడు కన్నులతో నమస్కరించాడు. అతని తోక ఇంతకు ముందు తాను చంపిన లేగదూడను ముందుకు తెచ్చింది... కాళీయుడు ఆ విషాన్ని తిరిగి పీల్చుకున్నాడు. కొంచెం దూరాన నీటిలో తేలుతూ మూగకళ్ళతో చూస్తున్న తెల్లావుకు ఆ లేగను చేర్చాడు. ఆ గోవు ఆనందంతో మోర పైకెత్తి - ఆకాశంకేసి చూస్తూ 'అంబా' అని

ఆనందంతో, కృతజ్ఞతతో అరిచింది. బిడ్డను మూతితో తాకింది. దాని కంట నీరు చిప్పిలింది.

గోపాల దేవుడు మందహాసం చేశాడు.

కృష్ణలీలలు కృష్ణమాయలు కనీవినీ అబ్బురపడ్డ అగ్ని దేవుడికి ఆతగాని మహిమ ఏపాటిదో చూడాలని ముచ్చట వేసింది. ఒకనాడు హఠాత్తుగా కార్చిచ్చును రేపి గోకులాన్ని చుట్టుముట్టాడు. ఆ వేడికి హాహాకారాలకు అబాల గోపాలం తల్లడిల్లిపోయారు. ప్రాణ భయంతో కృష్ణా కృష్ణా అని కేకలు వేస్తూ కకావికలై నలువేపులా పరుగులెత్త సాగారు.

కృష్ణయ్య నవ్వుకున్నాడు. దోసిటతో నీరు తాగినట్టు ఒక్కసారిగా ఆ అగ్నిని దాహం పుచ్చుకుని మింగేశాడు...

o o o

అహంకారాన్ని తరిమికొట్టి వినయంతో నమ్రతతో నడుచుకొనే వాడు ఒక ఋషి. పదిమందీ ఆ మాట చెప్పి పొగిడేసరికి తనంతటి నిరహంకారి లేడన్న దురహంకారం కమ్మేసింది ఆయన్ని... తరవాతి కథ ఎవరికి వారే ఊహించుకోవచ్చు...

అహం అనేది అంతటి మాయదారి జబ్బు. ఆ పొర కమ్మితే బ్రహ్మజ్ఞానికి ఉండే జ్ఞాననేత్రం కన్న గుడ్డివాడి తోలుకళ్ళు లోకాన్ని బాగా చూడగలవనిపిస్తుంది. బ్రహ్మజ్ఞాని అనే కాదు - సాక్షాత్తూ పరబ్రహ్మకే ఎనిమిది కళ్ళు, నాలుగు ముఖాలు ఉన్న సృష్టికర్తకే ఒకసారి ఆ మాయ కమ్మింది.

భూలోకంలో బృందావనంలో ఒక బాలకృష్ణుడు చాలా మాయలు లీలలు చేస్తున్నాడని విని - ఆయన మీద మాయాజాలం ప్రయోగించాడు బ్రహ్మ.

ఒకనాడు బృందావనంలో మేత మేస్తున్న గోవుల్ని, కాస్తున్న గోపాలకుల్ని మాయం చేసేశాడు బ్రహ్మ.

క్రిష్ణయ్య కొంత సేపు వెతికాడు. అంతలో స్ఫురించింది - ఇది చిరంజీవి బ్రహ్మయ్య మాయ అని. కన్నతండ్రి కమలనాభుడు నవ్వుకున్నాడు.

వెంటనే మేసే గోగణాన్నీ, కాసే గోపగణాన్నీ సృష్టించాడు. అందర్నీ ఇళ్ళకు పంపాడు.

ఆయా ఇళ్ళల్లో అమ్మలు బిడ్డలనూ, లేగలు తల్లులనూ ఎప్పటిలాగే ఆనందంతో చూసుకోడం, ముద్దు మురిపాలు చెయ్యడం - బిడ్డలు, లేగలు మారాం చెయ్యడం, మాతలూ గోమాతలూ మురిసి ముద్దులు కురిపించడం ఎప్పటిలాగే జరిగాయి... ఎక్కడా ఎవరికీ సందేహం రాలేదు. ఆనాడే కాదు... ఆ యేడంతా కృష్ణమాయ అలాగే సాగింది.

అప్పటికి బ్రహ్మయ్యకి 'మెలకువ' వచ్చింది. నేనే సృష్టికర్తనన్న అహం కలిగి, నన్నే సృష్టించిన కర్త, సకల జగత్కర్త ఒకడున్నాడని - ఒకడే ఉన్నాడనీ, జగతిలో తనుంటూ జగతిని తనలో నిలుపుకున్న - నీటిలో తానుంటూ నీటిని తనలో నిలుపుకున్న మహా

మాయావి, లీలా వినోది నారాయణుడు ఒక్కడే అనీ గుర్తు చేసుకుని వెళ్ళి శ్రీకృష్ణ చరణారవిందాలకు మొక్కాడు.

మిణుగురు పురుగుల తళుకులు చీకట్లో మెరవచ్చు గాని పట్టపగలు సూర్యుడి వెలుగులో కాదు కదా...

ఈ మహత్తర సంఘటన తెలిసిన తరవాత బృందావన వాసులంతా - పెద్దలు సహా శ్రీకృష్ణుడికి చెయ్యెత్తి మొక్కారు.

గోవర్ధనగిరి... ఏటేటా చేసే ఇంద్రోత్సవాలను ఈసారి భారీ ఎత్తున జరపాలని నందాదులు నిర్ణయించారు.

కొండ మొదల దగ్గర విశాలమైన పందిరి వేశారు.

పశువుల కొమ్ములకు రంగుపూసి అలంకరించారు. బళ్ళమీద ప్రభలు కట్టారు.

పందిరిలో హోమ గుండం అమర్చారు. వేదఘోష, మంగళ వాద్యాలు మిన్నంటుతూండగా—

గోపాలకులు పందిరిని తోరణాలతో, పూలతో అలంకరిస్తున్నారు. పాలు పళ్ళు నెయ్యి పెరుగు వెన్న మొదలైన సంభారాలన్నీ చేర్చి అమర్చారు.

తేజస్వులైన బ్రాహ్మణులు, యోగులు, ఋషులు వచ్చారు...

ఒకవంక వంటశాలలో భోజనాదికాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి...

శ్రీకృష్ణ బలరాములు యాగ వేదికకు వచ్చారు. పెద్దలకూ తండ్రికీ వందనం చేశారు...

'వయసులో పిన్నవాడివైనా - గోకులానికి నువ్వు చేసిన సేవలు, నీవు కల్పించిన రక్షలు, నీకు పెద్దపీట వేశాయి. అందువల్ల యీ ఇంద్రోత్సవానికి నిన్ను ముఖ్యుడిగా నియోగిస్తున్నాము' అని ప్రకటించి ఒక పళ్ళెరంలో నూతన వస్త్రాలు పూలు పళ్ళు వుంచి అగ్ర తాంబూలం ఇవ్వబోయాడు నందుడు...

కృష్ణుడు నమస్కరించి నిరాకరించాడు. 'ఇంద్రపూజ దేనికని' అడిగాడు.

'పాడిపంట లన్నిటికీ ముఖ్యం, మూలం, ప్రాణప్రదం అయినది వర్షం. అది ఆయన మనకిస్తున్న వరం. ఆయన్ని అర్చించి హోమం చేసి నైవేద్యాలు పెడితే...'

'పెట్టకపోతే...?' అన్నాడు కృష్ణుడు.

'నాయనా! అపచారం... ఆయనకి కోపంవస్తే వాన రాకుండా చేయగలడు; లేదా వాన విపరీతంగా కురిపించి వరదలో మనని ముంచెత్తి ప్రళయం సృష్టించగలడు.'

'అంత కోపిష్టివాడు క్రూరుడు, దేవుడెలా అవుతాడు తండ్రీ... ఆ ఇంద్రుడు భగవంతుడేమీ కాదు. సృష్టి చక్రంలో ఒకానొక కార్య క్రమానికి నిర్వాహకుడు అంతే. సూర్యుడు చంద్రుడు ఉదయించడం, వాన వరదా అన్నీ ప్రకృతి ధర్మాలు. ఒకరి కోపంతో దయతో వచ్చే పోయేవి కావు...

'కర్మ-ధర్మం' ప్రకారం జరిగేవి. మీకు కనిపించే ఇలవేల్పులకీ ఈ పూజలు చెయ్యండి. ఆ గోవర్ధనగిరి, ఈ పాడినిచ్చే పశు సంపద, పంటనిచ్చే నేల తల్లి, యమునానది వీటిని పూజించండి... అంతేగాని కనిపించకుండా కోపతాపాలతో మనని దండించే చిల్లర దేవుళ్ళని కాదు...' అన్నాడు.

అంతలోనే ఎక్కడో పెద్ద పిడుగు పడింది. అంతా పైకి చూశారు. చూస్తుండగానే కారుమేఘాలు కమ్ముకొచ్చాయి. ఉరుములు మెరుపులతో కుంభవృష్టిగా వర్షం ఆరంభమైంది. పెనుగాలి చెలరేగి



అక్కడున్న సంభారాలను మనుషులను చెల్లాచెదరు చేయసాగింది.

నందాదులంతా కలవరంతో కృష్ణుడిని చూశారు.

కృష్ణపరమాత్ముడు కన్నులరమోడ్చి ఒక్క క్షణం ధ్యానించాడు.

గోవర్ధనగిరి వంక రెండడుగులు వేశాడు. అభయముద్రపట్టి చేతిని పైకెత్తి గిరిని కదిలిరమ్మని ఆదేశించాడు.

ప్రళయవేళా పర్జన్య గర్జనలా నాదం పూరిస్తూ గోవర్ధన పర్వతం కదలి పైకి లేచింది. జగదోద్ధారకుడు దానిని తన ఎడమచేతి చిటికెన వేలిపై నిలిపాడు. చేతిని పైకెత్తి వుంచాడు.

గోకుల వాసులంతా - ఆలమందలతో బాలపాపలతో ఆ కొండ కిందకు వచ్చారు.

జరుగుతున్న పరమాద్భుతం కలో నిజమో కానలేక దిగ్భ్రాంతులై చూస్తున్నారు.

సంభ్రమంతో ఆశ్చర్యంతో భయంతో చూస్తూ బొమ్మల్లా నిలబడిపోయిన గోకులాన్ని ఛత్రవర్తి కృష్ణుడు చిరునవ్వుతో మేలుకొలిపాడు.

'కొండ మీ నెత్తిమీద పడదు - భయంలేదు. అందరూ బిడ్డపాపలతో ఆలమందలతో రండి' అని చెప్పేవరకూ వాళ్ళ కోలుకోలేదు.

అవతల ప్రళయవర్షం కురుస్తూనే వుంది. ఏడు రోజులపాటు వర్షం కొనసాగింది. వర్షమేకాదు కొండల రెక్కలు నరికిన దండి మగడు ఇంద్రుడు రాళ్ళవాన కురిపించాడు. రెక్కలు తెగిన కొండే అయినా - చిన్ని కృష్ణుని చిటికెన వేలున చిలకలా కూర్చున్న గోవర్ధనగిరి చెక్కుచెదరలేదు. కొండ గొడుగై గోకులాన్ని కాసింది.

ఇంద్రుడు ఐరావతం ఎక్కి వచ్చాడు ఆశ్చర్యంతో - గోవర్ధనగిరి చెక్కుచెదరకుండా పదడుగులపైన గాలిలో నేలవిడిచి సాము చేస్తోంది. దాని అండన బృందావనం అంతా తల్లి వడిలో పిల్లలా హాయిగా విశ్రాంతిగా తల దాచుకుంది.

తలదాచుకోడమేకాదు - మహాద్భుతాన్ని చేసిన మహాపురుషుడిని ఆనందోత్సాహాలతో పూజించింది.

ప్రత్యక్ష నారాయణుడైన కృష్ణుడికీ, బలరాముడికీ కృష్ణుడి ఆదేశం ప్రకారం తమకి ఛత్రం పట్టిన గోవర్ధనగిరికి, నేలతల్లికి, గోవు మా తల్లికి పూజలుచేసి ఆనందోత్సాహంతో వేడుకలు జరిపింది.

అలనాడు హిరణ్యాక్షుడు భూమిని ఎత్తుకుపోయినవేళ వరాహరూపంలో వాడిని వధించి, భూగోళం అంతటినీ కోరలపై నిలపగలిగిన దేవర ఈతడే అని వారికి తెలియదు. ఒక్క భూమినేకాదు - బ్రహ్మాండ గోళాలన్నిటినీ పూలచెండులా ఎగరేసి ఆడి ఒడిసిపట్టే పరమాత్ముడికి చిన్న కొండ ఒక లెక్కా... కొండంత ఏనుగు తొండంతో తామర తూడును తీసి పూవును పైకెత్తినట్టు అవ'లీలగా' చిన్ని కృష్ణుడు గోవర్ధనగిరిని పైకెత్తాడు. దానిని ఆయన ఒక బరువులా భరించలేదు. ఒక ఆభరణంగా ధరించాడు. ఆయన చేత అమిరాక ఆభరణానికే కొత్త అందాలు చేరాయి.

అసలు బయట ప్రళయ వర్షం పడుతూందన్న ఆలోచనే లేదు వారికి. కృష్ణుడి కంటి వెలుగులు సూర్య చంద్రుల అవసరం కూడా లేకుండా చేశాయి.

ఎనిమిదవ నాడు ఇంద్రుడు ఉగ్రుడైపోయాడు.

మేఘనాయకుడు వచ్చాడు.

'మహేంద్రా! మేఘాలన్నీ కురిసి కురిసి వట్టిపోయాయి. నింగినున్న నీరంతా నేలకి చేరింది. తిరిగి ఎండకాసి ఆ నీరు పైకొస్తే తప్ప వర్షాలు సాధ్యం కావు' అన్నాడు.

ఇంద్రుడికి అప్పటికే కనువిప్పైంది. ఆ పర్వతాన్ని అవలీలగా ఆభరణంగా ధరించినవాడు లీలామానుష విగ్రహుడైన పరమాత్ముడేనని బోధపడింది.

వెళ్ళవచ్చని మేఘాలకు సైగచేశాడు... ఎండ వచ్చింది.

గోకులంలో అంతా ఆనందోత్సాహాలతో ఘోష చేశారు. వాన పోయింది... ఎండ వచ్చిందని... కృష్ణుడు నవ్వాడు...

'అది ప్రకృతి ధర్మం...' అన్నాడు.
అంతలో ఇంద్రుడు, దేవతలు దిగివచ్చారు.
ఇంద్రుడు కృష్ణుడికి వందనం చేశాడు.
'ప్రభూ! నా అజ్ఞానాన్ని అహంకారాన్ని మన్నించు.'
కృష్ణుడు గోవర్ధనగిరిని యథాస్థానంలో వుంచాడు.
కృష్ణుడిపై దేవతలు పూలవాన కురిపించి పూజించారు.



కంస మందిరం - రాత్రివేళ - కంసుడు ఒక బల్లమీద కాలుంచి, ముంజేతిమీద ఆని వంగి నించున్నాడు. వెనుక ఒక చారుడు చేతులు కట్టుకు నించున్నాడు.

వంగివున్న కంసుడు ఆరడుగుల పొడుగుకు ఒక్కసారి విజృంభించి లేచి అదే విసురులో వెనక్కి తిరిగి - అరచేత్తో చారుడిని ఛెళ్ళున కొట్టాడు... గుండెలు బద్దలయేంత పెనుకేకవేసి చారుడు ఎగిరి గోడకి కొట్టుకుని పడిపోయాడు. ఆ దెబ్బకి భళ్ళున నెత్తురు కక్కాడు. మెడ విరిగి పక్కకి వాలిపోయింది. చేతులు తలని నిలప ప్రయత్నించినా తిరిగి పడిపోయింది.

'ద్రోహీ! గొల్ల కుర్రాడు కొండని పైకెత్తాడా? నువ్వు చూసొచ్చావా... దరిద్రుడా... నా కూడు తింటూ వాడి భజన చేస్తావా... నన్ను భయపెడ్తావా... చావు' అంటూ చేతిలో మధుపాత్రను వాడి మీదకు విసిరికొట్టి వెనుదిరిగాడు కంసుడు—

మందిరంలో నాట్యగత్తెలు - సంగీత వాద్యకారులు భయభ్రాంతులై కొయ్యబారిపోయి చూస్తున్నారు.

'ఏం నోళ్ళు చేతులూ పడిపోయాయా... ఆడండి పాడండి - చూస్తారేం' అని గద్దించాడు.

వాళ్ళు ఒక్కసారిగా మరబొమ్మల్లా ఆటపాటలు ఆరంభించారు.

కంసుడు నవ్వు తెచ్చిపెట్టుకుని ఏమీ ఎరగనట్టు మందిరం కలయ దిరుగుతూ నాట్యమాడే యువతుల పిర్రలమీద కొడుతూ, మీద వాలి ముద్దు పెడుతున్నాడు.

కాని ఆ నవ్వు, ఆ పొగరూ, విలాసం కొద్ది క్షణాలు కూడా నిలవలేదు.

ఒక శయ్యమీద విలాసంగా వాలాడు... నలుగు రయిదుగురు వారాంగనలు ఎడాపెడా వెనకా ముందూ చేరి సేవలు సరసాలూ ఆరంభించారు... సువాసన ద్రవ్యాలు రాసేది ఒకతె - వింజామర వీచేది ఒకతె - బుగ్గలు నిమిరేది ఒకతె - ముద్దులు పెట్టేది ఒకతె. ...రెండు క్షణాలలో వాళ్ళంతా రూపాలు మారి - కనుముక్కు

తీరు మసకబారిన ముఖాలతో నలుగుసు పీరులుగా కనబడ్డారు... వాళ్ళు కంసుడిని బంధించి పట్టుకుని కత్తితో పొడవ బోతున్నారు... వికటాట్టహాసాలు వినబడ సాగాయి. పెద్ద గావుకేకపెట్టి వాళ్ళని రెండు చేతులతో విదిలించి విసిరికొట్టి లేచాడు. పరుగున మరో వేపుకి వెళ్ళాడు. మృదంగం వాయించే అమ్మాయిని దాటుతూ ఆ వాద్యాన్ని తన్నాడు. అది పెద్ద శబ్దంచేస్తూ దొర్లిపోయి - గాజు పాత్రలకు తగిలింది.

'మధువు' అని పెద్ద కేక వేశాడు. ఒక పరిచారిక బంగారు పాత్ర తెచ్చి అతని చేతికిచ్చి మధుకలశంలోంచి బంగారు రంగు మదిరను పోసింది. రోషంగా ఆయాసంతో రొప్పుతున్న కంసుడు ఆ పాత్రను నోటిదగ్గర పెట్టుకున్నాడు. అందులో మదిర ఎర్రటి నెత్తురై నురుగుతో పరవళ్ళు తొక్కుతూ పొగలు కక్కింది.

కంసుడి కళ్ళు ఆ రంగుకి నిప్పు కణాల్లా వెలిగాయి.

భయంతో పాత్ర విసిరికొట్టి, లేచి పరుగెత్తాడు.

భోజన మందిరం ప్రవేశించాడు. అక్కడ ఒక పరిచారిక చల్లని పన్నీరు వంపగా ముఖం కడుక్కున్నాడు. భోజనానికి కూర్చున్నాడు. ఇంపైన వంటకాలు - పళ్ళు, మధువు అమర్చి వున్నాయి. చెలులు వింజామర వీస్తున్నారు...

కంసుడు ఆరగించ బోయాడు... పళ్ళెంలో - ఒక పసిబిడ్డ పడుకుని కేరుకేరున, గోలుగోలున ఏడుస్తున్నాడు.

తల విదిలించి కళ్ళు నలుపుకుని చూశాడు కంసుడు.

బల్లనిండా పుర్రెలు ఎముకలు కటకట లాడుతున్నాయి. బల్లని ఎత్తి పడదోసి పరుగెత్తాడు...

అట్టహాసాలు... ఏడుపులు... ఆర్తనాదాలు... కంసరాజుకి జయజయ ధ్వానాలు... సంగీతం... అన్నీ కలగా పులగంగా విని పిస్తున్నాయి—

ఆ మందిరం దాటి తలుపును భళ్ళున మూశాడు.

నిశ్శబ్దం... ఎదురుగా పొడుగ్గా వసారా దాని...

కంసుడు - ఇంతవరకూ తానున్నది దెయ్యాలకొంప అన్నట్టు భయంగా వెనక్కి చూస్తూ పరుగెత్తాడు...

నిశ్శబ్దం... అక్కడా అక్కడా కాగడాలు...

అతని అడుగుల చప్పుడు కూడా వినబడలేదు.

పెద్ద గాలివీచి వున్న కాగడాలు కొండెక్కాయి.

బహుళ పంచమి వెన్నెల భయంకరంగా పడుతోంది. కంసుడు ఆగి కాలితో నేలమీద బాదాడు. అప్పుడూ చప్పుడు వినబడలేదు. ఎవరక్కడ అని అరిచాడు. తనమాట తనకే వినబడలేదు. వరండా చివర వున్న పూలకుండీని పైకెత్తి నేలకేసిబాదాడు. అది ముక్కలుముక్కలై పోయింది. కాని శబ్దం లేదు. కత్తిదూసి గోడమీద కొట్టాడు. కళ్ళలో భీతాహం చెలరేగింది. గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. వెనక్కిపోబోయి ఆగి రాజసభకేసి పరుగెత్తాడు. నిశ్శబ్దంగానే పరుగెత్తాడు.

సభా భవనంలోకి పరుగున వెళ్ళాడు. సింహాసనం ఇరవై ఒక్క మెట్లపైన వుంది. పది మెట్లెక్కి కూలబడిపోయాడు - ఒగురుస్తున్నాడు. ఇపుడు ఒగర్పడం వినబడుతోంది.

ముక్కుపుటాలలో గాలిని పూరించి వదిలి పరీక్షించాడు.

ఆదిశేషువు బుసలు కొట్టినట్టు విన్పించింది.

కొంచెం ధైర్యం వచ్చింది. స్థిమిత పడ్డాడు.

అలా కూచునే సభా మందిరం కలయ చూశాడు.

బావురు మంటోంది మందిరం. కాళీగావున్న సింహాసనాలు గుడ్డి దీపాల వెలుగులో వెలాతెలా బోతున్నాయి... తల వంచుకున్నాడు... మెట్లమీదే విశ్రమించాడు.

ఆ మహా సభా మందిరంలో అతనొక కోడు విరిగిన సింహాసనంలా పరిదీనంగా పడివున్నాడు.

వందిమాగధస్తుతులు దూరాన్నించి వస్తున్నట్టు వినిపిస్తున్నాయి. కంసు డెంతటి వీరుడో శూరుడో, దేవుడో దేవాధిదేవుడో వర్ణిస్తూ పొగుడుతున్నాయి. కంసుడు చెవులు మూసుకున్నాడు. అయినా అవి ఆగలేదు. కంటనీరు తిరిగింది. నిస్త్రాణగా మళ్ళీ నడుం వాల్చాడు.

'జయోస్తు దిగ్విజయోస్తూ... కల్యాణమస్తు...' అని వినబడింది. ఈ మాటలు శ్రావ్యంగా వున్నాయి. ఉలికిపడి చూశాడు. ఇద్దరు భటులు రెండు కాగడాలతో దారిచూపగా, అక్రూరుడు, నారద మహాముని వచ్చారు.

కంసుడు నీరసంగా లేచి వందనం చేశాడు.

'కల్యాణమస్తు' అన్నాడు నారదుడు. కంసుడి ముఖం వికసించింది. కళ్ళు చిరునవ్వుతో మేలుకుంటున్నాయి.

'...లోక కల్యాణమస్తు' అన్నాడు నారదుడు.

కంసుడికి ఛెళ్ళున కొట్టినట్టయింది. కోపం, రోషం ఎగజిమ్ముకు వచ్చాయి—

'అంటే - ఆ గొల్లవాడు గెలుస్తాడనా? మీరూ ఆ భజనేనా?'

నారదుడు మందహాసం చేశాడు.

'ఎవడు వాడు? ఎవడా దొంగ దేవుడు? ఏవిటీ దాగుడు మూతలు? నా చెల్లెలు ఎనిమిదో గర్భంగా పుట్టి నన్ను చంపుతానన్నాడు. అక్కడ దగా చేశాడు. పుట్టి పారిపోయి గొల్లపల్లెలో గోవుల పొదుగుల్లో దాంకున్నాడు. ఇరవై రెండేళ్ళ రెండమావాస్యల తరవాత బహుళ పంచమి - ఇప్పటిదాకా రాడు - ఏం...? ఏవిటీ దొంగాట... ఎదట బడి కొట్టడేం... నేనంటే అంత భయమా?'

'కాదు. దయ...' అన్నాడు నారదుడు.

'ఆఁ!' అన్నాడు కంసుడు అర్థంకాక.

'నువ్వు శరణాగతి కోరితే మన్నించాలని చూస్తున్నాడు. లేదా చంపుతాడు.'

'నేనా?'

'వద్దు. నువ్వు శరణు కోరవని నాకు తెలుసు. వద్దని కూడా హితవు చెబుతున్నాను.'

'మరి యుద్ధానికి రమ్మనండి - ఎదురొచ్చి పోరాడి...'

'కంసరాజా! పోరాటంలో కత్తిపోట్లు మూడు విధాలు. ఒకటి ఎదురొచ్చి ఎదుర్రొమ్మున పొడవడం. రెండు దొంగ వాటంగా వెనక నుంచి వెన్నుపోటు పొడవడం. మూడోది లోపల దూరి గుండెని తూట్లు తూట్లుగా పొడవడం. నీకు ఈ పద్ధతి ఏర్పాటు చేశాడు దేవుడు.'

'అంటే?'

'ఆయన తలుచుకుంటే చక్రం వేసి క్షణంలో చంపగలడు. ఎనిమిదో గర్భం అని ఎందుకు చెప్పాడు? తొలి గర్భంలోనే పుట్టి రావచ్చుగా. అసలు చావు ఎవరికీ చెప్పరాదు. నీకు మాత్రం ఇరవై రెండేళ్ళ - ఏం చెప్పావు లెక్క? ఎనిమిదీ పద్నాలుగూ - ఇరవై

రెండేళ్ళ రెండమావాస్యల మీదట పంచమిదాకా బద్ధకించాడంటే - కారణం... మృత్యు భయంతో నిన్ను మెల్లిమెల్లిగా హింసపెట్టి చంపడం. ఆనాడు అశరీరవాణి అతని పుటక గురించి చెప్పిన క్షణానే నీ మరణం ఆరంభమైంది.. నాటినుండి నేటివరకూ నీలో క్షణానికో క్షణం చచ్చిపోతూంది.'

'నారదా! మేమిచ్చే మర్యాదను నిలుపుకోండి. నేనిపుడే దండెత్తి వెళ్ళి...'

'రాజా! అది వద్దని చెప్పడానికే ఇంత రాత్రివేళ వచ్చా. నీ 'ప్రశాంత'తకి భంగం కలిగించాను. అతను దొంగ. దొంగాటల వాడని తెలిసింది గదా. నువ్వు దండెత్తితే అతను దాక్కుంటాడు. పారిపోతాడు. అందుకని దొంగని దొంగ దెబ్బే కొట్టాలి. వజ్రాన్ని వజ్రమే కొయ్యాలి. నువ్వక్కడ నెగ్గలేవు. అందువల్ల - ధనుర్యాగం ఏర్పాటుచేసి అతన్ని పిలిపించు. ఇక్కడ నీ చోటులో నీ కోటలో చుట్టుముట్టి తుదముట్టించు. ఇదొక్కటే మార్గం' అన్నాడు నారదుడు.

కంసుడికి యీ పథకం నచ్చింది.

'నారదమునీ మీరు దేవలోకం వారైనా...'

'నాకు పక్షపాతం లేదు రాజా. దేవతలైనా దానవులైనా మానవులైనా నేను కోరేది లోక కల్యాణం.

'అదుగో మళ్ళీ—' అనబోయి ఆగాడు కంసుడు.

'అక్రూరుడు - బృందావనంలో అందరికీ ఇష్టుడు. గౌరవ పాత్రుడు. ఈయనను దూతగా పంపి బలరామ కృష్ణులను పిలిపించు' అన్నాడు నారదుడు.

అక్రూరుడు తల పంకించాడు.

బృందావనం—

అక్రూరుడు గౌరవ పీఠంమీద కూర్చున్నాడు.

నంద యశోదలు రోహిణి ఎదురుగా వున్నారు. బలరామ కృష్ణులు వారి కిరుప్రక్కలా నిలచి వున్నారు.

బలరామ కృష్ణులు ఒకరి ముఖం ఒకరు చూసుకుని నవ్వుకున్నారు.

యశోద కలవరపడింది.

'ఆలమందలు కాసుకుని కడుపులో చల్ల కదలకుండా కూర్చునే మా యిళ్ళ పిల్లలు - రాజులూ యాగాలూ పోరాటాలూనా. వద్దు. నా బిడ్డల్ని పంపను. వాళ్ళు కంటికి దూరమైతే నే నుండలేను.'

'అమ్మా! మహారాజుగారి 'ఆహ్వానం' అంటే 'ఆజ్ఞ' కన్నా ఎక్కువ కఠినం. దాన్ని కాదంటే వారు కోపగించి మనకి 'కడుపులో-చల్ల' కదిపి తీరతారు' అన్నాడు కృష్ణుడు.

'నువ్వుండు కుర్రాడివి - నీకేం తెలీదు' అని గసిరింది యశోద.

అక్రూరుడు ఆమెకు కళ్ళతోనే వందనం చేశాడు. నందుడు నవ్వాడు.

'యశోదా! మాయతెర కమ్మితే చందమామదే కాదు సూర్యుడి వెలుగు కూడా కనబడదు. అలా నీ మమకారంవల్ల నీ బిడ్డని నువ్వు తేటగా చూడలేక పోతున్నావు' అన్నాడు నందుడు.

'నేనూ వస్తాను' అంది యశోద.

కిటికీ వెనకనించి, తెరచాటునించి చూస్తున్న పది పుంజీల కళ్ళు కంగారు పడ్డాయి.

'మేము ఉదయమే కదుల్తాం. రేపు సప్తమి. అష్టమినాడు ధనుర్యాగం.'

'అమ్మో! క్రిష్ణయ్య పుట్టిన రోజు.'

'అక్కడే వేడుక చేసుకుంటాను.'

'అందుకే రాజుగారు పిలిచారు. కొత్తరకం వేడుక' అంటూ కదిలాడు అక్రూరుడు.

○ ○ ○

బలరామ కృష్ణులకు గోకుల వాసులు ఆనంద బాష్పాలతో వీడ్కోలు చెప్పారు. రోహిణి, యశోద హారతు లిచ్చారు. రాధ వీర తిలకం దిద్దింది.

రామకృష్ణులు రథం ఎక్కారు.

అక్రూరుడు సారథి స్థానంలో రథం ఎక్కాడు.

వెనకాల చాలా రథాలు బళ్ళు పూన్చి వున్నాయి. వాటిలోకి సంభారాలు ఎక్కిస్తున్నారు.

ఒక ముత్తైదువ, బొట్టుపెట్టిన ఒక గంగిగోవు లేగదూడ శకునం వచ్చారు.

అక్రూరుడు సూర్యుడికి నమస్కరించాడు.

ముందుకు వంగి గుర్రంతో అన్నాడు. 'కల్యాణీ వేళయింది. మనం బయలు దేరవచ్చు...' రథం కదిలింది.

రథం వెళ్తుంటే వెనక గోకులమంతా చూస్తూ నిలబడిపోయింది. కొందరు ఆకాశంలో వున్న దేవుళ్ళకి మొక్కుతున్నారు.

○ ○ ○

బృందావనం శివార్లు...

అక్రూరుడు రథం తోలుతున్నాడు... రామకృష్ణులు ప్రేమతో వెనక్కి తిరిగి చూస్తూనే వున్నారు. దూరమౌతున్న బృందావన జనంకేసి...

ఒక మలుపు తిరుగుతూనే కల్యాణి పెద్దగా సకిలించి హఠాత్తుగా ఆగిపోయింది.

అక్రూరుడు, రామకృష్ణులూ ఉలికిపడి ఎదరకు చూశారు... ఎదర సముద్రం... 'గో-గోపికా సముద్రం'—

మందలాది గోవులూ, గోవత్సాలూ, గోపికలూ, రామచిలకలూ, పావురాలూ. దారిని దిగ్బంధం చేశాయి. ఎక్కడా చలనం లేదు. కేకలూ ఏడుపులూ లేవు. అన్నీ కృష్ణుడికేసే చూస్తున్నాయి.

అక్రూరుడు నిస్సహాయంగా కృష్ణుడి వంక చూశాడు. కృష్ణుడి కంటనీరు తిరిగింది.

అలాగే కూర్చోమని అక్రూరుడికి సైగచేసి తను దిగాడు.

ఆవు దూడలను సమీపించాడు. వాటిలో కలిసిపోయిన గోపికల మధ్య - చుక్కల్లో చంద్రుడిలా దూరంగా వెలిగే రాధను చూశాడు...

మాటలు వచ్చినవారూ, రానివారూ అందరూ మూగబోయారు.

అందరి కంఠాలూ - వాళ్ళ కళ్ళతో బ్రతిమాలు తున్నాయి - కన్నీళ్ళతో మొక్కుతున్నాయి.

అంతటా నిశ్శబ్దం...

క్రిష్ణయ్య దిగివచ్చినా ఏవీ కదలలేదు. ముద్దుగా చనువుగా ఒక గోవుని తోశాడు. కదలలేదు.

కృష్ణుడు మురళి తీశాడు...

సమ్మోహన రాగం కల్పించాడు. ఆరోహణ అవరోహణ పలికే సరికే సంచలనం కలిగింది.

వేణువూదుతూ స్వామి నడుస్తుంటే గోవులూ 'గోపికలూ' దారి నిస్తున్నాయి...

స్వామి పాదాల సేవకే ఎక్కడెక్కడినించో పూలనూ పండుటాకులనూ గాలిదేవుడు తీసుకొచ్చి దారి ఏర్పరుస్తున్నాడు.

స్వామి అక్కడక్కడ ఆగి ఒక్కొక్క గోమాతకు ఒక స్వరావళిని చెవిదగ్గర బహూకరిస్తున్నాడు. ఒక లేగదూడకు 'ప' అని ఒక పంచమ స్వరం చెవిలో ఉపదేశిస్తున్నాడు. ఒక గోపిక దారిచ్చినా తనివి తీరక చేతిని తాకింది. ఆగి వెనుదిరిగి ఆమెకు మరి కొన్ని స్వరాలు ప్రసాదించాడు.

ఒక చిన్నారి చిన్న పిట్ట వచ్చి మురళి చివర కూచుంది. వయ్యారంగా వంగి మురళి ముఖద్వారం దగ్గర చెవిపెట్టి వింది. దాని చెలికత్తెవచ్చి దాన్ని తోసింది. అది చోటిచ్చినా - రెక్కలాడించి గాలిలో తేలుతూనే తన జంటని విననిస్తూ తనూ వింటోంది.

స్వామి కుడి చేతిలో వేణుగానం ఆపి చూపుడు వేలిమీద దానిని నిలిపి, వినిపించాడు.

ముందుకు కదిలాడు.

గోపికలు ఆనంద పరవశలై పోతున్నారు.

గానం విన్నకొద్దీ___

వాళ్ళంతా స్వామి మనసు గ్రహించి వాళ్ళే దారినిచ్చి దండాలు పెట్టి వెళ్ళమని సైగ చేయసాగారు.

స్వామి వెనుదిరిగి రథంకేసి చూసి - రావచ్చునని భువన మోహనమైన భంగిమలో వేణు వూదుతునే తల పంకించాడు.

అక్రూరుడు రథం దిగాడు. కల్యాణి పక్కకి వచ్చాడు.

'కల్యాణీ! పదమ్మా... జాగ్రత్త... గిట్టలు మెత్తగా అన్చు. ఊపిరి మెల్లగా పీల్చు... శ్రమైతే చెప్పు నేనూ సాయం చేస్తాను...' అన్నాడు.

రథం కదిలింది.

స్వామి చూపే దారిని అనుసరిస్తోంది కల్యాణి.

ఈ దివ్య దృశ్యాన్ని చూసి బలరామస్వామి చేతులు జోడించి శ్రీమహావిష్ణువుకి మొక్కి కన్నీటిని తుడుచుకున్నాడు.

ముందు స్వామి దారి తీయగా వెనుక రథం వస్తోంది.

స్వామి మధురనించి వ్రేపల్లెకు వచ్చిననాడు యమున దారి నిచ్చింది - ఈనాడు అంతకు మించిన మహోజ్వల ఘట్టం జరుగుతోంది.

గో గోపికా జన సముద్రాన్ని దాటి గట్టు చేరాడు స్వామి. ఒక చిన్నారి లేగదూడ - కంటికి ఏకధారగా ఏడుస్తోంది. 'ఏడవద్దని, స్వామిని బాధించవద్దని' ఆ లేగ తల్లి నాలికతో దాని ముఖాన్ని నాకి కన్నీటిని తుడుస్తోంది.

కాని లేగ - తల్లిని కాదని ముందుకు వచ్చి ఏడుస్తూనే వుంది.

స్వామి ఆగాడు. తల్లి శిరస్సుని నిమిరాడు.

'అమ్మా! బుజ్జాయి నేమనకు. మా అమ్మకూడా నీలాగే ఏడుస్తోంది - నువ్వేడిస్తే నే చూడలేను' అంటూ కన్నీరు తుడిచాడు. మోకరిల్లి బుజ్జాయి శిరస్సుమీద పెదిమలుంచాడు.

ఒక్కసారి వెక్కి వెక్కి ఏడ్వడం వినిపించింది. నెమ్మదిగా బుజ్జాయిని బుజ్జగించి లేచాడు స్వామి.

రాధ...

రాధ పసిబిడ్డలా ఏడుస్తోంది. రాధను దగ్గరకు తీసుకుని శిర్షాన్ని అఘ్రాణించాడు.

గాఢాతిగాఢమైన ఆ అఘ్రాణశక్తి రాధను పరవశురాలిని చేసింది. ఆమె మూర్ఛిల్లింది. ఆమెచేత తన వేణువుని వుంచాడు.

రథం వచ్చింది.

తను వత్తిగిలి దారినిచ్చాడు.

రథం రాధను దాటింది.

స్వామి సారథి స్థానంలో ఎక్కాడు.

అర్థం చేసుకున్న అక్రూరుడు వెనుక ఎక్కాడు.

పంచకళ్యాణి ఆనందాతిరేకంతో పాంచజన్యంలా విజయనాదం పూరించి ఒక్కసారి ముందు కురికింది. వాయువేగ మనో వేగాలతో మధుర కేసి పరుగెత్తింది రథం.

ం ం ం

నూతన రథసారథి కళ్ళెం పట్టుకోగానే కల్యాణికి ఒళ్ళంతా పులకలెత్తింది. ఉత్సాహంగా పరుగులు తీసింది.

ఆ నడక నాట్యంలా వుంది.

హుందాగా లయబద్ధంగా పరుగు సాగింది.

కళ్యాణి మనసులో ఆనందోత్సాహాలకు దాని జూలు ఎగిరిన తీరు అభినయం చేస్తూంది.

అక్రూరుడు ముగ్ధుడై చూస్తున్నాడు.

పుణ్యనది కాళింది తీరాన రథ మాగింది.

రామకృష్ణులు చల్లటి తీయటి నీటిని త్రాగి రథం ఎక్కారు.

మధ్యాహ్న సంధ్యకు వేళ.

అనుమతి తీసుకుని అక్రూరుడు పరమాత్మునికి అర్ఘ్యం ఇవ్వడానికై నదికి వెళ్ళాడు.

కన్నెదుట వున్న కృష్ణదేవుని కానలేక - నదిలో కన్నులు మూసుకుని స్వామిని ధ్యానించి దర్శించబోవడమే... మాయ... మహా విష్ణుమాయ... కృష్ణమాయ.

అక్రూరుడు అంజలి ఘటించి కన్నులు మూయబోయే తడాన నదిలో బలరామ కృష్ణులు కనిపించారు... ఆశ్చర్యపోయి నమ్మలేక - వెనక్కి తిరిగి గట్టుకేసి చూశాడు.

బలరామ కృష్ణులు రథంమీద కూర్చుని వున్నారు.

కళ్ళు నలుపుకుని తిరిగి నదిలోకి చూశాడు.

దిగ్భ్రాంతుడై పోయాడు. ఇపుడు కనిపించినది రథంపై రామకృష్ణులు కాదు. శేషశయనంపై కొలువు తీరిన శ్రీమన్నారాయణుడు. మేఘంపై మెరుపు తీగలా ఆయన చెంత శ్రీమహాలక్ష్మి - స్వామి నాభిలో పద్మం - పద్మంలో పరబ్రహ్మ - ఆ పరబ్రహ్మలో వేద జ్యోతులు... శేషతల్పశాయిని సేవిస్తూ స్తుతిస్తున్న దేవతలు. ఋషులు... ఈ మహోజ్వల దృశ్యాన్ని చూసి ఆనందాతిరేకంతో పరవశుడై స్వామికి నమస్కరించి భక్తిపారవశ్యంలో అలాగే నిలిచిపోయాడు...

క్రమంగా మాయ తిరిగి కమ్మింది. మెల్లగా కన్నులు తెరచాడు. చర్మ చక్షువులు తెరుచుకోగానే - జ్ఞాన నేత్రాలు మూసుకున్నాయి... ఎదర రథారూఢులైన బలరామ కృష్ణులు యథా రూపాల్లో కనిపించారు. అంతలో మాయమయ్యారు.

అక్రూరుడు ఏమి జరిగిందీ జరుగుతున్నదీ అర్థంకాక విస్మయంతో సంభ్రమంలో అతిలోకమైన ఆనందంతో మంత్రముగ్ధుడై రథం దగ్గరకు వెళ్ళాడు.

క్రిష్ణయ్య మందహాసం చేశాడు.

'నది పక్కనే వుంది... రావడానికి ఇంతసేపెందుకయినట్టు...? భూమ్మీదా ఆకాశంలోనూ కనబడని వింతలూ విడ్డూరాలూ ఏవైనా నదిలో కనిపించాయా...?' అని అడిగాడు.

అక్రూరుడు తేరుకుని వందనం చేశాడు.

'వింతలన్నీ నదిలో కాదు... నీలో వున్నాయి. నీలో లేని చోద్యాలు నింగిలో నేలలో ఎక్కడ వుంటాయి ప్రభూ' అంటూ శిరసా వందనం చేశాడు.

రథం కదిలింది.

o o o

సాయంకాలపు ఎండలో మధురానగరి కోట బురుజులూ, సౌధాగ్రాలూ, కోవెల గోపురాలూ బంగారు పూతపూసుకుని ధగద్ధగాయమానంగా వెలిగి పోతున్నాయి.

అష్టమినాటి ధనుర్యాగోత్సవానికి నగరాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు.

o o o

రాజ సౌధంలో—

కంస మందిరం—

అక్రూరుడు నిలబడి వున్నాడు—

కంసుడు లోపలనుంచి కంగారుగా వచ్చాడు.

వస్తూనే అక్రూరుడు ఒక్కడూ వుండడం గమనించాడు.

'ఏడీ... వాడేడీ... రాలేదా... రానన్నాడా... భయపడ్డాడా... భయంతో చచ్చాడా... రాడు నాకు తెలుసు... వాడు దొంగ... ధూర్తుడు...' అన్నాడు కంసుడు.

'వచ్చారు ప్రభూ! మన అతిథి గృహంలో విడిది చేశారు.'

వెలాతెలా పోయాడు కంసుడు. అంతలోనే సర్దుకున్నాడు.

'వచ్చాడా... ఓహో... ఆయువు మూడిందిలే... అందుకే వచ్చాడు... అని గొణుక్కున్నాడు.

'మంచిది. నువ్వెళ్ళి వారికి మర్యాదలు జరిపించు. పుకార్లు విని బెదిరి పారిపోకుండా కట్టుదిట్టంగా కాపలావుంచు. గూఢచారులను కూడా నియమించు అన్నాడు కంసుడు.

'స్త్రీ లోలుడని - చపలబుద్ధి అని విన్నాను. అవసరమైతే... అక్కడ ఉద్యోగికి చెప్పివుంచు.'

అక్రూరుడు ముఖం పక్కకి తిప్పుకున్నాడు.



బృందావనంలో—

యమునా తీరాన—

రాధ, గోపికలు గోడలేని చిత్తరువుల్లాగా - నీడపడని రూపాల్లా, దారి తప్పిన పసిబిడ్డల్లా తిరుగాడుతున్నారు. క్రిష్ణయ్య ఎక్కడో దాంకుని ఏడిపిస్తున్నాడని వారి భ్రమ. 'నల్లనివాడు, పద్మనయనమ్ముల వాడు, కృపారసమ్ము పై జల్లెడివాడు ఎక్కడున్నాడో చెప్పండమ్మా, ఎక్కడ దాచారో దాగాడో చెప్పండమ్మా, ఒక్కసారి చూడనివ్వండి' అని మల్లె పొదను, మామిడి చెట్టును, పొన్న కొమ్మను, ఉయ్యాలను, ఇసుక తిన్నెలను పేరుపేరునా బ్రతిమాలి అడుగుతున్నారు.

అక్కడక్కడ క్రిష్ణయ్య అడుగు జాడలు కనబడితే ఆగిపోయి కూర్చొని, మోకాళ్ళమీద పడుకుని కళ్ళ కద్దుకుంటున్నారు.

'నాలుగు పాదాలున్నాయి... ప్రభువూ గోపమ్మా ఇటు నడిచి వెళ్ళారే...'

'ఇవిగివిగో ఆరు పాద ముద్రలు... ఒకరు కాదమ్మా ఇద్దరు గొల్ల భామలు అటూ ఇటూ చెట్టాపట్టా లేసుకు వెళ్ళారే...'

'అడుగులు లోతుగా దిగి చెదిరాయి. చెల్లాచెదురుగా వున్నాయి. ఇక్కడ ఒకరినొకరు తరుము కున్నారే. ఈ పొదరింటి దగ్గర ఆగి

పోయారు. ఇక్కడ విశ్రమించారే... ఇక్కడ స్వామి పాదాలకు ఎదురుగా భామ పాదాలు చూశారా... ఇక్కడ కౌగలించుకున్నారే...'

'ఇక్కడ ఒక పాదముద్రే వుంది. భామని ఎత్తుకున్నాడే...'

'అదిగో ఉయ్యాల ఇంకా ఊపు తగ్గక ఊగుతోంది చూడవే!'

'ఇక్కడే వున్నాడే. మన పక్కనేవుండి కనబడకుండా మాయమవుతున్నాడే - మనమీద అలిగాడే. మనని ఏవగించుకున్నాడే. స్వామి ప్రసాదానికి పనికిరాని ఈ తనువులూ బతుకులూ మనకి వద్దే!'

'యమునలోపడి కొట్టుకుపోదాం. చచ్చిపోదాం. అప్పుడు కన్నీళ్ళు విడుస్తాడే. అవి వచ్చేనా మనకి తగిలితే అదే చాలే...' అంటూ గోపికలు యమునకేసి వెళ్ళారు.

క్రిష్ణయ్య స్నేహితుడు ఉద్ధవుడు వచ్చి ఎదట నిలిచాడు. వారిని వారించాడు.

అతన్ని చూడగానే ఆశతో వాళ్ళ కళ్ళు జ్యోతుల్లా వెలిగాయి.

ఉద్ధవుడు వారిని ఊరివేపు మళ్ళించి నడిపిస్తున్నాడు. వాళ్ళకి క్రిష్ణయ్య చెప్పిన కబురు చెప్పాడు—

'మీరిలా బాధపడితే ఆయన భరించలేడు. ... రానగర పంపాడు. మీరు స్వామికోసం ఈ వనంలో వెద... వెలిగి వెతుక్కోండి. ఆయన మీ కళ్ళలో వెలుగుతున్నా... కొలువున్నాడు. మీ మాటల్లో మాటగా, పాటల్లో... అందెగా, పాలలో వెన్నలా వినిపిస్తాడు. కనిపిస్తాడు...

'మీరు ఇళ్ళకి వెళ్ళి మీ కాపరాలు చక్కగా నడుపుకోండి. ఆనందంగా వుండండి. అదే ఆ స్వామికి పూజ...' అని ఓదార్చాడు.

○ ○ ○

యశోద, ఇంటి మునివాకిట దిగువ మెట్టుమీద కూర్చుంది. ఆమె వడిలో ఒక చిన్న ఆవుదూడ తలపెట్టుకుని పడుకుని వుంది. యశోద ఓ కంట ఏడుస్తూనే మరోకంట దానిని ప్రేమగా చూస్తూ - లేత గడ్డి పరకలు తినిపిస్తోంది.

ఎదర కొంచెం అవతలగా నందయ్య ఆవుకి కుడితి కలిపి తాగిస్తున్నాడు.

'వాడికి నా మీద కోపం వచ్చింది... అంతే. రాజాగారు పిలిచారని కాదు. నా మీద కోపంవచ్చి 'వెళ్ళిపోయాడు' అంది యశోద ఏడుస్తూ...

'అబ్బే! అలాటిదేం లేదు. పసివాడు - దేవుడులాటివాడికి నీ మీదా నామీదా కోపాలేవిటే. మహాయితే అలిగి వుండాలి' ఓదార్పుగా అన్నాడు నందయ్య.

'ఏం కాదు. పాపిష్టిదాన్ని - ఏ తల్లయినా బిడ్డ ఇంకా స్త తింటే సంతోషిస్తుంది. వాడు పాలు తాగితే, వెన్న మీగడలు తింటే - అరిచాను. తిట్టి కొట్టి సాధించాను...' అంది యశోద.

'బావుంది. వాడు తిన్నాడనా తిట్టావు?... దొంగతనంగా తీసుకున్నాడని గదా...'

'అవును. నేను తంతానని భయపెడితే దొంగతనంగానే - అయినా వాడు దొంగ కాదు దొర... వాడు చేసింది దొంగతనం అయితే - అదే దొరతనం. ఆఁ...'

పోయారునందుడు నిట్టూర్చాడు.

ఎదురు' వాణ్ణి తిట్టాను - కొట్టాను - రోటికి కట్టేశాను... నామీద విసు
ఏ అసియ్యమేసి... వెళ్ళిపోయాడు బిడ్డ' అంటూ ఏడవసాగింది యశోద.

నందయ్య పరుగున ఆమె దగ్గరకు వచ్చి శిరసుమీద చేయివుంచి మృదువుగా అదిమాడు.

'అదేం కాదు. ఒకేళ అదే నిజమైతే ఆ పాపంలో నాదే పెద్ద పాలు. నువ్వాణ్ణి సాధిస్తుంటే నేనేం జేస్తున్నట్టని. నేన్నిన్నుకోప్పడి అడ్డుపడాలి గదా - కోపంవస్తే మనిద్దరిమీదా వచ్చుండాలి...' అంటూ సముదాయించాడు నందయ్య.

బలరామ కృష్ణులు, గోకులం నేస్తాలతో కలసి మధురానగర సంచారానికి బయలు దేరారు. ఊరంతా శోభాయ మానంగా వెలిగి పోతోంది. స్వాగత తోరణాలు, మంగళ తోరణాలు కట్టారు.

వీథుల కటూ యిటూ చక్కని మొక్కలు, చెట్లు నిలిపారు.

మధురాపుర వాసులు రామకృష్ణులను చూసి ముగ్ధులై పోతున్నారు. మేడల మీదనుంచి ఆడవాళ్ళూ పిల్లలూ చూస్తున్నారు. కొందరు దండాలు పెడుతున్నారు. కొందరమ్మాయిలు కృష్ణుడి మీదకు పూలుజల్లి తెర వెనకకు తప్పుకుంటున్నారు.

కృష్ణుడు పైకి చూశాడో లేదో అని తొంగిచూస్తున్నారు. కృష్ణుడు పైకి చూడగానే వాళ్ళకి ఒళ్ళు ఝల్లుమని, చిరు చెమటలు ముత్యాలలా పుట్టుకొస్తున్నాయి.

కొందరు పెద్దలూ పూజారులూ 'ఇతడేనా దేవకి అష్టమ గర్భంగా పుట్టింది' అని పరీక్షగా చూస్తున్నారు.

'దేవకీ వసుదేవుల కన్నబిడ్డ, ఆ నల్లవాడు. పాలుపీల్చి పూతనను చంపిన పసివాడు వాడేనట. వెన్న దొంగ. బకాసురుడిని చంపాడట. బాగా చిన్నప్పుడు శకటాసురుడిని ఒక తాపుతో చంపాడు. శ్రీ విష్ణుమూర్తులవారే ఇలా పుట్టారుట. మంచి గ్రంథసాంగుడట.'

'కంసరాజుకి ఆయువు మూడింది.'

'మనకి మంచి రోజులు వచ్చాయి' అని రకరకాలుగా చెప్పుకుంటున్నారు జనం.

ఒక చక్కని బండిమీద చాకలి రాజుగారి బట్టలు పేర్చి తీసుకు వెళ్తున్నాడు.

కృష్ణుడి బృందాన్ని చూసి 'ఏయ్ తప్పుకో తప్పుకో. రాజాగారి బండి' అని గద్దించాడు.

కృష్ణుకు కదలకుండా వెనక్కి చూశాడు.

'ఏం బండి?' అన్నాడు.

'కంస మహారాజుగారి వస్త్రాలు. తప్పుకో.'

కృష్ణుడు వాటిపై కప్పిన దుప్పటి తొలగించాడు. పట్టుబట్టలు.

జరీ బట్టలు జిగేలున మెరుస్తున్నాయి. ఒకటి తీసి వల్లెవాటుగా వేసి చూసుకున్నాడు.

'బాగుంది... నా కివ్వు...' అన్నాడు.

'భలే పల్లెటూరి బైతువి - నీ ముఖానికి పట్టుబట్టలా... అదీ మహారాజుగారివా' అంటూ లాక్కున్నాడు. పోబోతుంటే ఆపి—

'ఏవిటా తొందర... మీ రాజాగారికి బట్టల్లేవా?'

'బోలెడున్నాయి.'

'రేపొద్దునకో జత వుంది గదా!'

'మారాజులా వుంది. ఏం?'

'ఉంటే అది చాలు. ఇంక వీటిని వేసుకునే పనుండదు!' అంటూ ఉత్తరీయం వేసుకుని మిగతావి తీసి బలరాముడికీ, నేస్తాలకూ విసిరాడు.

చాకలి బొడ్డులోంచి చాకు తీసి మీద కురికాడు.

కృష్ణుడు ఎడంచేత్తో వాడికేసి చూడకుండానే ఒక్క దెబ్బ కొట్టాడు. వాడు ఎగిరి పదిగజాల అవతల పడిపోయాడు - మళ్ళీ లేవలేదు.

జనమంతా దిగ్భ్రాంతులై చూస్తున్నారు—

ఇద్దరు రాజభటులు ముందుకు వచ్చి - కృష్ణుని పట్టుకోబోయి ఏదో ఆలోచించి పరుగున వెళ్ళిపోయారు.

కృష్ణుడు ముందుకు సాగాడు. చిన్నవి పెద్దవి బిగుతుగా వదులుగా వున్న దుస్తులలో గొల్లపిల్లలు వింతగా వున్నారు. గెంతులేసి నవ్వుకుంటున్నారు.

అంతలో కుబ్జ వచ్చింది. ఆమెని చూడగానే వీధిలోని వారంతా ఈసడింపుగా ముఖం పక్కకి తిప్పుకున్నారు.

కుబ్జ స్వామి పాదాలకు మొక్కింది.

ఆమె మెడదగ్గర, నడుందగ్గర, మోకాళ్ళ దగ్గర వంకర తిరిగి వికారంగా వుంది.

తాను తెచ్చిన పళ్ళెంపై మూత తీసింది.

సుగంధ పరిమళాలు గుబాళించాయి.

'రాజుగారి సేవలో వున్నాను స్వామీ! ఈ సుగంధాలు వారికని చేశాను. కాని నీకన్న రాజు లెవరు - అందుకో స్వామీ' అంది.



కృష్ణ డవి ఆఘ్రాణించి గంధం, కస్తూరి, జవ్వాది స్వీకరించాడు. అన్నకు, జతగాళ్ళకు యిచ్చాడు.

'వెన్నగాచిన నెయ్యంత బాగున్నాయి' అన్నా డొకడు.

అంతా నవ్వారు.

కృష్ణుడు కుబ్జను దయతో చూశాడు.

ఆమె పాదంమీద తన పాదం బొటనవేలు మోపి - తన చేతి మునివేళ్ళు గడ్డం క్రింద వుంచి పైకెత్తాడు.

కుబ్జ పైకి సాగింది.

చూస్తుండగా ఆమె వంకరలు పోయాయి. అతిలోక సౌందర్యవతిగా మారింది. అప్సరసలా వెలిగింది.

అందరూ సమ్మోహితులై చూస్తున్నా రీ అద్భుతాన్ని.

కుబ్జ కంట ఆనంద బాష్పాలు తిరిగాయి. చేతులు జోడించి మ్రొక్కింది.

'ప్రభూ! కృతజ్ఞత చెప్పుకోడం చేతకానిదాన్ని... ఇపుడు నువ్విచ్చిన అందం, ఈ శరీరం, ఆరోగ్యం అన్నీ నీ ప్రసాదాలే. నీ ప్రసాదాన్ని నీకే నైవేద్యంపెట్టి ధన్యురాలిని కావాలి. అనుగ్రహించు' అంది.

కృష్ణుడు లమెవంక కరుణతో చూసి, తల పంకించాడు.

ముందుకు కదిలాడు—

o o o

కంసుడి ఆయుధాగారం - పెద్ద కోటలో వుంది.

కృష్ణ బృందాన్ని భటులు ఆపబోయి, చేతగాక వెనక్కి తగ్గి, తలవంచి స్వాగత మిచ్చారు.

కృష్ణుడు లోపలకి వెళ్ళాడు. పలురకాల ఆయుధాలు - కత్తులు, గదలు, ఈటెలు, బల్లేలు, చక్రాలు, బాకులు, విల్లమ్ములు, కవచాలు, శిరస్త్రాణాలు చిత్ర చిత్రాలయినవి వేలాదిగా ప్రదర్శించి అమర్చి వున్నాయి.

ఆయుధశాల మధ్యన ఒక పెద్ద శకటంపై కంసుడు ధరించే ఇనప విల్లును చూశాడు. దానిని సామాన్యులు వందమంది కలిసినా పైకెత్తలేరు.

కృష్ణుడు ఆ వింటిని అలవోకగా చూశాడు. అవలీలగా పైకెత్తాడు. లీలగా ఎక్కుపెట్టాడు. రాముడు శివధనుస్సును విరిచినట్టు ఇట్టే విరిచి పడేశాడు.

విల్లు ఫెళఫెళార్భటులతో విరిగింది.

ఆ భవనం దద్దరిల్లి పోయింది.

మధురా నగరమే సంచలించి పోయింది.

o o o

విల్లు విరిగిన ధ్వనికి నిదురిస్తున్న కంసుడి గుండె గుభిల్లుమంది. అదిరిపడి లేచి కూర్చున్నాడు. పక్కన భార్యలు - అల్లంత దూరాన బిడ్డలు పడుకున్నారు. అందరూ అదిరిపడి లేచారు. బిడ్డలు గోలుగోలున ఏడుస్తున్నారు. కంసుడు ఆవేశంగా ఉయ్యాల దగ్గరకు వెళ్ళాడు.

'నోర్మయ్యండి' అని అరిచాడు. వాళ్ళు మరింతగా ఏడవసాగారు. కోపావేశంలో కంసుడు చెరో చేతా బిడ్డలను పైకెత్తాడు... 'ముయ్యండి నోరు ముయ్యండి' అని అరుస్తున్నాడు.

'నాథా... బిడ్డలు... మన బిడ్డలు...' అంటూ భార్యలు పరుగున వచ్చారు.

బిడ్డల ఏడుపుకి మరో వేయిమంది బిడ్డల ఏడుపు తోడైంది.

కంసుడికి దుర్భరమైంది. పెద్ద కేకవేస్తూ వాళ్ళిద్దర్నీ వేళకేసి కొట్టాడు—

పరుగు పరుగున బయటకి వెళ్ళాడు. మందిరాలలో మార్గాలలో పిచ్చివాడిలా పరుగులెత్తాడు. ఒకచోట ఆగి మధువు తీసుకోబోయాడు. అది నెత్తురై పొంగువారుతోంది. నీరు తాగబోయాడు - అది పొగలు కక్కుతోంది.

విసురుగా వేరొక గదిలోకి వెళ్ళాడు. దారిలో పైనించి వేలాడే దీపం తలకి తగిలింది. నెత్తురు కారుతోంది. తల తుడుచుకుంటూ అద్దం ముందుకు వెళ్ళాడు. ఊగే దీపంలా తన ప్రతిబింబం కూడా అద్దంలో ఊగుతోంది. కాని అద్దంలో తన తల కనబడలేదు.

కళ్ళు పెద్దవిచేసి చూశాడు. కనబడలేదు.

'మంజరీ' అని కేకవేసి పక్కగదిలోకి వెళ్ళాడు. పక్కమీద **'మంజరి'** అదమరచి నిద్రపోతోంది. వెళ్ళి ఆమె పక్కలో పడుకుని **గాఢంగా** కౌగిలించుకున్నాడు.

'మంజరీ నాకు భయంగా వుంది. నన్ను కౌగలించుకో గట్టిగా. కౌగలించుకో... వదలకు. ఎవరొచ్చినా వదలకు. మంజరీ మంజరీ' అంటూ ఆమెను గాఢంగా కౌగలించుకున్నాడు.

చలనం కలగలేదు. అనుమానంతో లేచి చూశాడు.

మంజరి చనిపోయివుంది. గుడ్లు తేలవేసి నాలిక బయటికి పెట్టి, కొయ్యబారి పోయింది.

'అబ్బా!' అంటూ ఆమెను తోసి పరుగున బయటకు వెళ్ళాడు. ద్వారం దగ్గరవున్న తాడును పదేపదే లాగాడు.

గంటలు హోరెత్తి పోయాయి.

'చాణూర ముష్టికుల్ని పిలువ్... నించున్న పళంగా పిలువ్' అంటూ పరుగులెత్తాడు.

సింహద్వారం చేరి పచార్లు చేస్తుండగా చాణూర ముష్టికులు వచ్చారు. వందనం చేశారు.

'వాడొచ్చాడు - చంపాలి. రేపు చంపాలి. మాంచి మదగజాన్ని

పంపండి - పొగరెక్కించి తోలండి. అదే చంపుతుంది. లేదా చచ్చేట్లు తొక్కి తొక్కి చస్తుంది - ఆ తరవాత మీరు పోట్లాడండి... అదను తప్పితే పోటీ ధర్మాలకోసం చూడద్దు. కత్తితో పొడిచెయ్యండి. ఏదో చెయ్యండి. రేపు సభలో వాడు నా మొహం చూడకూడదు - వాడి శవం నేను చూడాలి' అన్నాడు కంసుడు ఒగురుస్తూ—

భేరీ తూర్యనాదాలు మోగుతున్నాయి. మంగళ వాద్యాలు ఊరంతా చెలరేగుతున్నాయి. వేలాది జనం - చక్కగా ముస్తాబై నవ్వుతూ ఉత్సాహంతో కోటలో ధనుర్యాగం మల్లయుద్ధం చూడడానికి వెళ్తున్నారు.

'రాత్రి మబ్బు లేకుండా పిడుగు పడింది...'

'కాదు... విల్లు విరిచేశాడట... నల్లక్రిష్టయ్య...'

'ఇవ్వాళ మల్లయుద్ధం కూడా...'

'అనక కంసుడి పనికూడా అంతే—'

'మధ్యలో కొండంత ఏనుగుందోయ్...'

'కొండ నెత్తిన వాడికి ఏనుగెంత?'

○ ○ ○

రాజ మందిరంలో ఎండ పడుతూంది.

కంసుడు నిద్ర లేవలేదు. పడుకుని పొర్లుతున్నాడు.

బలరామ కృష్ణులు - కూడా అక్రూరుడు దారి చూపగా కోటలో ప్రవేశిస్తున్నారు.

మేడల పైనుండి వారిమీద పూలవాన కురిపిస్తున్నారు మధుర పౌరులు.

కోట సింహద్వారం పక్కనే 'కువలయాపీడం' కట్టివుంది.

దాని పక్కగా గొలుసుకి కట్టిన గసికల దగ్గర బలవంతులు నలుగురున్నారు. గోడమీద బల్లేలు పట్టుకుని నలుగురున్నారు.

రామకృష్ణులు లోపలకి రాగానే మావటివాళ్ళు గసిగ లూడదీసి గొలుసు లూడదీశారు. దాని కుంభస్థలంలో బల్లెంతో పొడిచి రెచ్చ



గొట్టారు. తోక దగ్గర మండే కాగడాపెట్టి పారిపోయారు.

ఏనుగు భూనభాలు అదిరేలా ఘీంకరించి ముందు కురికింది. ఆదమరచి కబుర్లాడుతూ వస్తున్న రామకృష్ణుల మీదకి ఉరికి తొండంతో కొట్టబోయింది.

కృష్ణుడు రాముడిని తృటిలో పక్కకి నెట్టి తాను ఏనుగు పొట్ట కిందికి తప్పుకున్నాడు. తొండం ఏనుగు కాళ్ళకే తగిలింది.

అంతటా గందరగోళం చెలరేగింది.



తరవాత రామకృష్ణులు ఏనుగుతో చెలగాటాలాడారు. కృష్ణుడు పుంజుకుని దానిని అటూ ఇటూ పరుగెత్తించాడు. గోడదగ్గర నిలబడి దాని తలని అదే గోడకి మోదుకునేట్టు చేశాడు. తోక పట్టుకుని పది బారలు లాగి దాని ప్రాణం స్తంభింప చేశాడు.

అది ముందుకాళ్ళు తొండం పైకెత్తి నిలబడి మొర్రోమని ఘోష పెట్టింది. కృష్ణుడు దాని తలమీద కురికి, వంగి కంటిని చితక పొడిచాడు. అది కిందపడి తొండంతో కంటిని అద్దుకుంది. కృష్ణుడు దాని దంతాన్ని పట్టుకుని, కాలు తన్నిపెట్టి లాగాడు - తొండంతో కృష్ణుడిని కొట్టేలోపల రాముడు రెండో దంతాన్ని పీకాడు. తొండం ఇటు కొట్టేలోగా కృష్ణుడు అటు దంతాన్ని ఊడలాగాడు. గుండెలు పగిలేలా ఘోషపెట్టింది. కృష్ణుడు అమాంతం పురికి దాని కుంభ స్థలంమీద బలంగా పొడిచాడు. మరోసారి పెద్ద కేకపెట్టి ఏనుగు కూలి పోయింది. కుంభస్థలంనించి రక్తం ప్రవహించి మడుగు కట్టింది.

చూస్తున్న వేలాది ప్రేక్షకులు చప్పట్లు కొట్టబోయి భయ సంభ్ర మాలతో బాలకృష్ణ దేవుడికి చేతులు జోడించి 'జయజయ' అని కేకలు వేశారు.

కృష్ణుడు వాటిని పట్టించుకోలేదు. దంతాన్ని బుజాన గదలాగా ధరించి ముందుకు సాగాడు...

అతని నుదుట చెమట బిందువులు మంచి ముత్యాలై, ఇంద్ర నీలాలై, పుష్య రాగాలై శోభించాయి...

మల్లయుద్ధరంగం పదిబార లుండగానే అథాత్తుగా చాణూర ముష్టికులు రామకృష్ణుల మీదకు దుమికారు.

హోరా హోరీగా పోరు సాగింది. కృష్ణుడు చాణూరుడితో, రాముడు ముష్టికుడితో తలపడ్డారు.

వారిద్దరూ జగత్ప్రసిద్ధులైన యోధులు... కొండంత శరీరాలతో వున్నారు.

మబ్బుమీద మెరుపుల్లా, ఏనుగుమీద అంకుశంలా జవనాశ్వం మీద రౌతుల్లా, మహావృక్షంమీద పిడుగుల్లా - శక్తికి రూపాల్లా చెల రేగారు రామకృష్ణులు.

చాణూర ముష్టికులు వారి బారికి తట్టుకోలేక గుప్తంగా దాచిన బాకులు తీశారు.

ఉత్తర క్షణంలో రామకృష్ణులు ఏనుగు దంతాలను అందుకుని వారిని ఒక్క దెబ్బతో ఛేదించి చంపారు. సభలో హాహాకారాలు, హర్ష ధ్వానాలు, జయ ధ్వానాలు చెలరేగాయి.

సభా మందిరంలో - కంసుడు కత్తిపిడిమీద పిడికిలి బిగించి సింహాసనంమీద కూర్చున్నాడు. సభలో సభికులకన్నా సైనికులే ఎక్కువ మంది వున్నారు.

నీలమేఘ శ్యాముడైన కృష్ణుడు - నెత్తురు చారల మరకల అలంకారాలలో - విజయ తేజంలా, సూర్యుడిలా ప్రకాశించాడు.

నీరసంగా నిస్తేజుడై తన నీడలావున్న కంసుడు ఓపిక తెచ్చు కుని అట్టహాసం చేశాడు. అది పరి దీనంగా వుంది.

'ధూర్తుడా! తుప్పట్టిన విల్లు విరవడం పిచ్చెక్కిన ఏనుగుని - తాగి తూలుతున్న యోధులను కొట్టడం గొప్పకాదు - ఈ కంస సభ నీపాలిటి యమసభ. ఈ సభలో వున్నవారంతా నా భటులే. అందరి చేతిలో కత్తులూ ఈటెలూ వున్నాయి. నేను సైగ చెయ్యగానే నీ మీద వాన చినుకుల్లా కత్తులు కురుస్తాయి. ఒళ్ళు తూట్లు పొడిచేస్తాయి... ఇవాళే నీ మరణం' అన్నాడు.

కృష్ణుడు మందహాసం చేశాడు.

'కంసమామా! ఇవాళ అష్టమి - నా పుట్టినరోజూ నువ్వు గిట్టే రోజూను. నీ భటులు నా మీద కత్తులు వెయ్యలేరు - పైకి చూడు. నీ ప్రతి ఒక్క భటుడి వెనుక నా బృందావన వాసులు బాకులు పట్టి నించున్నారు... చూడు' అన్నాడు నిశ్చలంగా కంసుడిని కళ్ళతోనే జయిస్తూ—

కంసుడు అనుమానంతో తల పైకెత్తి మేడ వరసమీద బారులు కట్టి ఆయుధాలతో నించున్న భటుల్ని చూస్తున్నాడు.

శ్రీకృష్ణ భగవానుడు కొదమ సింహంలా గర్జించి పైకి లంఘించాడు.

కంసు డదిరిపడి చూశాడు.

కృష్ణుడు పదడుగుల ఎత్తునుంచి తన మీదకు ఉరుకుతున్నాడు.

బలిని పాతాళానికి తొక్కిన పాదాలు—

భయంకరంగా తన మీదకు వస్తున్నాయి.

అప్రయత్నంగా చేతులు జోడిస్తున్నాడు.

క్షణార్ధంలో అవి వచ్చి అతని ఎదురు రొమ్మున దిగాయి. లేస్తున్న కంసుడు వెనక్కి ఒరిగి సింహాసనం మీదికి ఒరిగాడు.

ఉత్తర క్షణంలో కృష్ణుడు అతని జుట్టుపట్టుకు లాగి విసురుగా తోశాడు. కంసుడు సభా మధ్యాన వెల్లకిలా పడ్డాడు. రెక్కలు తెగిన పర్వతంలా పడిన ఆ కంసుడి మీదకు కృష్ణుడు వురికాడు.

ఎదురు రొమ్ముమీద కూర్చున్నాడు. పిడికిలి బిగించి పైకెత్తాడు.

'నిన్ను ఇరవై రెండేళ్ళుగా సంహరిస్తున్నాను. నీ క్షోభ నీలాటి నికృష్టులకు గుణపాఠం హెచ్చరిక కావాలని ఇన్నింత నిదానంగా చంపాను. ఇపుడు నీకు మూడే చావు - నిజానికి చావుకాదు; నీ నరక బాధనుండి విడుదల చేసే వరం' అంటూ ఒక్క పోటు పొడిచాడు.

కంసుడు ఎర్రటి విషం కక్కాడు.

సభ అంతా చేతులు జోడించి ప్రభువుకు వందనం చేసింది.

భేరీ తూర్యనాదాలు మోగాయి...

లేచి నడుస్తున్న స్వామిపై పుష్పవృష్టి కురిసించి.

○ ○ ○

శ్రీకృష్ణ భగవానుడిపేర జయధ్వానాలు చెలరేగి మిన్నంటాయి. కంసుడి చెరసాల నుండి వేలాది స్త్రీలు పిల్లలు ఆనంద బాష్పాలతో బయటకి వచ్చి కృష్ణుడికి మొక్కి వెళ్తున్నారు.

కృష్ణుడు, రాముడు, అక్రూరుడు ముందుకు సాగారు.

దేవకీ వసుదేవులు చెరసాలనుండి బయటకు రాగానే కృష్ణుడు వారి పాదాలకు నమస్కరించాడు.

ఆనందాతిరేకంతో పరవశులై - కర్తవ్యం తోచక రెండు క్షణాలు నిలబడిపోయారు వారు.

దేవకి తటాలున వంగి బిడ్డను లేవదీసి గాఢంగా కౌగలించుకుంది. శిరస్సున ముద్దు పెట్టి మూర్ధం ఆఘ్రాణించింది.

కృష్ణుడు తిరిగి చేతులు జోడించాడు...

'అమ్మా: కన్నతల్లివి - కన్నెత్తి చూడకుండా ఒక్క

చుక్క పాలు తాగకుండా నీకు ఇన్నాళ్ళూ దూరమై పోవడం - విధి విలాసం... బాధ పడకమ్మా... ఇవ్వాళ నీ చేతి ప్రసాదం తినాలని వచ్చాను... ఇవ్వాళ అష్టమి... నా పుట్టినరోజు' అన్నాడు.

'ఇంకా వ్రేపల్లెకి వెళ్ళనివ్వను' అంది దేవకి. కళ్ళలో చిన్న భయం మెరిసింది - బిడ్డ చేతిని గట్టిగా పట్టుకుంటూ—

వాసుదేవుడు తండ్రికేసి చూసి మందహాసం చేశాడు.

'వ్రేపల్లె కాదు... బృందావనం' అన్నాడు.

'అన్ని వనాలూ ఇక్కడికే వస్తాయి... ఈ రాజ్యం నీ పాలనలో చల్లగా వుంటుంది' అన్నాడు ఉగ్రసేనుడు.

'మహారాజా మన్నించండి... రాజ్యపాలన నా మతం కాదు, అభిమతం కాదు... నేను నిర్వహించవలసివున్న ధర్మ ప్రవర్తన కార్యక్రమంలో కంసవధ తొలిపాదం మాత్రమే... కురుక్షేత్ర సంగ్రామం దాకా - నాకు విశ్రాంతి వుండదు... మన మందరం కర్మచక్ర నిబద్ధులం... ధర్మ సంస్థాపనే నా ధ్యేయం - నా జీవితం...' అన్నాడు శ్రీకృష్ణ భగవానుడు...

సర్వేజనా స్సుఖినో భవన్తు—

కానుక

పొద్దు వాటారినప్పటినుంచి మర్రిచెట్లలోంచి ఊడలు ఊడలుగా దిగజారుతున్న చీకటి, చలమై చెరువై చెలరేగిన యమునై సముద్రమై భూమినంతా ముంచివేసింది. ఆకాశమెత్తున ముంచేసింది. రాధ కంటి కాటుకలా కృష్ణుడి వంటి నలుపులా నందుడి యింటి చల్లలా చిక్కబడింది.

చెట్టుకింద చీకటిమధ్య చితుకుల మంటలు కృష్ణుడిమీద ఎర్ర పట్టు కండువాలా కదలాడుతున్నాయి. చీకటి చిక్కతనాన్ని చక్కదనాన్ని వెలుగెత్తి చాటుతున్నాయి. మంటలో ఊచ కాలుస్తున్న గోపన్న ముఖంమీద, అతని పక్కన చెల్లాచెదరుగా పడివున్న వేణువులమీద, కొంచెం అవతలగా బొత్తికట్టివున్న వెదుళ్ళమీద వెలుగునీడల భాషతో కావ్యాలు రాస్తున్నాయి.

ఇంక మూడు ఝాములుపోతే సప్తమి తెల్లవారుతుంది. కృష్ణుడి పుట్టినరోజు వచ్చేస్తుంది. పాతిక పండగలనాడు గోపన్న ఆరంభించిన వేణు నిర్మాణం ఇంకా తెమలలేదు. రేపటికైనా సాధించి, తన వేణువును ఆయనకు సమర్పించాలి. రేపివ్వలేకపోతే ఇంక ఈ జన్మ కివ్వలేదు... వేళయిపోయింది.

"నాయనా, బువ్వదినవే" అన్నాడు చిన్న గోపన్న వచ్చి. గోపన్న కీ మాట వినపడలేదు.

అతని హృదయం బృందావనిలో ఉంది. అక్కడకు కృష్ణుడు వస్తాడు. వచ్చే వేళయింది. అప్పుడే గోపికల అందెల రవళి వినిపిస్తోంది. గాజుల గలగలలు, నవ్వుల కిలకిలలు వినిపిస్తున్నాయి. ఇవతల వెదురు పొదలు సన్నగా ఈలవేస్తున్నాయి. ఈ ఉపశ్రుతు లన్నిటినీ కలుపుకొని కొద్ది క్షణాలలో మోహన మురళీ రవళి వినవస్తుంది.



గోపన్న ఎన్ని యుగాలుగా అక్కడ చెట్టుమాటున కూర్చున్నాడో అతనికే తెలియదు. ఆకులలో ఆకై. పువ్వుల్లో పువ్వయి, ఇసుకలో రేణువై, యమునలో బిందువై స్తబ్ధంగా కూర్చుని కృష్ణ వంశీనాదాన్ని హృదయంలో పోసుకున్నాడు. పరిశుద్ధమైన స్వరాలలో ఒక్కొక్క స్వరాన్ని మనసులో నిలుపుకొని దాని విశ్వరూపం దర్శించడానికి తపస్సు చేశాడు. అదే మనసులో పదిలంగా దాచుకుని పరుగున తన కుటీరానికి వచ్చాడు. కొత్త వెదురుకోసి స్వరద్వారాలు వేసి, మనసులో స్వరాన్ని ఇందులో పలికించబోయాడు. ఆ స్వరం తన ఈ వేణువులో పలికితే ఇది కృష్ణయ్యకు కానుక ఇవ్వాలి. కాని అది పలకలేదు. పలికించాలని అతను ఎన్నివేల వేణువులో చేశాడు. తన ఉచ్ఛ్వాస విశ్వాసాలన్నీ వేణువుకు శ్రుతి చేయడానికే ఉపయోగించాడు.

సమ్మోహనంగా భీకరంగా అద్భుతంగా ఎరుకపడసాగింది. శ్రుత సంగీతంలా ఇందులో అపశ్రుతులులేవు. అపశబ్దాలు లేవు. అన్ని వేదాంతాలూ, అన్ని సత్యాలూ అర్ధసత్యాలేనంటూ, తనలో భాగాలే నంటూ నిలచే అద్వైత సత్యంలా ఈ సంగీతంలో అపస్వరాలు కూడా అర్ధస్వరాల, పూర్ణస్వరాల పక్కన నిలిచి, అందాలు సంతరించుకొని, అందంగా భాసించసాగాయి. ప్రతి అణువునా భగవంతుడున్నాడు, ప్రతి జీవిత కాలమే తక్కువ. ఒక జీవితానికి లెక్కదేలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కొన్ని కోట్లు ఉంటాయి. వాటిని వృథాచేస్తే ఎలా? యమున ఒడ్డున పొదల మాటున దాగి కూర్చుని కృష్ణుడి మురళి విన్నప్పుడు అతను వూపిరి బిగపట్టుకునే కాలం గడిపేవాడు. అక్కడ పొదుపు చేసిన దానిని తన కొత్త వేణువును పూరించడానికి ఉపయోగించేవాడు. తీరా పూరించేసరికి అది శ్రుతి శుద్ధంగా వినబడేది కాదు. పైగా జీర బోయేది. లోపలేవన్నా ఈనెలు లేచాయేమోనని గోపన్న ఎంతో శ్రద్ధగా లోపలకూడా నునుపు చేసేవాడు. ఇక పట్టుకు వెళదాం అని లేచేసరికి దాని గొంతుక జీరపోయేది.

గోపన్న పూర్వం ఎన్నో వేణువులు చేశాడు. తృప్తిగా వాయించాడు. బాగానే ఉందనుకున్నాడు. కాని ఒక స్థాయి వచ్చాక అతని కొక ఊహపోయింది. వేణువును కిందపెట్టి, సంగీతాన్ని ఊహించబోయాడు. ఊహించిన సంగీతాన్ని భావనచేసి, భావించినదానిని అనుభవించి దర్శించేసరికి అతని కొక సత్యం తోచింది. సంగీతాన్ని అనుభూతికి తెచ్చుకోవడానికి జంత్రగాత్రాలను ఉపయోగించబోవడం అవివేకం. జలపాతాన్ని వెదురు గొట్టంలో ఇముడ్చడం పొరపాటు. సముద్రాన్ని పాలకడవలో ఇముడ్చడం తెలివితక్కువ... ఊహకందే సంగీతంలో పాటకందేది శత సహస్రాంశం వుండదు.

ఊహ సాగినకొద్దీ స్వరలత దిగంతాలవరకు వ్యాపించసాగింది. ఆకాశం వరకు వ్యాపించసాగింది. రోదసి అంతా నిండిపోసాగింది. క్రమంగా, ఓంకార జనితమైన స్వరార్ణవం తిరిగి ఓంకారమై భువన

శబ్దంలోను సంగీతం ఉంది అన్న వాక్యాల తాత్పర్యం అతనికి ఎరుకపడింది. గోపన్న అర్భక దేహాని కిది దుర్భరమైపోయింది. అతను ఊహించిన సంగీతాన్ని అనుభవించడానికి శక్తి చాలలేదు... అవయవాలన్నీ విలవిలలాడేవి. హృదయం బద్దలయిపోయే స్థితికి వచ్చింది. అందం, ఆనందం దగ్గరగా వస్తే ఇంత దుర్నిరీక్ష్యాలై దుర్భరాలై ఉంటాయని అతను ఊహించుకోలేదు. ఇప్పుడు గ్రహించి కూడా తప్పించుకోలేదు...

అతన్ని ఆ స్థితినుంచి ఐహిక స్థితికితెచ్చి కాపాడినది—కృష్ణుడి మురళి... అది విన్న క్షణాన అతను ముగ్ధుడైపోయాడు. ఆ స్థితిలోకే మేలుకొన్నాడు. తన ఊహకు అందిన దానికన్న గొప్పదీ, ఆకళింపు చేసుకుని అనుభవించడానికి సులువైనదీ అతనికి ఆనాడే వినిపించింది. నాటినుంచి ప్రతి నిత్యం కృష్ణుడు ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్ళి మురళి వినేవాడు. కొత్తల్లో కొన్నాళ్ళు గోపకాంతలు కంగారు పడ్డారు. తరవాత అతన్ని ఒక గోపుగా, చెట్టుగా జమకట్టేశారు.







ఇంత మోహనమైన సంగీతాన్ని కృష్ణుడు ఒక వెదురు ముక్కలో ఎలా ఇమిడ్చాడో అని గోపన్న ఆలోచించాడు. ఒకసారి అతని ఇంటికి వెళ్ళి ఆ మురళిని ఎత్తుకు వచ్చాడు. యమున ఒడ్డుకు వచ్చి, చెంగు చాటునుంచి మురళి తీసి వాయించాలనుకునేసరికి అది కనబడలేదు!

మాయదారి కృష్ణుడు గజదొంగ దగ్గర నేను దొంగతనమేమిటి అనుకున్నాడు గోపన్న.

కాని గబిదొంగ ఆ సాయంత్రం కనబడి, "గోపన్నా, నా మురళీ తీసుకుపోయావు కదూ... పోనీ ఇంకొకటి చేసిపెట్టు" అన్నాడు నవ్వి.

గోపన్న తెల్లబోయాడు.

ఆ మర్నాటినుంచి వేణు నిర్మాణం ఆరంభించాడు గోపన్న. ఆరంభించిన నాటినుంచి అతనిలో కొత్త శక్తి, కొత్త చైతన్యం మేల్కొన్నాయి. తన చేతులలో రూపు దిద్దుకుంటున్న మురళి రేపు మాపటివేళ కృష్ణుడి హస్తాలను అలంకరిస్తుందని, ఆయన అందులోకి జీవాన్ని ప్రతిపాదిస్తాడని అనుదినం ఆశపడుతూ ఆనందిస్తూ మురళిని రూపొందించాడు. ఆయన పెదిమలూనేచోట, వేళ్ళు ఆనేచోట మురళి కఠినంగా ఉండి నొప్పించకుండా ఉండేందుకు స్వర ద్వారాలను తన అరచేతులతో, మునివ్రేళ్ళతో అరగదీశాడు.

మురళి సిద్ధంకాగానే శ్రుతి చూశాడు. గుండె బద్దలయినంత పనయింది. అది శ్రుతి శుద్ధంగా లేదు. పైగా జీర, రెండు మూడు వేణువులు పలికినట్టుంది. కృష్ణుడు ఊదుతాడన్న ఆనందంలో దానికి ఒళ్ళు పులకరించిందా?

గోపన్న అది పడేసి మరోటి చేశాడు. అదీ అంతే.

మర్నాడు వెదురు చాలా తెప్పించాడు. పది పన్నెండు చేశాడు. ఒక్కొక్కటీ వూది చూడడం, నచ్చక పారవెయ్యడం...

"నీకు వేణువు ఇవ్వనిదే నా ముఖం చూపను కృష్ణయ్యా" అనుకున్నాడు. నాటినుంచి ఇదేపని పెట్టుకున్నాడు. సాయంకాలం బృందావని వేపు వెళ్ళి వేణుగానం వినడం, ఉదయాస్తమానం కొత్త వేణువులు చెయ్యడం.

ఊళ్ళో వాళ్ళంతా ఇది వింతగా చెప్పుకున్నారు. కొత్తలో మెచ్చుకున్నారు. తరవాత ఆ సంగీతం పిచ్చి వదిలిందనుకుంటే, మళ్ళీ ఆ పిల్లంగోవి పిచ్చి పట్టింది గావాల అని నవ్వుకున్నారు. తరవాత నవ్వారు.

గోపన్న పనికిరావని పడేసిన వందలాది వేణువులను కొత్తలో గొల్లపిల్లలు తీసుకుపోయేవారు. తరవాత అతనికి భయం వేసింది వాటిలో ఏదన్నా కృష్ణయ్య దగ్గరకు పోతుందేమోనని. అందుకని చేసిన వేణువులన్నీ పాకలో అటకమీద పడేసేవాడు.

యమున ఒడ్డున గోపన్న పాక, పాక ప్రక్కన పందిరి కింద వెదుళ్ళు, చెట్టుకింద కొలిమి చూసి ఊళ్ళో జనం హేళన చేశారు—

"గోపన్నా! ఏకంగా పెద్ద కలప దుకాణం పెట్టరాదూ... వ్యాపారం చేసినట్టూ ఉంటుందీ" అని...

గోపన్నకు నవ్వడానికి, నవ్వుకోడానికి కూడా తీరికా, కోరికా, ఓపికా లేవు...

ం ం ం

పాతికేళ్ళు గడిచిపోయాయి. కృష్ణయ్య పెద్దవాడయ్యాడు. బృందావనికి రావడంలేదు. పట్నవాసం మనిషైపోయాడు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. అయినా కృష్ణాష్టమి వెళ్ళిన ప్రతి నవమి



నాడు గోపన్న కొత్త ఉత్సాహంతో కొత్త వేణువు ఆరంభిస్తూ 'పై సారి పుట్టినరోజు కేనా పంపాలి...' అనుకొనేవాడు. పుట్టినరోజు వచ్చేది-వెళ్ళేది... వేణువు మాత్రం కుదిరేది కాదు. ఏమిటో ఆ జీర—ఎవరో వెక్కిరిస్తూన్నట్టు...ఏదో శాపం వున్నట్టు...

○ ○ ○

"నాయనా బువ్వదినవే..." అన్నాడు చిన్న గోపన్న.

తండ్రి వాడివంక చూశాడు. జాలివేసింది. తల్లి లేని బిడ్డ. తండ్రి వుండీలేని బిడ్డ. ఆ వయసుకి వాడే రోజూ ఇంత గంజి కాచి

పెడుతున్నాడు. వాడి అచ్చటా ముచ్చటా చూసుకుంటున్నాడు. అదీ మంచిదే అయింది.

రేపు అష్టమి వెళ్ళిన నవమినాటినుంచి, నాయన లేడని బెంగ టిలుతాదన్న బెంగలేదు. ఎవరికివారే యమునాతీరే...

"బువ్వదింటాలేగాని; రేపు కిష్టయ్య పుట్టిన రోజు... నువ్వు నందయ్యగారి లోగిలికెళ్ళి ఎవరూ చూడకుండా ఇది కిష్టయ్యకిచ్చి — మా నాయనిచ్చి రమ్మన్నాడని చెప్పి రావాల" అన్నాడు గోపన్న.

"బువ్వదిను మరి" అన్నాడు బిడ్డ.

గోపన్నకి ఎందుకో వాణ్ణి చూడగానే బాలకిష్టయ్య గుర్తొచ్చాడు.

అటూ ఇటూ బెరుగ్గాచూసి గబుక్కున వాడ్ని దగ్గరకు లాక్కుని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

బుల్లాడి కిది కొత్త... వాడు తెల్లబోయి చూసి బుగ్గ తుడుచుకున్నాడు. "బువ్వదిను మరి" అన్నాడు.

"మురళి పట్టికెళతావా ?"

"నువ్వలాగే అంటావు. పొద్దుటేలేమో ఇది బాగాలేదు ఒద్దులే అంటావు."

"అనను. ఈసారి చేసేది బాగుంటదిలే. అయినా సూడమగా" అన్నాడు గోపన్న నీరసంగా నవ్వి.

"బువ్వదిను మరి" అన్నాడు చిన్న గోపన్న.

ం ం ం

మర్నాడు ఉదయమే గోపన్న కొడుక్కి తలంటి నీళ్ళుపోశాడు. సాంబ్రాణి ధూపమేసి జుట్టు ఆరబెట్టాడు. చిక్కు దీశాడు. వదులుగా కొప్పు ముడేసి పూలు తురిమాడు. పట్టు కండువాతీసి పంచె కట్టాడు. మరోటి తీసి ధట్టీ చుట్టాడు. కస్తూరి తిలకం దిద్దాడు. కాటుకదిద్ది, దిష్టి తగలకుండా బుగ్గన చుక్క పెట్టాడు. నెమలీకల పింఛంలోంచి ఒక కన్నుతీసి కొప్పున బెట్టాడు.

చినగోపన్న కీ వరస బొత్తిగా నచ్చలేదు. ఎన్నడూ లేని పనులు చేస్తున్నాడు అయ్య. వాడి కెందుకో గుబులేసింది. కంట నీరు తిరిగింది. జాలిగా నాయన వంక చూశాడు. ముస్తాబు ముగించిన గోపన్న తృప్తిగా ఒకసారి కొడుకును చూశాడు.

క్షణంలో నిర్విణ్ణుడైపోయాడు. ఇదేమిటి బాలకృష్ణుడు... గోపాలకృష్ణుడు... ఇక్కడికి ఎందుకొచ్చాడు ? తాను ఏనాడో ఎత్తుకొచ్చిన వేణువు కోసమా ?

గోపన్న తేరిపార చూశాడు. సందేహం లేదు-కృష్ణుడే. అప్రయత్నంగా చేతులు జోడించి దండం పెట్టాడు. ఒక్కసారిగా కన్నీరు కట్టలు తెంచుకుంది. అది దుఃఖమో, ఆనందమో.

"ఏందే అయ్యా" అంటూ బారున వచ్చి కౌగలించుకున్నాడు కొడుకు. తండ్రి దండం పెట్టేసరికి వాడికి ప్రాణం కంగారు పెట్టేసింది.

గోపన్న ఉలికిపడి కళ్ళు తుడుచుకున్నాడు. "దేవుడికి దండం పెట్టానురా" అన్నాడు. "ఏదే...మురళేదే" అంటూ అటూ యిటూ చూశాడు. కనబడలేదు.

"అటక మీదెట్టాను. రాతిరి ఎలకలొస్తే..." అన్నాడు చిన గోపన్న భయపడుతూ.

"ఆ! ఎంత పన్జేశావురా బాబూ..." అన్నాడు గోపన్న. ఎలకలుండేదే అటకమీద అని తెలిసి అక్కడ పెట్టటమేమిటని కేక లెయ్యబోయాడు గాని మనస్కరించలేదు.

అటకమీద కెక్కి చూశాడు. అక్కడ తను పనికిరావని పడేసిన వేణువులు గుట్టలుగా వున్నాయి. అందులో ఏది కొత్తది ? ఏది మంచిది ?

గోపన్న ఆ వేణువులన్నీ కిందకు దించాడు.

ఒక్కొక్కటీ తీసి వూది చూడసాగాడు.

"ఇది కాదు."

"ఇదీ కాదు..."

"ఇదీ కాదు..."

ఇటువేపు గుట్ట తరుగుతోంది. అటువేపుది పెరుగుతోంది. కాలం కరుగుతోంది.

మధ్యాహ్నం భోజనం వేళ వచ్చింది. వెళ్ళింది. గోపన్న "ఇది కాదు ఇదీకాదు" అనుకొంటూ వేణు పరీక్ష సాగిస్తూనే వున్నాడు. ఇదేదీ కానిదేదో ఉంటుంది. అదే దొరకని కుదరని వేణువు. అదే సత్యం.

చిన్న గోపికి తండ్రిని పలుకరించేందుకు సాహసం చాలలేదు. వాడూ అలాగే కూర్చున్నాడు... చెమటకి కస్తూరి బొట్టు కరిగి పోయింది. కాటుక చెరిగిపోయింది. పూలు వాడిపోయాయి. వాడి సంతోషం, ఉత్సాహం చెన్నుదరిగాయి. అన్నం తిననందువల్ల నీరసం కూడా కలిగింది.



కాని, గోపన్న ఇవేమీ గమనించే స్థితిలో లేడు.

ఇదికాదు.

ఇదీ కాదు...

ఇన్ని వేణువుల గుట్టలో ఎక్కడో సత్యమైన కొత్త వేణువు దాగి ఉంది.

అది సత్యమైనదేనా ?

...ఏమో...గోపన్నకి తెలియదు. పరీక్షించి చూడలేదు. అయి వుంటుందని, అయితీరాలనీ...

○ ○ ○ ●

పొద్దు వాటారింది. చీకటి చిక్కబడింది. చిన్న గోపన్న దీపం వెలిగించాడు.

"నాయనా, చీకటి పడిపోతోందే. పుట్టింరోజు పండుగయిపోతుంది" అన్నాడు జంకుతూ. గోపన్న తల వూపాడు. ఇక రెండే రెండు వేణువులు మిగిలాయి. ఒకటి చూశాడు.

ఇదీకాదు.

ఇంక ఒక్కటి మిగిలింది. ఇదేనా...ఏమో... అతను ఉదయం నుండి వెతుకుతున్నది మంచిదికాక, కానందువల్ల ఈ గుట్టలో పడిపోయిందేమో. ఇప్పుడు మిగిలింది— ఒకప్పుడు పనికిరాదని తాను పడవేసిందేమో...

చివరి మురళిని పరీక్షించడానికి గోపన్నకి ధైర్యం చాలలేదు. సత్యం తెలుసుకొని చనిపోగల శక్తిలేదు. మళ్ళీ ఇంకో ప్రయత్నం చేసే ఓపిక లేదు. వ్యవధి లేదు.

"ఇదే" అన్నాడు ధీమాగా.

"ఊదవా ?" అన్నాడు కుర్రాడు.

"ఒద్దు... లగెత్తు... కిష్టయ్య చేతికియ్యి. ఆయనే చూస్తాడు. ఆయనే చెబుతాడు" అన్నాడు గోపన్న.

కుర్రాడు ఇంక ఆగలేదు. మళ్ళీ తండ్రి మనసు మారేలోపల పారిపోవాలనుకున్నాడు. చీకట్లోకి పరుగెత్తాడు.

○ ○ ○

పాతిక సంవత్సరాల గాలివాన వెలిసింది.

గోపన్న నీరసంగా మేను వాల్చాడు. పూర్వం ఊహా సంగీత ప్రపంచంలోకి తొంగిచూసినపుడు కూడా ఇలాటి నిస్త్రాణే కలిగేది. ఇవాళా అదే...

తాను పని ముగించాడా... భగవంతుడికి సరియైన శ్రుతి శుద్ధమైన వేణువును పంపాడా...

ఇన్ని సంవత్సరాలు కృషిచేసి ఇన్ని వేల పరీక్షలు జరిపి, చివరికి పంపిన వేణువును పరీక్షించుకోలేదు. అది కృష్ణయ్యకే వదిలేశాడు. శ్రుతి సరిలేకపోతే ఆయన సరిచేసుకొంటాడు.

అయినా శ్రుతి శుద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా... సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా ?

గోపన్నకు నవ్వు వచ్చింది.





ఎంత పొరబాటు... పాతికేళ్ళ పొరబాటు... ఒక జీవితం పొరబాటు. ఆయన అలుగుతాడా... అలగడు. నవ్వుకుంటాడు. వెర్రి గోపన్న అనుకొంటాడు. అనుకొని మురళిని తన పెదిమల దగ్గిర ఉంచుకుంటాడు. శ్రుతులన్నీ దాచుకున్న బొజ్జలోంచి ఓంకారానికి మూలస్థానమైన నాభిలోంచి మంగళ గళంలోంచి మధురాధరాల లోంచి...

వెన్నా పాలూ ఆరగించిన మధురాధరాలలోంచి, రాధాధరాలను పవిత్రం చేసిన మధురాధరాలలోంచి జీవం వచ్చి తన వేణువులో ప్రవేశిస్తుంది...

తన పక్కనున్న వేణువులోంచి సన్నటి చక్కటి స్వరం నెమ్మదిగా ఇవతలికి రావడం, వచ్చి తన చెంప నిమరడం గమనించాడు గోపన్న.

ఇదేమిటి? తను పనికిరాదనుకొన్న మురళి...

ఇంకో క్షణానికి ఆ పక్క మురళి. ఉత్తరార్ధానికి ఇటుపక్క మురళి మేలుకున్నాయి. మరికొద్ది క్షణాలలో ఆ కుటీరంలోని సహస్ర వేణువులూ భువన మోహనంగా గానం చేయసాగాయి. గోపన్న లేచి కూర్చున్నాడు. భ్రమరాన్ని చూస్తున్న కీటకంలా దశదిశలా పరిభ్రమించాడు. అన్ని వేణువులూ పాడుతున్నాయి. అన్నిటిలోనూ అలనాటి బృందావన కృష్ణుడి మోహనగానమే. అన్నీ శ్రుతి శుద్ధంగా ఉన్నాయి. అపత్యమైన వేణువు లేనేలేదు. భగవంతుడికి ఉపయోగపడని వేణువే లేదు...

గోపన్న విభ్రాంతుడైపోయాడు.

నీరసంగా ఆనందంగా మేనువాల్చాడు. సహస్ర వేణునాద స్వరార్ణవంలో— సాక్షాన్మహావిష్ణువై తేలుతున్నాడు...

వేణుగానం ముగిసిన కొద్ది క్షణాలకు అంతకన్న మధురమైన అడుగుల సవ్వడి వినబడింది. చిన్న గోపన్న వచ్చి వుండాలి. తను పంపిన మురళి మంచిదో కాదో చెప్తాడు. ఈ సత్యం ఇక తెలిసినా మానినా ఒకటే. అంతకన్న గొప్ప సత్యాన్ని దర్శించాడు గోపన్న.

గోపన్న నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

గుమ్మంలో బాలకృష్ణుడు!

పట్టుపంచ పట్టు ధట్టీ కస్తూరి బొట్టు బుగ్గన చుక్క పిగలో పింఛం...

"నువ్వే వచ్చావా కిష్టయ్యా..." అంటూ లేచి కూర్చుని చేతులు జోడించాడు గోపన్న.

"అయ్యా అయ్యా! కిష్టయ్య నీ మురళి వాయించాడే. నాకు బువ్వ పెట్టాడు. ఇక్కడ ముద్దెట్టుకున్నాడు. అయ్యా మరేం... కిష్టయ్య నీ మురళి వాయించేవాడే. కానీ... మరే... ఎంత వాయించినా ఏమీ వినబడలే. అస్సలు పాట రాలేదే... కాని కిష్టయ్య మంచోడు. నన్నిక్కడ ముద్దెట్టు..."

గోపన్న తల పక్కకు తిప్పి గదినిండా పడివున్న వేణువులను చూశాడు.

ఇంతసేపూ గానం చేసి అలసిపోయిన వేణువుల వంక ఆప్యాయంగా సగర్వంగా చూసి ఒకటి తీసి ముద్దు పెట్టుకున్నాడు గోపన్న.